సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 221

బుధవారం 2-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'




చెలరేగిన బట్లర్, హేల్స్

న్యూజిలాండ్‌పై 20 పరుగుల తేడాతో ఇంగ్లండ్ విజయం - 12లో



పండుగ జోష్‌తో టాప్ గేర్

కార్లకు భారీ గిరాకీ. నిరాశపరిచిన ద్విచక్ర వాహనాల విక్రయాలు - 13లో



మోర్బీలో మోదీ పర్యటన

గుజరాత్ మోర్బీలో వంతెన కూలిన ప్రాంతానికి ప్రధాని మోదీ వెళ్లి ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

వివరాలు 6లో



ఆప్‌కు రూ.50 కోట్లిచ్చా..

తనను రాజ్యసభకు నామినేట్ చేస్తానని ఆశ చూపినందుకు రూ.50 కోట్లు ఆప్‌కు ఇచ్చానని ఆర్థిక నేరగాడు సుకేశ్ చెప్పారు.

వివరాలు 6లో



ఆఫ్రికాకు ఆశాకిరణం భారత్

ఆఫ్రికా దేశాలు నౌకా, వైమానిక, రక్షణ ఉపకరణాలు సమకూర్చుకునేందుకు భారత్‌పైనే ఆధారపడ్డాయని ఎగ్జిమ్ బ్యాంక్ పేర్కొంది.

వివరాలు 6లో



ట్విట్టర్‌కు శ్రీరామ్ రిపేర్లు

ట్విట్టర్‌లో కీలక మార్పులు చేర్పులు చేయడానికి శ్రీరామ్ కృష్ణన్‌కు ఎలాన్ మస్క్ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

వివరాలు 6లో



వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్న వారితో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎం మాతృమూర్తి వైఎస్ విజయమ్మ

మహోన్నత గౌరవం

సమాజ సేవకు గుర్తింపుగా మానవతామూర్తులకు ప్రతిష్టాత్మక 'వైఎస్సార్' అవార్డులు

విజయవాడలో ఘనంగా పురస్కారాల ప్రదానోత్సవం

- విశిష్ట సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు మొత్తం 30 వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలు
- మహోన్నత వ్యక్తి పేరిట అవార్డులు అభినందనీయం: గవర్నర్
- సామాన్యుల్లో అసామాన్యులు.. వారి సేవలకు వందనం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సమాజంలో మానవత్వపు పరిమళాలు, ఎల్లలు దాటిన కీర్తి పతాకాలు పురస్కారాల పండుగలో పులకించాయి. నిలువెత్తు వ్యక్తిత్వం, మహోన్నత కీర్తి శిఖరం 'వైఎస్సార్' పురస్కారాలతో సగౌరవంగా సత్కరించి ప్రభుత్వం తన వినమ్రత చాటుకుంది. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మానవతామూర్తులు, విశిష్ట వ్యక్తులను వరుసగా రెండో ఏడాది రాష్ట్ర అత్యున్నత పురస్కారం ''వైఎస్సార్'' అవార్డులతో ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. వ్యక్తులుగా, సంస్థలుగా సమాజంలో గొప్ప పనులు చేస్తున్న ప్రతి ఒక్కరినీ గౌరవించేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను నెలకొల్పింది. వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం విజయవాడలో నిర్వహించారు. తొలుత అమరజీవి పొట్టి శ్రీరాములు, దివంగత వైఎస్సార్ విగ్రహాలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 2022 సంవత్సరానికి గానూ వ్యవసాయం, కళలు-సంస్కృతి, సాహిత్యం, మహిళా - శిశు సాధికారత, విద్య, జర్నలిజం, వైద్యం, పరిశ్రమల రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు మొత్తం 30 అవార్డులను

మిగతా 11వ పేజీలో ▶



'వైఎస్సార్ అవార్డుల' సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

> దశాబ్దాలుగా మన సంస్కృతి, సాంప్రదాయాలకు వారధులుగా నిలుస్తున్న వారిని ఈ అవార్డులతో సత్కరిస్తున్నాం. సమాజం కోసం శ్రమించిన మానవతామూర్తులు, మహనీయులను రాష్ట్ర అత్యున్నత అవార్డులతో సత్కరించుకోవడం సంతోషంగా ఉంది. సామాన్యుల్లోని అసామాన్యులకు, మానవతామూర్తుల సేవలకు వందనంగా 'వైఎస్సార్' అవార్డులు నిలుస్తాయి. అత్యంత ప్రతిష్టాత్మకమైన వైఎస్సార్ అవార్డులు అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వకంగా అభినందనలు.
>
> - సీఎం వైఎస్ జగన్

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరజీవికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

సెంట్రల్ జైలుకు 'జయలక్ష్మి' నిందితుల తరలింపు



రూ.వందల కోట్లు డిపాజిట్ల రూపంలో సేకరించి బోర్డు తిప్పేసిన 'ది జయలక్ష్మి మ్యూచువల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కో–ఆపరేటివ్ సొసైటీ'కి సంబంధించిన కేసులో నిందితులను కాకినాడ సబ్‌జైల్ నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

వివరాలు 14లో ▸

సర్వ దర్శనం టైం స్లాట్ టోకెన్ల జారీ పునఃప్రారంభం



శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో నిరీక్షించే పరిస్థితి లేకుండా సర్వదర్శనానికి టైం స్లాట్ పద్ధతిని టీటీడీ అనుసరిస్తోంది. ఈ నేపథ్యంలో టైంస్లాట్ టోకెన్ల జారీని టీటీడీ పునఃప్రారంభించింది. దర్శనానికి వెళ్లేవారికి తిరుపతిలోనే సర్వదర్శనం టోకెన్లను జారీ చేస్తోంది.

వివరాలు 3లో ▸

సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలపై కేసుల ఉపసంహరణ



సీపీఎస్‌ను రద్దు చేయాలని 2018 అక్టోబర్‌లో నిర్వహించిన ఆందోళనల సమయంలో తమ సంఘం నేతలపై పెట్టిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మరియదాసు తెలిపారు. కేసులను ఎత్తివేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

వివరాలు 2లో ▸

ఈవీఎంలో పార్టీ గుర్తుల తొలగింపునకు సుప్రీం నో




ఈవీఎం, బ్యాలెట్లపై పార్టీ గుర్తులు నిలిపివేయాలంటూ ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈవీఎంలో పార్టీ గుర్తులుండడంపై అభ్యంతరం ఎందుకని ధర్మాసనం ప్రశ్నించింది.

వివరాలు 6లో ▸

మరోసారి మా ఆదేశాలు ఉల్లంఘించ వద్దు

అమరావతి పాదయాత్రికులకు హైకోర్టు హెచ్చరిక

- ఇది రైతులకు మా ధర్మబద్ధమైన ఆదేశం.. ఉల్లంఘిస్తే అనుమతుల రద్దు కోసం కోర్టుకు రండి
- పోలీసులకు స్పష్టీకరణ
- 600 మంది.. సంఘీభావం ఉత్తర్వులను సవరించాలన్న పిటిషన్ కొట్టివేత.. గత ఉత్తర్వుల సవరణకు హైకోర్టు నిరాకరణ
- ఆ షరతులు సహేతుకమైనవే.. సవరణ సాధ్యం కాదు
- యాత్రలో ఒకరి బదులు మరొకరు కుదరదు
- గతంలో తీసుకోని వారికి గుర్తింపు కార్డులివ్వాలి
- సంఘీభావం పేరుతో ఇతరులెవరూ వారితో కలసి పాల్గొనడానికి వీల్లేదు
- తప్పును సరిదిద్దుకునే అవకాశం రైతులకిచ్చి ఉండాల్సిందని వ్యాఖ్య



సాక్షి, అమరావతి: రైతుల పేరుతో అమరావతి నుంచి అరసవల్లి వరకు పాదయాత్ర చేస్తున్న వారికి హైకోర్టు గట్టి షాకిచ్చింది. గత నెలలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలన్న పాద యాత్రికుల అభ్యర్థనను హైకోర్టు నిర్ద్వందంగా తోసిపుచ్చింది. వాటిని సవరించేందుకు ఏ కారణం కనిపించడం లేదని తేల్చి చెబుతూ రైతులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టివేసింది. వారు కోరిన విధంగా ఉత్తర్వులను సవరించడమంటే పాద యాత్రకు పలు షరతులతో అనుమతినిస్తూ ఈ ఏడాది సెప్టెంబర్ 9న ఇచ్చిన ప్రధాన ఉత్తర్వులను సవరించినట్లే అవుతుందని, అందువల్ల ఆ ప్రధాన ఉత్తర్వుల అమలు కోసం ఇటీవల ఇచ్చిన ఆదేశాలను సవరించడం ఎంత మాత్రం సాధ్యం కాదని

మిగతా 3వ పేజీలో ▶

రిజిస్ట్రేషన్ల అధికారంపై వ్యాజ్యం మూసివేత

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు కూడా ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసే అధికారాన్ని కల్పించడం సబ్ రిజిస్ట్రార్ల అధికారాన్ని అడ్డుకున్నట్టు కాదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులతో పాటు సబ్ రిజిస్ట్రార్లు కూడా ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయడానికి అర్హులేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వం హైకోర్టు ముందు ఓ మెమో దాఖలు చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారాన్ని కట్టబెడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) మూసివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారాన్ని కట్టబెడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా కంకిపాడుకు చెందిన కొత్తపల్లి సీతారామప్రసాద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే.

విద్యపైనా విషమా?

- కొన్ని మీడియా సంస్థలు రాజకీయ నేతల పాత్ర పోషిస్తున్నాయి: మంత్రి బొత్స
- విద్య వ్యాపారమైతే భవిష్యత్తే లేదు
- పేదింట్లో ప్రతి బిడ్డా ఉన్నత చదువు చదవాలన్నదే సీఎం తపన
- 3, 4, 5 తరగతులు మాత్రమే సమీప హైస్కూళ్లతో అనుసంధానం
- సర్కారు చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో 37 లక్షల నుంచి 40 లక్షలకు పెరిగిన చేరికలు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదింటి బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం తపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై టీడీపీ అనుకూల మీడియా దుష్ప్రచారం చేస్తోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు రాజకీయ నేతల పాత్ర పోషిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలలపై విషం చిమ్ముతూ తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. విద్యా సంస్కరణలతో విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు తరలిపోతున్నట్లు ఓ పత్రికలో వచ్చిన కథనంపై మంత్రి బొత్స స్పందించారు. వాస్తవానికి

మిగతా 2వ పేజీలో ▶

1వ తేదీనే రూ. 1,404.03 కోట్లు

పింఛన్ల పంపిణీ

తొలిరోజునే 88.55 శాతం మందికి పూర్తి

■ ఠంచన్‌గా ఒకటవ తేదీ తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ మొదలైంది. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వలంటీర్లే వెళ్లి డబ్బులు అందజేశారు. మంగళవారం ఒక్క రోజునే 55,23,610 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,404.03 కోట్లు పింఛన్ల నగదు పంపిణీ చేశారు. 2లో



ఏలూరు బీడీ కాలనీలో సిర్రి నూకరాజుకు దివ్యాంగ పింఛన్ అందిస్తున్న వలంటీర్ వి.లిల్లీ శాంతి

ఇదండీ సంగతి



మీరేం చెయ్యాలో చెప్పడానికి వచ్చారా్సర్! పర్మిషన్ ఇస్తే వచ్చి కలుస్తారట!!

న్యాయ రాజధాని ఏర్పాటు చేయాల్సిందే

కర్నూలులో వేలాది మందితో రాయలసీమ ఆత్మగౌరవ ర్యాలీ

మద్దతు ప్రకటించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా, న్యాయవాద, విద్యార్థి సంఘాలు

కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు అంగీకరించాలి

కర్నూలు కలెక్టరేట్ వద్ద భారీ మానవహారం 14లో




కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు న్యాయ రాజధాని కోసం భారీగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

'అన్నమయ్య' పునర్నిర్మాణం

రూ.787 కోట్లతో చేపట్టే ప్రతిపాదనకు సీఎం జగన్ ఆమోదం

- చెయ్యేరుకు నాలుగు లక్షల క్యూసెక్కుల వరద దాటినా తట్టుకునేలా
- మట్టికట్ట కాకుండా 440 మీటర్ల పొడవుతో కాంక్రీట్ డ్యామ్ నిర్మించాలన్న నిపుణుల కమిటీ
- హైడ్రాలిక్ సిలిండర్ హాయిస్ట్ విధానంలో నిర్వహించేలా గేట్లు
- అదనపు స్పిల్‌వే నిర్మించాలన్న డ్యామ్ సేఫ్టీ కమిటీ నివేదికను బుట్ట దాఖలు చేసిన టీడీపీ సర్కార్
- ఫలితంగా ఆకస్మిక వరదలకు తెగిన అన్నమయ్య ప్రాజెక్టు మట్టికట్ట



సాక్షి, అమరావతి: ఆకస్మికంగా వచ్చిన భారీ వరదలతో గతేడాది నవంబర్ 19న తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.787 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పునర్నిర్మాణానికి జలవనరుల శాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఈమేరకు పరిపాలన అనుమతి ఇస్తూ జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేయనుంది. చెయ్యేరుకు వందేళ్లలో ఒకసారి గరిష్టంగా 2.40 లక్షల క్యూసెక్కులు, 200 ఏళ్లకు ఒకసారి గరిష్టంగా 2.85 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా

ఏపీ మరింత అభివృద్ధి చెందాలి

ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన అమిత్‌షా



సాక్షి, అమరావతి: ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్ర నాయకుడు అమిత్‌షా శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. 'అద్భుతమైన సంస్కృతి, గొప్ప మనసు ఉన్న ప్రజానీకానికి ఆంధ్రప్రదేశ్ ప్రసిద్ధి చెందింది. రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తున్నాను' అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్ర ప్రాంతానిది కీలక పాత్ర

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్

సాక్షి, అమరావతి: దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్ర ప్రాంతం నిర్ణయాత్మకపాత్ర పోషించిందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. గవర్నర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం ఫలితంగా తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రావతరణ వేడుకలు

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన నేతలు



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో నేతలు

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల అమలు కమిటీ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ నారాయణమూర్తి, ప్రభుత్వ మార్కెటింగ్, సహకార సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి జోహార్లు

సోము వీర్రాజు

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో తొలి భాషాప్రయుక్త రాష్ట్రసాధనలో పాల్గొన్న మహనీయులకు, ముఖ్యంగా ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారికి జోహార్లని ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలపై కేసుల ఉపసంహరణ

ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మరియదాసు

సాక్షి, అమరావతి: సీపీఎస్‌ను రద్దు చేయాలని 2018 అక్టోబర్‌లో నిర్వహించిన ఆందోళనల సమయంలో తమ సంఘం నేతలపై పెట్టిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మరియదాసు తెలిపారు. తమ సంఘం ఆధ్వర్యంలో 2018, అక్టోబర్ 2న విజయవాడ ధర్నా చౌక్ వద్ద చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను అప్పటి ప్రభుత్వం భగ్నం చేసి 26 మందిపై కేసులు పెట్టిందని తెలిపారు. కేసును విచారించిన కోర్టు 19 మందిపై కేసులు కొట్టివేసిందన్నారు. మిగిలిన ఏడుగురిలో గురుగుబెల్లి సరస్వతి రావు (76) గత సంవత్సరం మృతి చెందారని, ఇంకా ఆరుగురిపై కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ కేసులో తనతోపాటు మిగిలిన నేతలపై గత నెల 27వ తేదీన అరెస్టు వారెంట్ జారీ చేసిందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించి కోర్టు ఫార్మాట్‌లో కేసులను ఉపసంహరిస్తూ విజయవాడ ఒకటవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేసిందని తెలిపారు. దీంతో కేసును కోర్టు డిస్పోజ్ చేసిందన్నారు. కేసులను ఎత్తివేసినందుకు ప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన వివిధ సంఘం నాయకులకు మరియదాసు ధన్యవాదాలు తెలిపారు.



కర్నూలు జిల్లా నంద్యాలలో చికిత్స పొందుతున్న తిరుపాడుకు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్‌కు పింఛన్ ఇస్తున్న వలంటీరు శ్రీనివాసులు



కాకినాడ జిల్లా యండమూరులో వృద్ధురాలు వనుం నారాయణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వనుం సత్యశ్రీ



తిరుపతి జిల్లా కంచనపుత్తూరులో లబ్ధిదారుకు పింఛన్ పంపిణీ చేస్తున్న గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వలంటీర్ సీతాకల్యాణ్‌గౌడ్



గుంటూరులోని శ్రీరాంగనర్‌కు చెందిన రమ్యకు దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీరు తిరుపతమ్మ (తొమ్మిది నెలల గర్భిణి)



ఒంగోలు 9వ డివిజన్ ఇందిర కాలనీలో వృద్ధురాలు చేజర్ల అంజమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తిరుమల



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బూర్జపాడులో కొర్లాపు శకుంతలకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దున్న జ్యోతి



కడప నగరంలోని రవీంద్రనగర్‌లో డయాలసిస్ పేషెంట్ షావలికి రూ.10 వేలు పింఛన్ నగదును అందజేస్తున్న వలంటీర్ స్వాతి



విజయవాడలోని తూర్పు పాకల ప్రాంతంలో రాములమ్మకు పింఛన్ ఇస్తున్న సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ నిర్మలకుమారి, వలంటీర్ రాణి



విజయనగరం రెల్లివీధిలో సోము గురుమూర్తికి దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రియవాణి



అనంతపురం 32వ డివిజన్‌లో లక్ష్మీదేవికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ జాహ్నవి

1వ తేదీనే రూ. 1,404.03 కోట్లు పంపిణీ

తొలిరోజునే 88.55% మందికి పూర్తి..

సాక్షి, అమరావతి: ఠంచన్‌గా ఒకటవ తేదీ తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ మొదలైంది. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వలంటీర్లే వెళ్లి డబ్బులు అందజేశారు. మంగళవారం ఒక్క రోజునే 55,23,610 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,404.03 కోట్లు పంపిణీ చేశారు. ఈ నెలకు గాను 62,33,382 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ.1,585.60 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఒక్క రోజు ముందే ఆయా గ్రామ వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పంపిణీ ప్రారంభించి తొలి రోజు 88.55 శాతం మందికి పంపిణీ పూర్తి చేసినట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. వలంటీర్ల ఆధ్వర్యంలో ఐదవ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.



నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాలి మురళికి పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్ బొమ్మి యమున



విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనకాపల్లి జిల్లా చౌడువాడ గ్రామానికి చెందిన ఎస్.అప్పారావుకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ పార్వతీశం

'అన్నమయ్య' పునర్నిర్మాణం

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు అంచనా వేయగా 140 ఏళ్లలో ఎన్నడూ లేని రీతిలో గతేడాది అన్నమయ్య ప్రాజెక్టుకు 3.20 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఈ నేపథ్యంలో చెయ్యేరుకు నాలుగు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా స్పిల్‌వే నిర్మించాలన్న సీఎం జగన్ ఆదేశాల మేరకు జలవనరుల శాఖ అధికారులు అన్నమయ్య ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు.

నాడు.. అదనపు స్పిల్‌వే నిర్మించకపోవడంతోనే

అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బాదనగడ్డ వద్ద చెయ్యేరుపై 2.24 టీఎంసీల సామర్థ్యంతో అన్నమయ్య ప్రాజెక్టును 1981లో ప్రారంభించగా 2001కి పూర్తి చేశారు. 206.65 మీటర్ల ఎత్తుతో 94 మీటర్ల పొడవున స్పిల్‌వే, అనుబంధంగా 336 మీటర్ల పొడవున మట్టికట్టను నిర్మించారు. స్పిల్‌వేకు 13.75 మీటర్ల ఎత్తు, 14 మీటర్ల వెడల్పుతో ఐదు గేట్లు అమర్చారు. ఈ ప్రాజెక్టు కింద 22,500 ఎకరాల ఆయకట్టు ఉంది. 2012లో జల వనరుల శాఖ 3–డీ అధ్యయనంలో అన్నమయ్య ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి గరిష్టంగా 2.17 లక్షల క్యూసెక్కులే దిగువకు విడుదల చేయవచ్చని తేలింది. 2017లో ప్రాజెక్టును తనిఖీ చేసిన డ్యామ్ సేఫ్టీ కమిటీ 1.30 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేసేలా అదనంగా మరో స్పిల్‌వే నిర్మించాలని ఇచ్చిన నివేదికను టీడీపీ సర్కారు పట్టించుకోలేదు. గతేడాది నవంబర్ 16, 17, 18, 19 తేదీల్లో శేషాచలం– నల్లమల అడవులు, చెయ్యేరు, బహుదా, మాండవ్య పరీవాహక ప్రాంతాల్లో కుంభవృష్టి కురిసింది. 17న అన్నమయ్య ప్రాజెక్టులో సగటున 1.75 టీఎంసీలను నిల్వ చేస్తూ వచ్చిన వరదను వచ్చినట్టుగా అధికారులు దిగువకు వదిలేశారు. 18న రాత్రి 8 గంటలకు వరద 77,125 క్యూసెక్కులకు చేరడంతో దిగువకు 1,09,124 క్యూసెక్కులను వదులుతూ వచ్చారు. ఆ రోజు రాత్రి పది గంటలకు ప్రాజెక్టు గేట్లను పూర్తిగా ఎత్తేసి 1,46,056 క్యూసెక్కులు దిగువకు వదిలేశారు. 19న అర్ధరాత్రి 3 గంటలకు అన్నమయ్య ప్రాజెక్టులోకి 3.20 లక్షల క్యూసెక్కులు రావటంతో మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. సామర్థ్యం చాలక మట్టికట్ట పైనుంచి దిగువకు వరద పారింది. దీంతో 19న ఉదయం 6.30 గంటలకు అన్నమయ్య ప్రాజెక్టు మట్టికట్ట తెగింది.

440 మీటర్ల పొడవు..
4 లక్షల క్యూసెక్కులు దాటినా

చెయ్యేరుకు నాలుగు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువగా వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా దృఢంగా అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మించాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈ క్రమంలో మట్టికట్ట కాకుండా 440 మీటర్ల పొడవున కాంక్రీట్ కట్టడం (స్పిల్‌వే)తో ప్రాజెక్టును నిర్మించాలని నిపుణుల కమిటీ సూచించింది. నాలుగు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువ వరద వచ్చినా దిగువకు విడుదల చేసేలా గేట్లను సులభంగా నిర్వహించేందుకు హైడ్రాలిక్ సిలిండర్ హాయిస్ట్ విధానంలో పనులు చేపట్టాలని నివేదిక ఇచ్చింది. ఆ నివేదిక ఆధారంగా అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రూ.787 కోట్లతో జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

జిల్లా స్థాయిలో ఆధార్ పర్యవేక్షణ కమిటీలు

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ సమీర్‌శర్మ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆధార్ సంబంధిత కార్యకలాపాలన్నీ పర్యవేక్షించేందుకు కలెక్టర్ల అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ సమీర్‌శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు పిల్లలతో సహా నూటికి నూరు శాతం ఆధార్ అనుసంధానం చేయించడం, సంబంధిత అంశాలను మరింత పటిష్టంగా అమలు కోసం జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 5.17 కోట్ల ఆధార్ నంబర్లు జారీ చేయగా.. 97 శాతం జనాభాకు ఆధార్ కవర్ అయినట్టు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఆధార్ సంబంధిత కార్యకలాపాల పర్యవేక్షణకు కలెక్టర్ అధ్యక్షునిగా జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశామని, ఇవి కనీసం మూడునెలలకోసారి సమావేశమై ఆధార్ సంబంధిత కార్యకలాపాలను సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

కమిటీ పర్యవేక్షించే అంశాలు ఇలా..

కవర్ కాని ప్రాంతాల్లో అదనపు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు. జిల్లా, సబ్ జిల్లా, బ్లాక్ స్థాయిలో ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు. జనన రిజిస్ట్రేషన్‌తో ఆధార్ అనుసంధానం చేయడం. వివిధ పథకాలన్నింటికీ ఆధార్ అనుసంధానం చేయడం. ఆధార్‌కు సంబంధించి మోసపూరిత కార్యకలాపాలను పర్యవేక్షించడం. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాల కార్యకలాపాలను పర్యవేక్షణ చేయడంతోపాటు సమస్యలను పరిష్కరించడం. ఆధార్‌కు సంబంధించి నిపుణులు అవసరమైతే చైర్మన్ కమిటీలో నియమించవచ్చు.

ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడితే పూర్తి రాయితీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) పరిధిలో నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడుతోన్న ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులందరికీ 2019 నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా రాయితీ ఇస్తోందని సంస్థ సీఎండీ జే పద్మాజనార్దన రెడ్డి తెలిపారు. సెంట్రల్ డిస్కం పరిధిలో ప్రభుత్వం 4.56 లక్షల ఎస్సీ విద్యుత్ వినియోగదారులకు రూ.574.58 కోట్లు, 75 వేల ఎస్టీ వినియోగదారులకు రూ.82.65 కోట్లను ప్రభుత్వం మూడున్నరేళ్లలో అందించిందని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు 4.24 లక్షల ఎస్సీలకు రూ.150.69 కోట్లు..69 వేల ఎస్టీలకు రూ.17.91 కోట్లను 75 యూనిట్ల లోపు వాడుతున్న వారికి మాత్రమే విద్యుత్ రాయితీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇంకా ఎవరికైనా 200 యూనిట్ల రాయితీ అందకపోతే జిల్లాలోని సూపరింటెండెంట్ ఇంజనీర్ (సర్కిల్) కార్యాలయం, లేదా విజయవాడలోని సీఎండీ (కార్పొరేట్) కార్యాలయంలో సంప్రదించాలని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.



ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం జగన్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరజీవికి నివాళులర్పించిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మంగళవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, హోంశాఖ మంత్రి తానేటి వనిత, పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), సీఎస్ డాక్టర్ సమీర్‌శర్మ, డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

286మందికి సేవా పతకాలు

ప్రకటించిన హోం శాఖ

సాక్షి, అమరావతి: ఉత్తమ పనితీరు కనబరచిన పోలీసు, అగ్నిమాపక, విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆర్పీఎఫ్ విభాగాల అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం సేవాపతకాలను ప్రకటించింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రకటిస్తూ హోం శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహోన్నత సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, కఠిన సేవాపతకం, సేవాపతకం కేటగిరీల కింద మొత్తం 286 పతకాలను ప్రకటించింది. విజయనగరం జిల్లాకు చెందిన ఏఆర్ఎస్ఐ వి.కుమారస్వామి, గుంటూరు జిల్లా డీఎస్పీ పి.శ్రీనివాసరావు, కర్నూలు జిల్లా రెండో బెటాలియన్‌కు చెందిన ఆర్ఐ ఎస్.లూథర్ మహోన్నత సేవా పతకాలకు ఎంపికయ్యారు. విభాగాల వారీగా సేవా పతకాల వివరాలిలా ఉన్నాయి..

పోలీసు శాఖ: ముగ్గురికి మహోన్నత సేవా పతకం, 37మందికి ఉత్తమ సేవా పతకం, 30మందికి కఠిన సేవా పతకం, 160మందికి సేవా పతకాలు

అగ్ని మాపక శాఖ: ఇద్దరికి ఉత్తమ సేవా పతకం, 25మందికి సేవా పతకాలు

విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం: ఒకరికి మహోన్నత సేవా పతకం, ఇద్దరికి ఉత్తమ సేవా పతకాలు, 10మందికి సేవా పతకాలు

ఎస్పీఎఫ్ విభాగం: ముగ్గురికి ఉత్తమ సేవా పతకం, 13మందికి సేవా పతకాలు

విద్యపైనా విషమా?

▶ మొదటి పేజీ తరువాయి

టీడీపీ అధికారంలో ఉండగా 2,900 ప్రభుత్వ స్కూళ్లను మూసివేస్తే తాము వచ్చాక అన్నింటినీ పునరుద్ధరించినట్లు గుర్తు చేశారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని బలంగా విశ్వసిస్తూ సీఎం జగన్ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు. విద్యారంగం వ్యాపారం అయితే భవిష్యత్ ఉండదని, అందుకే 95 శాతం మంది పేదింటి బిడ్డలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను నాడు – నేడు ద్వారా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. తన నియోజకవర్గంలో ఎన్ని స్కూళ్లు మూతబడ్డాయో టీడీపీ నేత యనమల రామకృష్ణుడు చెప్పాలని సవాల్ విసిరారు.

రాష్ట్రంలో మూడేళ్ల క్రితమే శ్రీకారం

దివంగత వైఎస్సార్ ఆశయాల నుంచి ఆవిర్భవించిన వైఎస్సార్ సీపీకి విద్య, వైద్యం, వ్యవసాయం తొలి ప్రాధాన్య అంశాలని మంత్రి బొత్స తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ నూతన విద్యా విధానాన్ని అనుసరించి విద్యా సంస్కరణలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్ 2019లోనే ప్రొఫెసర్ ఎస్.బాలకృష్ణన్ అధ్యక్షతన విద్యా సంస్కరణల కమిటీని నియమించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు ఒకేసారి వివిధ స్థాయిల్లో బోధన చేయడం వల్ల ఒత్తిడి పెరిగి అనుకున్న ఫలితాలు రావడం లేదని, ప్రభుత్వ విద్య ఛిన్నాభిన్నమైందని గుర్తించిందన్నారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను మాత్రమే అత్యంత సమీపంలో ఉన్న హైస్కూల్ తరగతులతో విలీనం చేశామని, మిగిలిన తరగతులతో ప్రాథమిక పాఠశాలలు ఎప్పటిలాగే కొనసాగుతాయన్నారు.

సబ్జెక్టు టీచర్లతో బోధన

జాతీయ నూతన విద్యా విధానాన్ని అనుసరిస్తూ ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ), ఫౌండేషన్ లిటరసీ, నర్సరీ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పాఠశాల విద్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 5+3+3+4 బోధనా విధానాన్ని సూచించిందన్నారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు ప్రీ–స్కూల్/అంగన్‌వాడీ/బాలవాటిక, 6– 8 ఏళ్ల పిల్లలకు ఒకటి, రెండో తరగతి విద్యను సూచించిందన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు ఇదే విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఐదో తరగతి లోపు పిల్లలకు కూడా సబ్జెక్టు నిపుణులైన బీఈడీ ఉపాధ్యాయులతో బోధన నిర్వహించడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. ఈమేరకు చర్యలు తీసుకున్నామని, నిపుణులు లేనిచోట ఎస్జీటీల్లో అర్హులను అందుకు నియమిస్తామన్నారు. 2021–22లో పక్కపక్కనే ఉన్న 2,943 ప్రాథమిక పాఠశాలల తరగతులను 2,808 ఉన్నత పాఠశాల తరగతులతో అనుసంధానం చేశామన్నారు. తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత 4,943 స్కూళ్లలో 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రీ హైస్కూల్, హైస్కూళ్లకు అనుసంధానించామన్నారు. మిగిలిన తరగతులతో ప్రాథమిక పాఠశాలలు యథావిధిగా కొనసాగుతాయని, ఏ ఒక్క స్కూలూ మూతపడలేదని వివరించారు. నిబంధనల ప్రకారం మ్యాపింగ్ చేసిన ఉన్నత పాఠశాలల్లో 3 నుంచి 10 తరగతుల బోధనకు 44,010 మంది సబ్జెక్టు నిపుణులు అవసరం కాగా ప్రస్తుతం 37,113 మంది అందుబాటులో ఉన్నారన్నారు. 5,713 సబ్జెక్టు ఉపాధ్యాయులను మాత్రమే మండలాల నుంచి సర్దుబాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే అర్హత కలిగిన 4,067 మంది ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించనున్నట్లు చెప్పారు. అవసరానికి అనుగుణంగా నాడు–నేడు రెండో దశ కింద 35,025 తరగతి గదులను సైతం నిర్మిస్తున్నట్లు తెలిపారు.

కళ్లున్న కబోదులు..

తాము అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో 44,570 ప్రభుత్వ పాఠశాలలు, 16 వేల ప్రైవేట్ స్కూళ్లున్నాయని బొత్స తెలిపారు. అయితే 55 శాతానికి పైగా విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లలో చదువుతుండగా ప్రభుత్వ పాఠశాలల్లో 45 శాతం కంటే తక్కువగా ఉన్నారని చెప్పారు. టీడీపీ 2014లో అధికారంలోకి వచ్చేనాటికి 40 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుండగా 2018 నాటికి 37 లక్షలకు తగ్గిపోయిందని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా రంగ కార్యక్రమాలు, కార్పొరేట్ స్థాయి వసతుల కల్పనతో ఇప్పుడు ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 41 లక్షలకు పెరిగిందని వివరించారు. నాడు – నేడు ద్వారా రూ.16 వేల కోట్లతో ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడంతో వచ్చిన మార్పులు కళ్లెదుట స్పష్టంగా కనిపిస్తున్నా విపక్షాలు కబోదుల్లా దిగజారి మాట్లాడటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే స్కూళ్ల మ్యాపింగ్ చేపట్టి 250 మీటర్ల దూరంలో ఉన్న వాటిని విలీనం చేసినట్లు తెలిపారు.



బాపట్ల పట్టణంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి



కర్నూలు జిల్లా సిద్ధాపురంలో ఓ అవ్వకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం



విశాఖపట్నం 6వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అల్లూరి జిల్లా గొందికోటాపుట్టు గ్రామంలో బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, కలెక్టర్ సుమిత్‌కుమార్



వైఎస్సార్ జిల్లా నాగుల గుట్టపల్లెలో దివ్యాంగురాలి సమస్యలు వింటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఆహ్వానిస్తూ.. అర్జీలిస్తూ

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అన్ని జిల్లాల్లోనూ విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. మంగళవారం ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగింది. తమ గ్రామానికి వచ్చిన నాయకులను ప్రజలు సాదరంగా ఆహ్వానిస్తూ తమ సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తామంతా అండగా నిలుస్తామని చెప్పారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను నాయకులు అధికారులతో చెప్పి అక్కడికక్కడే పరిష్కరించారు.

క్లుప్తంగా

'అర్చకులకు' ఆరోగ్యశ్రీ కార్డుల జారీకి ప్రత్యేక డ్రైవ్

సాక్షి, అమరావతి: శాలరీ సర్టిఫికెట్ ఆధారంగా దేవదాయ శాఖ పరిధిలో ఉండే ఆలయాల్లో పనిచేసే అర్చకుల్లో నిబంధనల ప్రకారం రూ.5 లక్షల్లోపు వ్యక్తిగత ఆదాయం ఉండే అందరికీ ఆరోగ్యశ్రీ కార్డుల జారీకి దేవదాయ శాఖ చర్యలు చేపట్టింది. పలు కారణాలతో ఇంకా ఆరోగ్యశ్రీ కార్డులు జారీ కాకుండా మిగిలి పోయిన వారికి కూడా కార్డులు మంజూరు చేయడం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలంటూ ఆ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ మంగళవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకి లేఖ రాశారు. జిల్లా దేవదాయ శాఖ అధికారులు సమన్వయంతో ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు కల్లా అర్హులందరికీ కార్డుల జారీ ప్రక్రియ పూర్తికి సహకరించాలని పేర్కొన్నారు.

9 లోగా పంట నమోదు తుది జాబితా ప్రదర్శించండి

వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్

సాక్షి, అమరావతి: ఈ–క్రాప్ నమోదు తర్వాత సామాజిక తనిఖీ కోసం రైతుల పంట నమోదు ముసాయిదా జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించామని, ఈ నెల నాలుగో తేదీ వరకు గ్రామ సభల్లో అభ్యంతరాలను గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏలు) చదివి వినిపించాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్‌ల ధ్రువీకరణ అనంతరం తుది జాబితాను ఈ నెల 9వ తేదీలోగా ప్రదర్శించాలని వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక కారణలతో రైతు భరోసా రెండో విడత ఆర్థిక సాయం నిలిచిన 77 వేల మంది రైతుల జాబితాను ఆర్బీకేల వారీగా పంపించామన్నారు. ఆధార్, బ్యాంక్ ఖాతాలను సవరించుకునేలా గ్రామ స్థాయి సిబ్బంది రైతులకు సహకరించాలని ఆయన ఆదేశించారు. ఈ నెల 30 నాటికి ఈకేవైసీ కూడా పూర్తి చేయాలన్నారు.

రాష్ట్రంలో తిరోగమనంలో పారిశ్రామికాభివృద్ధి

సీఎం జగన్‌కు టీడీపీ నేత యనమల బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రాభివృద్ధికి అత్యంత కీలకమైన పారిశ్రామిక రంగం గత మూడున్నరేళ్లుగా అధోగతి పాలైందని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. మంగళవారం సీఎం వైఎస్ జగన్‌కు ఈ విషయమై బహిరంగ లేఖ రాశారు. తగ్గిన వృద్ధి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, సున్నా పెట్టుబడులతో బడుగుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుందని తెలిపారు. టీడీపీ హయాంలో పారిశ్రామిక, సేవారంగాలు జెట్ స్పీడ్‌తో పరుగులుతీస్తే.. ప్రస్తుతం అన్ని రంగాలు తిరోగమనంలో నడుస్తున్నాయని పేర్కొన్నారు.

ఏపీలో 24 శాతం.. తెలంగాణలో 11శాతం

సాక్షి, న్యూఢిల్లీ: జీఎస్టీ వసూళ్లలో తెలుగు రాష్ట్రాలు గణనీయ వృద్ధిని సాధించినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. గత ఏడాది అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్టీ వసూళ్లు రూ.2,879 కోట్లు ఉండగా, అది ఈ ఏడాది 24 శాతం పెరిగి రూ.3,579 కోట్లకు చేరిందని తెలిపింది. తెలంగాణలో గత ఏడాది రూ.3,854 కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు 11 శాతం పెరిగి రూ.4,284 కోట్లకు పెరిగిందని వెల్లడించింది.

మరోసారి మా ఆదేశాలు ఉల్లంఘించవద్దు

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. పాదయాత్రలో కేవలం 600 మంది మాత్రమే పాల్గొనాలంటూ ఆ ఉత్తర్వుల్లో స్పష్టమైన షరతులు విధించారని న్యాయస్థానం గుర్తు చేసింది. అది కూడా డీజీపీకి ఇచ్చిన జాబితాలో ఉన్న వ్యక్తులే పాదయాత్రలో ఉండాలని సెప్టెంబర్ 9న ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించింది.

ఒకరి స్థానంలో మరొకరికి అనుమతి లేదు..

పాదయాత్రలో ఒకరి స్థానంలో మరొకరు పాల్గొనేందుకు అనుమతించాలన్న రైతుల అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ విషయంలో రైతులు కోరిన విధంగా అనుమతినిస్తే అది గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించినట్లే అవుతుందని తేల్చి చెప్పింది. యాత్రలో పాల్గొంటున్న 600 మంది కేవలం పోలీసులు జారీ చేసిన గుర్తింపు కార్డులే కాకుండా ప్రభుత్వం జారీ చేసిన ఇతర కార్డుల ద్వారా కూడా గుర్తింపును ధృవీకరించుకోవచ్చని పేర్కొంది. గతంలో తీసుకోని వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇందుకోసం ప్రస్తుతం పాదయాత్ర జరుగుతున్న ప్రాంతం వద్ద కౌంటర్ ఏర్పాటు చేయాలని డీజీపీని ఆదేశించింది.

వారితోపాటు పాల్గొనేందుకు వీల్లేదు..

పాదయాత్రకు ఇచ్చిన అనుమతిని ఏ రకంగానూ దుర్వినియోగం చేయడానికి వీల్లేదని హైకోర్టు పేర్కొంది. పాదయాత్ర సజావుగా సాగిపోయేందుకు హైకోర్టు విధించిన షరతులు సహేతుకమైనవని తెలిపింది. పాదయాత్రలో కేవలం 600 మంది మాత్రమే పాల్గొనాలని స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో ఓ వ్యక్తి రైతులతో కలిసి యాత్రలో పాల్గొని సంఘీభావం తెలపవచ్చా? అన్న ప్రశ్న నిరర్థకమంది. ఏ వ్యక్తైనా రోడ్డుకు ఇరువైపులా నిల్చొని సంఘీభావం తెలియచేయవచ్చు, వారితో పాటు కలసి పాదయాత్రలో పాల్గొనడానికి మాత్రం వీల్లేదని స్పష్టం చేసింది. ఇది మినహా సంఘీభావం తెలిపే విషయంలో ఎలాంటి ఆంక్షలు లేవంది. అయితే పోలీసులకు అదనపు ఆదేశాలు ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది.

మరోసారి ఉల్లంఘిస్తే...

పాదయాత్ర నిర్వహణకు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ డీజీపీ దాఖలు అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు పరిష్కరించింది. నిరసన తెలియచేయడం పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ముఖ్యమైన హక్కు అని హైకోర్టు తెలిపింది. చాలా ఆలోచించి, జాగ్రత్తగా ఇలాంటి హక్కుల విషయంలో జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని హైకోర్టు గుర్తుచేసింది. ప్రస్తుత కేసులో రైతులు కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినప్పటికీ, వాటిని ప్రైవేట్‌గా రికార్డ్ చేయడం మినహా వారి దృష్టికి తెచ్చి తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఇవ్వలేదని హైకోర్టు ఆక్షేపించింది. తప్పు సరిదిద్దుకునే అవకాశం రైతులకు ఇవ్వకుండా పాదయాత్రను అడ్డుకోవడం సహేతుకం కాదంది. అయితే ఇది కోర్టు ఆదేశాలను, డీజీపీ ఇచ్చిన అనుమతులను యథేచ్ఛగా ఉల్లంఘించేందుకు ఇచ్చిన స్వేచ్ఛగా భావించడానికి వీల్లేదని రైతులకు తేల్చి చెప్పింది. కోర్టు ఆదేశాలు, డీజీపీ అనుమతులకు సంబంధించి పూస గుచ్చినట్లు జరిగిన వాదనలను రైతులు గమనించారనే తాము భావిస్తున్నామంది. ఈ నేపథ్యంలో యాత్ర చేస్తున్న రైతులకు ధర్మబద్ధమైన హెచ్చరిక చేస్తున్నామని, కోర్టు ఆదేశాలను ఇకపై ఉల్లంఘిస్తే యాత్రకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలంటూ పోలీసులు కోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇవీ అనుబంధ పిటిషన్లు...

తమ పాదయాత్రకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఇబ్బందులు కలిగించకుండా ఆదేశించడంతో పాటు పోలీసులు చట్ట ప్రకారం విధులు నిర్వర్తించేలా ఆదేశించాలంటూ అమరావతి పరిరక్షణ సమితి కార్యదర్శి గద్దె తిరుపతిరావు మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గత నెల 21న విచారణ జరిపిన జస్టిస్ రఘునందన్‌రావు పాదయాత్రలో కేవలం 600 మంది మాత్రమే పాల్గొనాలని ఆదేశించారు. సంఘీభావం పేరుతో ఇతరులెవ్వరూ పాదయాత్రలో పాల్గొనడానికి వీల్లేదన్నారు. ఈ ఆదేశాల పేరుతో పోలీసులు తమను ఇబ్బంది పెడుతున్నారని, వాటిని సవరించాలంటూ అమరావతి పరిరక్షణ సమితి అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. ఇదే సమయంలో పాదయాత్రకు ఇచ్చిన అనుమతి రద్దు చేయాలంటూ డీజీపీ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలను విచారించిన అనంతరం హైకోర్టు తాజా ఆదేశాలను జారీ చేసింది.

అమరావతిపై విచారణకు తిరస్కరించిన సీజేఐ

మరో ధర్మాసనానికి బదిలీ చేస్తామన్న జస్టిస్ యు.యు.లలిత్

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతి అంశంపై దాఖలైన వేర్వేరు పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ యు.యు.లలిత్ తిరస్కరించారు. తాను సభ్యుడిగాలేని మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అమరావతిపై ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, మస్తాన్‌వలి, మూడు రాజధానులను వ్యతిరేకిస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లు మంగళవారం సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ బేలా ఎం.త్రివేది ధర్మాసనం ముందుకొచ్చాయి. రైతుల తరపు న్యాయవాది సుందరం వాదనలు వినిపిస్తూ.. గతంలో జస్టిస్ యు.యు.లలిత్ సీనియర్ న్యాయవాదిగా ఉన్న సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమరావతిపై న్యాయసలహా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సుందరం ఇచ్చిన సదరు కాపీని పరిశీలించిన సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ ఈ పిటిషన్లను తాను విచారించనని తెలిపారు. అమరావతిపై న్యాయ సలహా ఇచ్చిన విషయం తనకు గుర్తుకురాలేదని, ఈ నేపథ్యంలో తాను ఈ పిటిషన్లపై విచారణ నుంచి వైదొలగుతున్నట్లు పేర్కొన్నారు. తాను సభ్యుడిగాలేని ధర్మాసనానికి బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు. తాను విచారించని అంశంపై తదుపరి విచారణ తేదీ నిర్ణయించడం సబబు కాదని, రిజిస్ట్రీ ఖరారు చేస్తుందని పేర్కొన్నారు.

వచ్చే రెండు రోజులు వర్షాలు

- ఉపరితల ఆవర్తనం, ఈశాన్య రుతు పవనాల ప్రభావం
- నెల్లూరు జిల్లా బోగోలు మండలంలో 13సెం.మీ. వర్షం

సాక్షి, అమరావతి : రాబోయే రెండ్రోజులూ కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో శ్రీలంక తీరప్రాంతం మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, ఈశాన్య రుతు పవనాల ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో బుధవారం పలుచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, అంబేద్కర్ కోనసీమ, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, నంద్యాల, కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల్లో గురువారం అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఇక మంగళవారం అనంతపురం, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. నెల్లూరు జిల్లా బోగోలు మండలంలో 13 సెం.మీ., అనంతపురం జిల్లా కనేకల్‌లో 8.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తిరుపతి జిల్లా మల్లంలో 7.9, వాకాడులో 5.7, పూలతోటలో 4.1, గునుపూడులో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బీసీలను దగా చేసింది చంద్రబాబే

- బాబు దుష్టపాలన వల్ల బీసీలు మూడు తరాలు వెనక్కి వెళ్లారు
- వీధివీధినా బెల్టు షాపులుపెట్టి గీత కార్మికుల పొట్టకొట్టిన చంద్రబాబు
- మరే రాష్ట్రంలో లేనివిధంగా గీత కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం జగన్
- మంత్రి చెల్లుబోయిన వేణు



సాక్షి, అమరావతి: బీసీలను దగా చేసింది.. వంచించింది చంద్రబాబేనని, బాబు సాగించిన దుష్టపాలనతో బీసీలు మూడు తరాలు వెనక్కి వెళ్లారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పుడు కొత్తగా బీసీల సదస్సులు పెట్టి చంద్రబాబు ఏం చెబుతారు. బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హతే టీడీపీకి లేదు. 1995–2004 మధ్య అధికారంలో ఉన్న చంద్రబాబు బీసీలకు ఏమైనా మంచి చేసినట్లయితే బీసీల్లో రెండు తరాలైనా బాగుపడి ఉండేవి. అన్నివిధాలా బీసీలను నాశనం చేసింది చంద్రబాబే. బీసీలు మోసపోయే రోజులు పోయాయి. బీసీలు బాబు చెప్పినట్టు ఆడే తోలు బొమ్మలు, ఆట బొమ్మలు కాదన్నది ఇకనైనా గుర్తుంచుకోవాలి' అని హితవు పలికారు.

గీత కార్మికుల కష్టాల్ని గుర్తించిన ఘనత జగన్‌దే

పాదయాత్రలో గీత కార్మికుల కష్టాలు గుర్తించిన సీఎం వైఎస్ జగన్ వారి సంక్షేమానికి పెద్దపీట వేశారని మంత్రి వేణు పేర్కొన్నారు. గీత వృత్తిదారుడు ప్రమాదానికి గురైతే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందేవిధంగా నూతన పాలసీ ప్రకటించారన్నారు. దేశంలో ఎక్కడా ఇంత పెద్దఎత్తున పరిహారం చెల్లిస్తున్న రాష్ట్రమేదీ లేదని గుర్తు చేశారు. పొరుగు రాష్ట్రం తమిళనాడులో అత్యధికంగా గీత కార్మికులు ఉంటారని, దేశం మొత్తం మీద 8.51 కోట్ల తాటిచెట్లు ఉంటే.. ఒక్క తమిళనాడులోనే 5.31 కోట్ల చెట్లు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్ర వృక్షమే తాటిచెట్టు అని.. అయినా ఆ రాష్ట్రంలో ఎక్స్‌గ్రేషియా చాలా తక్కువ అని తెలిపారు. పక్క రాష్ట్రం తెలంగాణలోనూ కేవలం రూ.5 లక్షల బీమా మాత్రమే కల్పిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో 95,245 కల్లు గీత కార్మికులకు భరోసా కల్పించిన సీఎం జగన్‌కు గీత వృత్తిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

బాబు పాలనలో గీత కార్మికుల పొట్టకొట్టారు

చంద్రబాబు పాలనలో వీధివీధినా బెల్టు షాపులు ఏర్పాటు చేసి గీత కార్మికుల పొట్టకొట్టారని మంత్రి వేణు దుయ్యబట్టారు. గీత వృత్తిదారులను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారే తప్ప.. వారి అభివృద్ధికి ఏనాడూ కృషి చేయలేదన్నారు. రాష్ట్రంలో 95,245 మంది గీత వృత్తిదారులు ఉన్నారని ప్రభుత్వ పరంగా లెక్కలు చెబుతుంటే.. 2 లక్షల మందికి అన్యాయం జరిగిందని టీడీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు దృష్టిలో వ్యవసాయం అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం మాత్రమేనని.. భూమితో అనుబంధం లేకుండా భూములు ధరలు పెంచాలి, లాభాలు గడించాలన్నదే బాబు లక్ష్యమన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పాదయాత్ర ముసుగు వేసినా న్యాయమే గెలిచిందని పేర్కొన్నారు. అమరావతి రైతుల పాదయాత్రకు భగవంతుని ఆశీస్సులు లేవని కోర్టు తీర్పుతో రుజువైందన్నారు.

కల్లు గీత నూతన పాలసీతో లక్ష కుటుంబాలకు ప్రయోజనం

గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కల్లు గీత నూతన పాలసీని అమలులోకి తేవడం వల్ల గీత కార్మికులకు చెందిన సుమారు లక్ష కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ స్పష్టం చేశారు. కల్లు గీత నూతన పాలసీని అమలులోకి తెస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేయడంపై మంత్రి రమేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కల్లు గీత కార్మికుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. నూతన పాలసీ అమలుతో గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, ఈత, శ్రీసయిన కులాలకు చెందిన కుటుంబాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కల్లు దుకాణాల అద్దెలను (కిస్తీలను) ప్రభుత్వం పూర్తిగా రద్దు చేయడం, కల్లు గీచే వారికే చెట్టు పథకం, షెడ్యూల్డ్ ప్రాంతాలలో షెడ్యూల్డ్ జాతులు వారు కల్లు గీసుకోవడం కోసం ఐదు సంవత్సరాలు అనుమతి ఇవ్వడం వంటి నిర్ణయాలు బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడుతుందని వివరించారు. అదే విధంగా ప్రమాదవశాత్తు చనిపోయిన కల్లుగీత కార్మికులకు చెల్లించే పరిహారాన్ని రూ.ఐదు లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచడం, ప్రమాదానికి గురై అంగ వైకల్యం చెందిన వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించడం, కల్లుగీత కార్మికుడు సహజంగా మరణిస్తే కుటుంబానికి రూ. 5 లక్షలు బీమా కింద అందచేయడం బాధిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన చేకూరుస్తుందని తెలిపారు. నదీతీరాలు, కాల్వగట్లు, మీద తాటి, ఈత చెట్ల పెంపకం ద్వారా కార్మికులకు మరింత ఆదాయం వచ్చే విధంగా ఐదు సంవత్సరాల పాలసీని తీసుకురావడం హర్షణీయమని మంత్రి రమేశ్ పేర్కొన్నారు.

కేరళకు ఆంధ్రా ధాన్యం

- జయ రకం ధాన్యం, బియ్యం సరఫరాకు రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం
- మార్క్‌ఫెడ్ ద్వారా నిత్యావసరాల పంపిణీ
- కేరళ పర్యటనలో మంత్రి కారుమూరి, అధికారుల బృందం



కేరళలో బియ్యం రకాలను పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి, కేరళ మంత్రి, అధికారులు

సాక్షి, అమరావతి/ తణుకు అర్బన్: రాష్ట్రంలో పండించే జయ రకం ధాన్యం (ఎంటీయూ 3626 బొండాలు), బియ్యాన్ని తమకు సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వంతో కేరళ ఒప్పందం చేసుకుంది. కేరళ పర్యటనలో భాగంగా మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్, ఏపీ డీడీసీఎఫ్ ఎండీ బాబు.ఏ సమక్షంలో రెండు రాష్ట్రాల అధికారులు ఎంవోయూ చేసుకున్నారు. ఏపీలో పండించే జయ బొండాలకు కేరళలో మంచి డిమాండ్ ఉంది. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేరళ పౌరసరఫరాల శాఖ మంత్రి జీఆర్ అనిల్ తమకు జయ బొండాలతోపాటు పలు రకాల నిత్యావసరాలు తమకు సరఫరా చేయాలని కోరారు. ఏపీ మంత్రితో పాటు అధికారుల బృందాన్ని కేరళ పర్యటనకు ఆహ్వానించారు. కేరళ మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం... జయ రకం ధాన్యంతోపాటు ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కందిపప్పు, మినప్పప్పు, శనగ పప్పు, ఎండుమిర్చి, ధనియాలు వంటి నిత్యావసరాలను కూడా సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఏపీ మంత్రి, అధికారుల బృందం కేరళ పర్యటనకు వెళ్లగా... ఇరు రాష్ట్రాల మంత్రులు, అధికారులు ప్రత్యేక భేటీలో సుదీర్ఘంగా చర్చించి పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నారు. దీంతో రాష్ట్రంలో జయ బొండాలు పండించే రైతులకు మద్దతు ధర లభించడంతో పాటు పెద్ద ఎత్తున మేలు జరగనుంది. ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా సరఫరా చేసే నిత్యావసరాలను కేరళ పౌరసరఫరాల సంస్థ మావెల్లి స్టోర్స్ ద్వారా మార్క్‌ఫెడ్ బ్రాండ్‌తోనే వినియోగదారులకు అందించనుంది. ఈ సందర్భంగా ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కేరళ మంత్రి అనిల్‌తో కలిసి మావెల్లి స్టోర్స్‌ను సందర్శించి, అక్కడి వినియోగదారులకు నిత్యావసరాల సరఫరాను పరిశీలించారు.

పవన్ కంటే కేఏ పాల్ నయం

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కంటే కేఏ పాల్ నయమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రాష్ట్రంలో కేఏ పాల్ 175 సీట్లలో పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటించారని.. పవన్ కూడా 175 సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంగళవారం నోవాటెల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జనసేన కార్యకర్తలు పవన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటే.. ఆయన మాత్రం చంద్రబాబును సీఎం చేసేందుకు రాజకీయం చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు జనసైనికులు బానిసలుగా బతకాలన్నారు. పవన్.. వంగవీటి గురించి మాట్లాడిన మాటలు, ఆయనను హత్య చేసిన వారిని కౌగిలించుకున్న విషయాలను ఎలా చూడాలని ప్రశ్నించారు. కోర్టు ఆదేశాలను గౌరవిస్తామని, ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అమరావతి రైతులు పాదయాత్ర మానుకోవాలని కోరారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మహిళా పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని మంత్రి అమర్‌నాథ్ అన్నారు. నగరంలోని ఒక హోటల్లో మంగళవారం అసోసియేషన్ ఆఫ్ లేడి ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందంలో భాగంగా 100 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా హబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావాలి

- హోం మంత్రి వనిత



సాక్షి, అమరావతి: ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకువచ్చే దిశగా చొరవ చూపాలని హోం మంత్రి తానేటి వనిత జైళ్ల శాఖ అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో జైళ్ల శాఖ అధికారులతో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖైదీలకు వివిధ నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి వారు విడుదలైన తరువాత ఉపాధి అవకాశాలు పొందేందుకు దోహదపడాలని చెప్పారు. ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయడంతోపాటు అవి ఎల్లవేళలా పనిచేసేట్టుగా పర్యవేక్షించాలన్నారు. జైళ్లలో సౌకర్యాల కల్పన గురించి హోం మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైళ్ల శాఖలో ఖాళీలను భర్తీ చేయడంతోపాటు తగినన్ని వాహనాలు సమకూర్చాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా హోంమంత్రిని కోరారు.

జనసేనకు కుప్పం ఇన్‌చార్జి రాజీనామా

కుప్పం: జనసేన కుప్పం ఇన్‌చార్జి మద్దిరాల వెంకటరమణ తన పదవికి, పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా వెంకటరమణ పోటీ చేసి ఓటమి చెందారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తాను కుప్పం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని చూస్తుంటే పీఏసీ కమిటీ తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తిరుపతిలో సర్వ దర్శనం టోకెన్ల జారీ పునఃప్రారంభం

మూడు ప్రాంతాల్లో తొలి రోజున 13,000 మందికి జారీ



భక్తులకు టోకెన్లు అందజేస్తున్న సిబ్బంది

తిరుపతి అలిపిరి: తిరుమల శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో నిరీక్షించే పరిస్థితి లేకుండా సర్వదర్శనానికి టైం స్లాట్ పద్ధతిని టీటీడీ అనుసరిస్తోంది. ఈ నేపథ్యంలో గతేడాది ఏప్రిల్‌లో నిలిపివేసిన సర్వదర్శనం టైంస్లాట్ (ఉచిత దర్శనం) టోకెన్ల జారీని టీటీడీ పునఃప్రారంభించింది. దర్శనానికి వెళ్లేవారికి తిరుపతిలోనే సర్వదర్శనం టోకెన్లను జారీ చేస్తోంది. కోవిడ్ కారణంగా 2020లో శ్రీవారి దర్శనాలను టీటీడీ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత దర్శనాలను ప్రారంభించినా పరిస్థితులకు అనుగుణంగా కేవలం 40,000 మందికి మాత్రమే దర్శనాలు కల్పిస్తూ వచ్చిన టీటీడీ ఈ ఏడాది మార్చి నుంచి సడలింపులనిస్తూ సర్వదర్శనానికి అనుమతించింది. దీంతో వేలాదిగా ప్రతి రోజూ తిరుమలకు భక్తులు వస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అతికష్టం మీద రోజుకు 85,000 మందికి పైగా దర్శనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధిక సంఖ్యలో దర్శనానికి వస్తోన్న భక్తులకు టైంస్లాట్ టోకెన్లు తీసుకురావాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బోర్డు సభ్యులు నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం నుంచి ఈ ప్రక్రియ పునః ప్రారంభమైంది. తొలిరోజున 13,000 మందికి టోకెన్లను జారీ చేశారు.

3 కేంద్రాలు..30 కౌంటర్లు

శ్రీవారి సర్వదర్శనం టైం స్లాట్ టోకెన్‌లను అందించేందుకు తిరుపతిలో మూడు చోట్ల కౌంటర్లను టీటీడీ ఏర్పాటు చేసింది. తిరుపతి అలిపిరి వద్ద నున్న భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, గోవిందరాజస్వామి సత్రాల్లో 30 కౌంటర్లను ఏర్పాటు చేసింది. భక్తుల మధ్య తోపులాట లేకుండా ప్రత్యేక క్యూలైన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డుతో సంప్రదించిన భక్తులకు సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తున్నారు. ఇందుకుగాను ఆధార్ జిరాక్స్ కాపీలను భక్తులు తమవెంట తీసుకురావాలి.

టోకెన్ల జారీ ఇలా..

శ్రీవారి సర్వదర్శనం టైం స్లాట్ టోకెన్లు అధిక రద్దీ, ముఖ్య రోజుల్లో జారీ చేసిన టోకెన్ల వివరాలను టీటీడీ ప్రకటించింది. శని, ఆది, సోమ, బుధవారాల్లో 25,000 టోకెన్లు, మంగళ, గురు, శుక్రవారాల్లో 15,000 మందికి టోకెన్లు జారీ చేస్తున్నారు. ఏ రోజు టోకెన్ తీసుకున్న భక్తులకు అదే రోజున దర్శనం కల్పిస్తారు. ఇప్పటి దాకా సర్వదర్శనం 40 గంటల వరకు సమయం పట్టేది. ఈ పద్ధతితో అత్యంత తక్కువ సమయంలోనే దర్శనం చేసుకొంటున్నామని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్వదర్శనం టైం స్లాట్ టోకెన్ దొరకని భక్తులు నేరుగా తిరుమలకు చేరుకొని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా సర్వదర్శనానికి వెళ్లడానికి టీటీడీ అనుమతిస్తోంది. కాగా, స్వామి వారి దర్శనానికి నిరీక్షించే పని లేకుండా టైం స్లాట్ విధానంలో సర్వదర్శనం టోకెన్లు జారీ చేయడం శుభపరిణామమని, దీంతో తమకు త్వరగానే దర్శనం అయ్యిందని హైదరాబాద్‌కు చెందిన మధు, కళ్యాణి దంపతులు, తిరుపతికి చెందిన యమున, తమిళనాడుకు చెందిన నాగరాజు, కదిరేషన్ 'సాక్షి'కి చెప్పారు.



ఏ ఒక్కటీ ఎప్పుడూ పూర్తి ఒంటరిగా ఉండదు; ప్రతి ఒక్కటీ ప్రతిదానితోనూ సంబంధంలోనే ఉంటుంది.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, నవంబర్, 2

మస్క్ పంజరంలో మాటల పిట్ట

అనేక నెలల నాటకీయత అనంతరం ఎట్టకేలకు ట్విట్టర్ అమ్మకం పూర్తయింది. ఎప్పుడెలా ప్రవర్తిస్తారో అంతుచిక్కని అంతర్జాతీయ వ్యాపారి, ప్రపంచ అపర కుబేరుడు ఎలన్ మస్క్ చేతికి అక్టోబర్ 27న ఈ సుప్రసిద్ధ సామాజిక మాధ్యమ వేదిక వచ్చింది. 4400కోట్ల డాలర్లకు జరిగిన కొనుగోలులో ఇది అంతిమ ఘట్టంగా కనిపించవచ్చు. కానీ, ఇక నుంచే అసలు కథ! తక్షణ వార్తలకూ, అభిప్రాయ వినిమయానికీ అంతర్జాతీయంగా కీలకపాత్ర పోషిస్తున్న ఈ సోషల్ మీడియా బుజ్జిపిట్ట భవితపై చర్చ మళ్ళీ మొదలైంది. యాజమాన్యం మార్పుతో సమాచార ప్రమాణాలు క్షీణిస్తాయా అనే శంక రేగుతోంది. ముప్పాతిక శాతం ఉద్యోగాల ఊచకోత మొదలు ధ్రువీకృత ఖాతాదార్లకిచ్చే బ్లూ టిక్ మార్క్‌కై నెలకు 20 డాలర్ల రుసుము ప్రతిపాదన వరకు మస్క్ చేష్టలు గగ్గోలు పుట్టిస్తున్నాయి.

వర్తమాన స్థితిని మిత్రులతో పంచుకోవాలన్న జాక్ డోర్సీ ఆలోచనతో 2006లో ట్విట్టర్ మొదలైంది. మైక్రో బ్లాగింగ్ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌గా అమెరికాలో ఏర్పాటైన ట్విట్టర్ ఇప్పుడు 130 కోట్లకు పైగా ఖాతాలతో దానికదే ఓ పెద్ద వ్యవస్థ. ప్రపంచంలో అత్యధికులు వాడుతున్న మొబైల్ యాప్‌లలో 6వ స్థానం ఈ మాటల పుట్టదే. 280 అక్షరాల ట్వీట్‌తో భావావేశాలను వ్యక్తీకరించే ఈ వేదిక వినియోగం భారత్‌తో పాటు జపాన్, జర్మనీ, ఉత్తర అమెరికాల్లో ఎక్కువ. రోజూ 24 కోట్ల మంది దీన్ని చూస్తారని ఓ లెక్క. కొన్నాళ్ళుగా అనేక వివాదాలెదుర్కొన్నా, ప్రత్యామ్నాయ సమాచార, భావప్రకటన వేదికగా అపరిమిత ప్రభావం చూపిన ఘనత ఈ టీనేజ్ యాప్‌దే! రాకెట్ సంస్థ స్పేస్ ఎక్స్, విద్యుత్ కార్ల సంస్థ టెస్లా, బ్రెయిన్‌చిప్ అంకురసంస్థ న్యూరాలింక్, సొరంగ నిర్మాణ సంస్థ బోరింగ్ కంపెనీ – ఇలా మరో 4 సంస్థలు నడుపుతున్న మస్క్ అత్యధిక ఫాలోయర్లతో ట్విట్టర్‌లో 3వ స్థానంలో ఉన్నారు. ఇప్పుడదే ట్విట్టర్‌కు అధినేతయ్యారు.

ఏప్రిల్‌లో కొనుగోలు ప్రతిపాదన చేసి, ఆ తర్వాత ముందు వెనకలాడి, చివరకు ట్విట్టర్ బలవంతంపై కొనుగోలు ప్రక్రియ పూర్చి చేసిన మస్క్ అంతా అవగానే అన్న మాట – 'పంజరంలోని పక్షికి స్వేచ్ఛ దొరికింది. శుభ సమయం వచ్చేసింది'. వస్తూనే ఆయన సీఈఓ పరాగ్ అగర్వాల్ సహా పలువురికి ఉద్వాసన పలికి, బోర్డు మొత్తాన్నీ రద్దు చేశారు. తోకలేని తుర్రుపిట్ట 'పబ్లిక్' లిస్టెడ్ కంపెనీ నుంచి 'ప్రైవేట్'కు మారింది. అంటే, సదరు వేదికపై విచక్షణాధికారం ఆయనదే! బయటి పర్యవేక్షణ, పరిశీలన తగ్గనున్నాయి. అంటే గతంలోనే పారదర్శకత, జవాబుదారీతనం లేదని విమర్శలెదుర్కొన్న ట్విట్టర్‌లో అవి మరింత క్షీణించవచ్చు. కానీ, విభిన్న అభిప్రాయాలున్నవారితో సమాచార నియంత్రణ మండలి పెడతానంటున్నారు. వివాదాలతో ట్విట్టర్‌లో శాశ్వత నిషేధానికి గురైన అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ సైతం ఆ మండలిలో ఉంటారట. తన కొత్త ముంజేతి చిలక భావస్వేచ్ఛకు ప్రతిరూపమన్న మస్క్ మాట ఆచరణ సాధ్యమేనా?

నియంత్రణను సడలిస్తే... అనధికార ఖాతాలతో, పెద్ద సంఖ్యలో తనంత తానే పోస్టులు పంపే ఇంటర్నెట్ ప్రోగ్రామైన 'స్పామ్ బోట్'లతో విద్వేషపరులు ట్విట్టర్‌ను ఇష్టానికి ఆడించగలుగుతారు. ఈ విద్వేష వ్యాఖ్యాతల హోరులో అసలు యూజర్ల స్వరం వినిపించకుండా పోతుంది. మరోపక్క ఇప్పటి దాకా ఉచితమైన ధ్రువీకృత బ్లూటిక్ నెలవారీ రుసుము కట్టకుంటే పోతుంది. ధ్రువీకృత ఖాతా లేకపోయేసరికి ప్రముఖులు, బ్రాండ్లు, ప్రభుత్వ అధికారుల పేర్లతో నకిలీ ఖాతాదారులు ఏదేదో పోస్ట్ చేస్తారు. తప్పుడు వార్తలు మరింతగా ప్రజల్లో వ్యాపిస్తాయి. అందుకే, అటు ట్రంప్‌ను చేరదీయడం, ఇటు బ్లూటిక్‌కు నెలవారీ రుసుము ట్విట్టర్‌కు తిరోగమన చర్యలే! 40 దేశాల్లో తన సంస్థల వ్యాపారమున్న మస్క్ ఆ ప్రభుత్వాలకు చీకాకు కలిగేలా ట్విట్టర్‌లో స్వేచ్ఛను అనుమతించడమూ అనుమానమే. ఆర్థిక ప్రయోజనాల్నీ, భావస్వేచ్ఛనూ సమతౌల్యం చేసుకోక తప్పదు.

యాప్‌లో మార్పులు తేవడంలో, పెద్ద సంఖ్యలో పోస్టులు చేసే స్పామ్ ఖాతాలను తొలగించడంలో నత్తనడక నడుస్తున్నారంటూ మస్క్ కొద్ది నెలలుగా ట్విట్టర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇప్పుడు వచ్చీరాగానే తనదైన ముద్రకు ప్రయత్నిస్తున్నారు. ఆయన బృందాలు ట్విట్టర్ సాఫ్ట్‌వేర్ కోడ్‌నూ, పనిలోని వివిధ అంశాలనూ ఆకళింపు చేసుకొనే పనిలో పడ్డాయి. వారంలో 7 రోజులూ, రోజుకు 12 గంటలు పనిచేసి, గడువులోగా ఇచ్చిన పని పూర్తిచేయకుంటే ఉద్యోగాలు ఊడతాయనే భయం తెచ్చారు. తన ఇతర కంపెనీల్లోని నమ్మకస్థుల్ని పదుల సంఖ్యలో ట్విట్టర్‌లో పనికి దింపి, సోర్స్‌కోడ్ సహా అన్నీ చకచకా నేర్చేసుకొమ్మంటున్నారు. కార్ల కంపెనీ నిపుణుడికి కంటెంట్ కథెలా తెలుస్తుందని ఆలోచించట్లేదు. రాత్రికి రాత్రి ట్విట్టర్ రూపుమార్చేయాలని ఆత్రపడుతున్నారు.

తోటి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌ల స్థాయి మార్కెట్ విలువకు చేరుకోలేక, గత పదేళ్ళలో 8 ఏళ్ళు ఈ తుర్రుపిట్ట నష్టాలే చవిచూసింది. కాబట్టి ప్రతిభావంతుడైన వ్యాపారిగా మస్క్ తొందర అర్థం చేసుకోవచ్చు. కానీ, ట్విట్టర్‌ను కొనేశా కాబట్టి ఏదైనా చేస్తా, అన్ని నిబంధనలకూ అతీతుణ్ణి అనుకుంటే కష్టం. రథసారథిగా ఈ పిచ్చి మారాజు చేపట్టే చర్యలు రేపు ఎదురుతన్నే ప్రమాదం ఉంది. ఈ ఇష్టారాజ్యపు చేష్టలన్నీ మాటల పిట్ట గొంతుకు ఉరి బిగించి, బెదిరిన వాణిజ్య ప్రకటనకర్తలు దూరం జరిగినప్పుడు వీడని నీడలా వెంటాడతాయి. ట్విట్టర్ సంస్థాపకుడు జాక్ కొత్తగా మొదలెట్టిన వికేంద్రీకృత సోషల్ నెట్‌వర్క్ బ్లూస్కై లాంటి వాటి నుంచి పోటీ సరేసరి. వరస చూస్తుంటే, ఈ వ్యవహారంలో తలబొప్పి కడితే కానీ తత్త్వం బోధపడేలా లేదు!

రాజధాని పట్ల మరింత స్పష్టత

విశ్లేషణ



కొమ్మినేని శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్టణాన్ని కార్యనిర్వాహక రాజధాని చేయాలన్న కృత నిశ్చయంతో ఉన్న విషయం మరోసారి విదితమైంది. ఆయన 'హిందూ' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఎక్కడ కూర్చోవాలన్నది ఆయన ఇష్టమే తప్ప, మరొకరి జోక్యం ఉండదని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కూర్చున్న చోటే మంత్రులు ఉంటారనీ, వారు ఉన్న చోటే కార్యదర్శులు ఉంటారనీ ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు విశాఖ ఎగ్జిక్యూటివ్ కాపిటల్ అవ్వాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి వక్కాణిస్తూ, ఈ విషయంలో తాను అన్ని కోణాలలో పరిశీలించి ఆచరణాత్మకంగా వ్యవహరిస్తున్నానని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ఎక్కడ కూర్చుంటే అదే రాజధాని అవుతుందని 'హిందూ' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనడం విశాఖపట్టణాన్ని పరిపాలనా రాజధానిగా చేయాలన్న ఆయన కృత నిశ్చయాన్ని మరోసారి తెలియజేస్తోంది. గత టరమ్‌లో ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను వదలి సడన్‌గా విజయవాడకు వచ్చి కూర్చున్నారు. 'ఓటుకు నోటు' కేసులో చంద్రబాబు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ కేసు నుంచి తప్పించుకోవడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ షరతు మేరకు ఆయన హైదరాబాద్‌ను రాత్రికి రాత్రే వదలిపెట్టారు. దీంతో హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వం ఖర్చు చేసిన వందల కోట్ల రూపాయలు వృథా అయ్యాయి. అప్పుడు చంద్రబాబు కూర్చున్న ప్రదేశమే రాజధాని అయినప్పుడు, ఇప్పుడు జగన్ చెబుతున్నట్లుగా ఆయన విశాఖ వెళ్లి కూర్చుంటే అదే రాజధాని అనుకోవచ్చు కదా. జగన్ మూడు రాజధానుల విధానం ప్రకటించినప్పటి నుంచి ఆయన ప్రతిపాదన ముందుకు వెళ్లకుండా ప్రతిపక్ష తెలుగుదేశంతో పాటు మిగతా పార్టీలు అడ్డుపుల్లలు వేస్తున్నాయి. అయినప్పటికీ జగన్ మాత్రం విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇందుకు ఆయన చూపుతున్న కారణాలు కూడా ఆలోచించదగినవే. విశాఖలో అయితే లక్షల కోట్ల వ్యయం చేయకుండానే రాజధాని భవన సముదాయాలను నిర్మించుకోవచ్చన్నది ఒక భావన. ఇది వాస్తవమే. ఆనాటి సీఎం చంద్రబాబు 'అమరావతి' పేరుతో 33 వేల ఎకరాల భూమిని సమీకరించడం, దానిని అభివృద్ధి చేయడానికి లక్షల కోట్లు వ్యయం చేయాల్సి ఉండడం, తొలి దశలోనే ప్రాథమిక సదుపాయాలకే 1,08,000 కోట్ల రూపాయలు అవసరమని, కనుక నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరడం జరిగింది. కేంద్రం ఆ లేఖను పక్కనపెట్టేసింది. తాను ఇవ్వదలిచిన 1,500 కోట్లను ఇచ్చి చేతులు దులుపుకుంది. దాంతో మొత్తం వ్యయభారం అంతా ఏపీ ప్రభుత్వంపైన పడుతుంది.

అసలు చంద్రబాబు రైతుల నుంచి అన్నివేల ఎకరాలు సేకరించి, వారికి కోట్ల రూపాయల లాభం వస్తుందని ఆశ చూపించడం ఎంత వరకు సమంజసం? ఇన్‌సైడ్ ట్రేడింగ్, అస్సైన్డ్ భూముల కుంభకోణాల గురించి చెప్పనవసరం లేదు. తాజా వార్తల ప్రకారం సుమారు వెయ్యి ఎకరాల అస్సైన్డ్ భూములను పేద దళితుల నుంచి బలవంతులైన రాజకీయనేతలు, దళారులు లాక్కుని, అర్ధరాత్రి రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారు. ఇక్కడ మరో సంగతి ఏమిటంటే అమరావతిగా గుర్తించిన గ్రామాలలో గజం ఇరవైవేల నుంచి ముప్పై వేల వరకు ధర పలికినా, ప్రభుత్వం మాత్రం గజం ధర ఐదువేల లోపే ఉంచింది. అంటే మిగిలినదంతా బ్లాక్ మనీగానే లావాదేవీలు సాగాయన్నమాట.



ఇక అవుటర్ రింగ్ రోడ్డు మాయాజాలం మరో కథ. పలుకుబడి కలిగిన ఆసాములు తమ భూములు రాజధాని భూ సమీకరణలో పోకుండా జాగ్రత్తపడ్డారని ఆరోపణలు వచ్చాయి. అందులో చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ, చంద్రబాబు మకాం చేసిన కరకట్ట నివాసం యజమాని లింగమనేని రమేష్‌కు చెందిన భూములు కూడా ఉన్నాయని ప్రభుత్వం ఆధార సహితంగా వెల్లడించింది. ఇన్ని తంతులు ఇక్కడ జరిగితే ఎక్కడా వార్తలు ఇవ్వని ఈనాడు, తదితర టీడీపీ మద్దతు మీడియా సంస్థలు విశాఖపట్నంలో కబ్జాలు జరుగుతున్నాయనీ, మరొకటనీ విషం కక్కుతున్నాయి. కబ్జాల వంటి నేరాలు అన్ని పట్టణాలలో జరుగుతూనే ఉంటాయి. వాటిని ప్రభుత్వాలు అరికట్టడానికి చర్యలు తీసుకుంటాయి. గతంలో టీడీపీ హయాంలో విశాఖలో జరిగిన భూ కుంభకోణాలపై ఆనాటి ప్రభుత్వమే సిట్ నియమించింది. మరి అప్పుడు కబ్జాలు జరిగినా ఫర్వాలేదని ఈనాడు మీడియా భావించిందా? హైదరాబాద్‌లో నిత్యం కబ్జా వార్తలు వస్తూనే ఉంటాయి. అంతమాత్రాన హైదరాబాద్ రాజధాని నగరంగా పనికి రాదని ఎన్నడైనా ఈనాడు రాసిందా? మరి విశాఖ విషయంలోనే ఎందుకు ఇలా చేస్తున్నారు? దానికి ఒకే కారణం కనిపిస్తుంది. అమరావతిలో టీడీపీకి, ఈనాడు వంటి మీడియా సంస్థలకు వ్యాపార ప్రయోజనాలు ముడిపడి ఉండడం కావచ్చు. విశాఖ ఎగ్జిక్యూటివ్ కాపిటల్ అయితే రాజకీయంగా టీడీపీకి నష్టం కలుగుతుందన్న భావన కావచ్చు.

పోనీ అమరావతే తక్కువ వ్యయంతో సకాలంలో అభివృద్ధి చెందే అవకాశం ఉందా అంటే అది జరిగే పని కాదని అర్థం అవుతుంది. అందువల్లే అప్పట్లో చంద్రబాబు నాయుడు తాత్కాలిక భవనాల నిర్మాణం పేరుతో కథ నడిపారు. ఆయన నవనగరాలని చెబుతూ అన్నిటినీ అమరావతిలోనే నిర్మిస్తామని ప్రజలను మభ్యపెట్టే యత్నం చేశారు. తాము కట్టే పన్నుల డబ్బు అంతా ఒక ప్రాంతంలో, అదీ ఒక వర్గం ఎక్కువగా ఉన్న చోట వారికి లబ్ధి చేకూరేలా చంద్రబాబు అమరావతి నిర్మాణం చేస్తున్నారని వివిధ ప్రాంతాల ప్రజలు భావించి టీడీపీని ఘోరంగా ఓడించారు. పోనీ అమరావతిగా చెప్పిన ప్రాంతంలో అయినా గెలిచారా అంటే అదీ జరగలేదు. కేవలం ఒక వర్గం కోసమే చంద్రబాబు ఇదంతా చేస్తున్నారనీ, మిగిలిన సామాజికవర్గాలు అనుమానించి టీడీపీకి వ్యతిరేకంగా ఓట్లు వేశాయి. ఈ విషయాలను గమనించకుండా చంద్రబాబు తన ఓటమి తర్వాత కూడా మళ్లీ అమరావతి పాట అందుకున్నారు. రైతుల పేరుతో కొందరిని ఆందోళనకు పురికొల్పారు. పాదయాత్రల ప్రహసనం సృష్టించారు. అమరావతి నుంచి అరసవెల్లి పాదయాత్రలో కొందరు రైతులు, మహిళలు, టీడీపీ నేతలు తొడలు చరచడం, చెప్పులు చూపడం వంటివి చేసి ఉత్తరాంధ్ర ప్రజలలో సెంటిమెంట్ రగలడానికి కారకులయ్యారు. హైకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా యాత్రలు సాగించి రాజకీయ డ్రామాలు సృష్టించబోయి బొక్కబోర్లాపడి, చివరికి రామచంద్రాపురం నుంచి సర్దుకుని వెనుదిరిగారు. మళ్లీ పాదయాత్ర చేస్తారా? లేదా అన్నది వేరే విషయం.

కానీ ఈలోగా విశాఖపట్టణంలోనూ, ఉత్తరాంధ్ర అంతటా విశాఖ రాజధాని కావాలన్న నినాదం ఊపు అందుకుంది. విశాఖతోపాటూ, వివిధ పట్టణాలలో దీనికి సంబంధించిన సదస్సులు, ర్యాలీలు, సభలు జరుగుతున్నాయి. అలాగే రాయలసీమలో కూడా ఇదే తరహా ఉద్యమాలు వచ్చాయి. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీనే దీనికి నిదర్శనం అని చెప్పాలి. కర్నూలు తదితర పట్టణాలలో కూడా శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టు రాయలసీమకు ఇవ్వాలన్న డిమాండ్‌కు ప్రజల నుంచి విశేష మద్దతు వస్తోంది.

నిజానికి విశాఖ రాజధాని అయితే మొత్తం రాష్ట్రానికి ప్రయోజనం. తాజాగా అక్కడ ప్రధాని మోదీ పలు భారీ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఐటీ పరిశ్రమ కూడా అక్కడ పెరగడానికి ఆస్కారం ఉంది. రాజధాని విషయంలో చంద్రబాబు చేసిన తప్పును సరిచేయడానికి జగన్ సంకల్పించారు. తమ ప్రతిపాదన మూడు ప్రాంతాల సమతుల అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆయన వివరిస్తున్నారు. కాగా ఏపీ హైకోర్టు ఇచ్చిన ఒక చిత్రమైన తీర్పుపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి శాసనం చేసే హక్కులేదనీ, ఆరు నెలల్లో రాజధాని నిర్మించాలనీ హైకోర్టు వ్యాఖ్యానించడంపై వివిధ వర్గాలలో వ్యతిరేకత వచ్చింది. ఏపీ శాసనసభ సైతం ఈ తీర్పును వ్యతిరేకిస్తూ చర్చలు జరిపింది. ఈ నేపథ్యంలో జగన్ తాను వెళ్లి విశాఖలో కూర్చుంటాననీ, తానెక్కడ ఉంటే మంత్రులూ, ప్రభుత్వ కార్యదర్శులూ అక్కడే ఉంటారనీ, అప్పుడు అదే రాజధాని అవుతుందని అంటున్నారు. ఏదో రకంగా ఈ సమస్యకు సత్వర పరిష్కారం వస్తే మంచిదని చెప్పాలి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇది పండుగ రోజు



మన సంస్కృతిని– మన కీర్తిని, మన పూర్వీకుల పోరాటాలను – విజయాలను, ఈ నేలపై జన్మించిన ఎందరో మహానుభావుల త్యాగాలను ఘనంగా స్మరించుకునే పండుగ రోజు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పునరంకితం అవుదాం.

– వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి, ఏపీ సీఎం

కోల్పోయాం అస్తిత్వం



నవంబర్ 1 తుళువలకు చీకటి దినం. ఈ శాపగ్రస్థ రోజునే తుళునాడు విభజితమైంది. కాసర్‌గోడ్ ప్రాంతాన్ని కేరళకు ఇచ్చి, మిగిలినది మైసూర్ రాష్ట్రంలో విలీనం చేశారు. మా అస్తిత్వం, భాష, సంస్కృతిని కోల్పోయే ప్రయాణం అలా 1956లో ప్రారంభమైంది. ఈ గ్రహింపు అందరిలో కలగాలి.

– నవీన్ శెట్టి, తుళు యాక్టివిస్ట్

అందరివాడు



లులా (బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన వామపక్ష లులా డ సిల్వా) రైట్‌వింగ్ వాళ్లకు కూడా స్నేహితుడు కాగలడు. అయినా గొప్ప ప్రగతిశీల నాయకుడిగా ఉండగలడు. అతడి సమ్మోహనశక్తి భిన్న మెదళ్లను ఆకర్షించగలదు. రాజకీయాలకు అతీతంగా మనుషులతో కలవగలిగే ఒక రాజకీయ నాయకుడికి వరం లాంటి రహస్యాయుధం ఆయన దగ్గర ఉంది.

– ఎం.కె. భద్రకుమార్, మాజీ దౌత్యవేత్త

ఉచితంగా ఎన్నాళ్లు?



ఆదాయం వస్తేనేగా... మేము బండి నడిపేది. ట్విట్టర్ పూర్తిగా ప్రకటనకర్తలపై ఆధారపడలేదు. పోనీ బ్లూటిక్‌కు 20 కాక 8 డాలర్లు పెడితే?

– ఎలన్ మస్క్, 'ట్విట్టర్' అధినేత


ఎట్టెట్టా... పిట్టకు డబ్బా?



ధ్రువీకృత ఖాతా కోసం నెలకు 20 డాలర్లా? అలా అయితే ఈ పక్షి (ట్విట్టర్) ఉచితంగా ఉన్నట్టా? ఈ పిట్ట ఖరీదైనది.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

బాధ్యత తీసుకోవడమూ ఆదర్శమే!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"గుజరాత్‌లోని 'మోర్బీ' వద్ద 143 ఏళ్ల నాడు నిర్మించిన సస్పెన్షన్ బ్రిడ్జి ప్రసిద్ధ టూరిస్టు కేంద్రంగా ఉన్న ఆ పట్టణం గుండా ప్రవహించే మచ్చు నదిలో అకస్మాత్తుగా కూలిపోయిన ఫలితంగా వందలాదిమంది సందర్శకులు పిల్లాజెల్లాతో ఘోరమైన విషాదానికి గురయ్యారు. పైగా ఇటీవలనే మరమ్మత్తులు పూర్తయి పునఃప్రారంభమైన వంతెన కాస్తా కూలిపోవడం పలు అనుమానాలకు తావిచ్చింది. వంతెనల నిర్మాణంలో సరైన అనుభవం, నైపుణ్యం లేని ఒక ప్రయివేట్ కంపెనీకి వంతెన నిర్మాణ కాంట్రాక్టు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా, ఒకే సమయంలో 150 మందికి మించి భరించగల బ్రిడ్జి కాదని మాత్రం నివేదికలు తెల్పుతున్నాయి. వివిధ స్థాయుల్లో ప్రభుత్వ పాలనా సామర్థ్య లోపం ఫలితంగానే సరాసరి ప్రజల్ని మృత్యువు నోట్లోకి నెట్టేసినట్లయిందని నివేదికలు తెల్పుతున్నాయి. ఈ విషయమై పూర్తి విచారణ జరిపి, బాధ్యత ఎవరిదో తేల్చాలి. ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి."

– 'ది హిందూ' సంపాదకీయం (1 నవంబర్ 2022)

ప్రజలు విషాద ఘటనల బారిన పడినప్పుడు పాలకులు కనీస నైతిక బాధ్యత వహించవలసిన అవసరం ఉందని లాల్ బహదూర్ శాస్త్రి గుర్తించారు. జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలోని సీనియర్ సభ్యు నిగా లాల్ బహదూర్ శాస్త్రి నెలకొల్పిన 'సువర్ణ ప్రమాణాల్ని' మరో సారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. అది 1956 ఆగస్టు. మహబూబ్‌నగర్ వద్ద ఘోరమైన రైలు ప్రమాదం జరిగింది. ఆ దుర్ఘటనలో 112 మంది చనిపోయారు. లాల్ బహదూర్ ఆ ఘటనకు కలత చెంది, తన పదవికి రాజీనామా చేస్తూ, ఆ లేఖను నెహ్రూకు పంపారు. 'వద్దు, వద్దు' అని నెహ్రూ నివారించడంవల్ల, లాల్‌బహదూర్ తాత్కాలికంగా ఆగారే గానీ అరియలూర్ (తమిళనాడు)లో అదే సంవత్సరం మరో రైలు ప్రమాదం జరిగి 144 మంది మరణించారు. ఈ రెండు వరుస విషాదకర ఘటనలతో లాల్‌బహదూర్ ఆవేదన నిలుపుకోలేక వెంటనే నెహ్రూకు రాజీనామా లేఖ సమర్పిస్తూ... 'ఇక నన్ను ఒత్తిడి చేయవద్దు, వెంటనే ఆమోదించవలసింది' అని కోరారు.

ఆ విషయమై నెహ్రూ లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ లాల్ బహదూర్ నిర్ణయం పట్ల అత్యంత గౌరవాన్ని వ్యక్తం చేశారు. "విశాల మైన మనస్సుతో ఆలోచిస్తే, ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు మనం ఆదర్శంగా నిలబడటం రాజ్యాంగ విలువల దృష్ట్యా గొప్ప ఉదాహరణగా నిలిచిపోతుంది. ఇలాంటి సందర్భాల్లో ఏది ఏమైనా సరే మనం పట్టించుకోకుండా తలొంచుకుని పోదామనే ధోరణి సరైనది కాదు" అని నెహ్రూ చెబుతూ రాజ్యాంగ మర్యాదను పాటించడం ధర్మమని ప్రకటించాల్సి వచ్చింది. అయితే నెహ్రూ ప్రకటనను పత్రికలు తప్పుబట్టాయి. 30 మంది పార్లమెంట్ సభ్యులు కూడా లాల్‌బహదూర్ రాజీనామాను అంగీకరించ'వద్దు' అని నెహ్రూకు విజ్ఞప్తి చేశారు. శాస్త్రి వ్యక్తిగతంగా రైలు ప్రమాదాలకు కారకుడు కారు గనుక రాజీనామాను ఆమోదించవద్దని విజ్ఞప్తి చేశారు. అయినా లాల్ బహదూర్ నిర్ణయాన్ని ఎవరూ ఆపలేకపోయారు.

'లాల్ బహదూర్ శాస్త్రి – రాజకీయాలు ఆపైన' (పాలిటిక్స్ అండ్ బియాండ్) అన్న గ్రంథంలో ప్రసిద్ధ వ్యాఖ్యాత సందీప్ శాస్త్రి ఈ విషయం గురించి చెబుతూ – "లాల్‌బహదూర్ నెలకొల్పిన ఉత్తమ సంప్రదాయం దేశ చరిత్రలో, నాయకుల చరిత్రలో ఒక ఉన్నత ప్రమా ణాన్ని నెలకొల్పింది. ఇతరులు ఆ ప్రమాణాన్ని పాటించక పోవచ్చు. కానీ, రాజకీయ ప్రమాణాలకు, వైశిష్ట్యానికి లాల్‌బహదూర్ నెలకొల్పిన ఆదర్శాలు ఉన్నతమైనవి" అన్నారు. రెండు రైలు ప్రమాద దుర్ఘటనల తర్వాత ఆరు దశాబ్దాలు గడిచిపోయాయి. అయినా ఇప్పటికీ లాల్‌బహదూర్ శాస్త్రి ఆదర్శం, నెలకొల్పిన నైతిక విలువల వైశిష్ట్యాన్ని గురించి అంచనాలు కొనసాగుతూనే ఉన్నాయి.

గుజరాత్ 'మోర్బీ' బ్రిడ్జి కంటే ముందే, సుమారు 150 ఏళ్లనాడు గోదావరి నదిపై ఆనకట్ట తలపెట్టారు సర్ ఆర్థర్ కాటన్. కాలం ముగియకముందే జాగ్రత్తలు తీసుకుంటే వంతెన ఆయుష్షును పెంచుకోవచ్చునని చెప్పిన మహనీయుడు కూడా ఆయన. కరువు కాటకాల వాతబడి కోట్లాది మంది గోదావరి జిల్లాల ప్రజలు అల్లల్లాడిపోతున్న సమయంలో ఆనకట్ట నిర్మాణం కోసం తన బ్రిటన్ సామ్రాజ్య పాల కులపైనే ఒత్తిడి తెచ్చిన ధీశాలి కాటన్. 'మన (బ్రిటన్) డబ్బంతా తీసుకుపోయి అక్కడ పోస్తే, మనకేం లాభం?' అని బ్రిటిష్ పాలకులు కాటన్‌కు పాఠం చెప్పబోతే, వారి బుర్రల్ని తెలివిగా 'చిత్రిక పట్టి' గోదావరి జిల్లాలను కరువు కాటకాల నుంచి రక్షించారు కాటన్. 'నీకు ఆదాయం రావాలన్నా ముందుగా ప్రజలు బతికి బట్టకట్టాలి కదా. తద్వారా పన్నుల రూపంలో వచ్చే ఆదాయం మన బ్రిటన్‌కే వస్తుంది కదా' అని పాఠం చెప్పారు. అలా ఉభయతారకంగా వ్యవహరించిన రాజనీతిజ్ఞుడు కాటన్. అందుకే ఈ రోజుకీ గోదావరి జిల్లాల ప్రజలు చిన్నాపెద్దా ఏ శుభ ముహూర్తాలు తమ ఇళ్లలో జరిగినా 'కాటనాయ నమః' అని ఆయన్ని కీర్తించుకుంటూ ఉంటారు.

రెండో మాట



నదుల మధ్య అనుసంధానం నెలకొల్పి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నాడు మగ్గుతున్న ఆంధ్ర ప్రాంతాలలో జలవనరుల అవసరం తీర్చడానికి శ్రద్ధతో స్కీములు వేసిన మహనీయుడు కాటన్. ఆంధ్ర రాజకీయ, సామాజిక, వివిధ నిర్మాణ రంగాలలో ఉద్దండులైన ముక్త్యాల రాజా, ఇంజనీర్ కె.ఎల్. రావు, మోటూరు సత్యనారాయణ, ఆచార్య రంగా ఇత్యాది ప్రభృతులు కాటన్ కృషిని మరింతగా ముందుకు తీసుకువెళ్లారు. నెహ్రూ ఆశీస్సులతో బహుళార్థ సాధక నాగార్జున సాగర్ ప్రాజెక్టు లాంటి నిర్మాణాన్ని సుసాధ్యం చేసు కోగలిగారు. అంతేగాదు, కాటన్ మహాశయుడు దక్షిణాది రాష్ట్రాల సౌభాగ్య గరిమకు చేదోడువాదోడు కావడమే గాక, ఉత్తరాది సరిహద్దులలో తిష్ఠ వేసిన బ్రహ్మపుత్రతో వియ్యమందుకుని, ఆంధ్ర మున్నగు దక్షిణ భారత రాష్ట్రాలకు జల విద్యుత్ సౌభాగ్యాన్ని అందించాలని కూడా పథకాలు వేశాడు. అసలు బ్రహ్మపుత్ర ఆధారంగా మధ్య భారతం దన్నుగా యావద్భారతం నలుమూలలకూ ఆరుగాలమూ జల, విద్యుత్ సంపద పంపిణీ అయ్యేందుకూ బృహత్ పథకం రచించాడు. ఆ స్ఫూర్తితోనే మన కె.ఎల్. రావు, కొంతి రామ్మూర్తి ప్రభృతులు మరికొన్ని పథకాలు రూపొందిస్తూ వచ్చారని మరవరాదు.

కానీ, ఎందుకని ఈ మహనీయుల కృషిని మరింత ముందుకు తీసుకుపోవడంలో దేశీయ పాలకులు విఫలమవుతున్నారు? ఎందుకు వారిలా శ్రద్ధ చూపడం లేదు? రాజ్యాంగం గుర్తించిన ఫెడరల్ వ్యవస్థ స్వరూప స్వభావాల్ని నాశనం చేస్తూ 'ఒక దేశం, ఒకే ఎన్నిక'... ఒకడే నాయకుడు, ఒకటే పార్టీ అని మాత్రం యాగీ చేస్తున్నారు. ప్రణాళికా వ్యవస్థ రద్దయింది. ప్రభుత్వ రంగాన్ని చాపచుట్టి, కార్పొరేట్ గుజరాత్ రాజ్యం యావద్భారతాన్ని చుట్టబెడుతోంది. 'భారత ప్రజలమైన మేము మాకుగా భారత రాజ్యాంగాన్ని రూపొందించుకుని అంకిత మిచ్చుకుంటున్న మౌలిక పత్రం ఇది' అని రాజ్యాంగం ముందు మాటలోనే స్పష్టం చేసినా – పాలకుల చేతుల్లో దాని ముఖ వర్చస్సు అంతా చెదిరిపోయింది. కనుకనే నేటి దుర్బుద్ధులూ, పెడబుద్ధులూ! రోజుకో తీరు చొప్పున చెదిరిపోతున్న మౌలిక రాజ్యాంగ స్ఫూర్తి. ఇది నిలవాలంటే, పౌర బాధ్యతల అధ్యాయపు కనీస విలువను కాపాడు కోవడానికైనా ఉద్యమించవలసిన అవసరం ఉంది. 2024 వచ్చేలోగానే పౌర సమాజం తన గాఢ నిద్రను వదిలించుకోగలగాలి!

అవును మరి –

"ఏది పలికినా శాసనమైతే ఎందుకు వేరే జనవాక్యం
ఏది ముట్టినా కాంచనమైతే ఏది శ్రమశక్తికి మూల్యం?"

– సినారె

abkprasad2006@yahoo.co.in

అసత్యాలూ అర్ధసత్యాలే!

అక్టోబర్ 21న మల్లెపల్లి లక్ష్మయ్య రాసిన 'ఆ ప్రతిజ్ఞలే మార్గదర్శకాలు' వ్యాసానికి స్పందనగా ఇది రాస్తున్నాను. గత అరవై ఏళ్లుగా నియోబుద్ధిస్ట్ లాబీ, అంబేడ్కర్‌వాదులూ బాబా సాహెబ్ అంబేడ్కర్ గురించి కట్టుకథలు, అర్ధసత్యాలు సృష్టించడంలో విజయం సాధించారు. అయితే అరుణ్ శౌరి (వర్షిపింగ్ ఫాల్స్ గాడ్స్) తప్ప మిగిలిన వారందరూ అంబేడ్కర్‌కు సంబంధించిన నిజా నిజాలను నిగ్గు తేల్చి, వాస్తవాలను వెలికి తీసే విషయంలో ధైర్యం చేయలేక పోయారనిపిస్తోంది. కొందరు సీరియస్ మేధావులని అనుకున్న వారు కూడా అంబేడ్కర్‌వాదులను మచ్చిక చేసుకోవడానికే తమ వ్యాసాల ద్వారా ప్రయత్నించారు. ఇందులో రాసినవేవీ తర్కానికీ, శాస్త్రీయతకు, చరిత్ర కాల పట్టికకు అనుగుణంగా ఉన్నవి కావు. అసలు అంబేడ్కర్‌కు బౌద్ధ మతం లేదా హిందూ మతం మీద కానీ ఏమాత్రం పట్టు లేదు.

అంబేడ్కర్ రాసిన, చెప్పిన ప్రతి మాటనూ అంబేడ్కర్‌వాదులూ, నియోబుద్ధిస్టులూ గుడ్డిగా సమర్థిస్తారు. అంబేడ్కర్‌పై చిన్న విమర్శను కూడా వారు సహించలేరు. వారికి హిందూ మతంపైనా, హిందూ దేవుళ్లు, దేవతలపైనా; బ్రాహ్మణులూ, రాజకీయ నాయకులపైనా విమర్శలు చేసే వాక్ స్వాతంత్ర్యం ఉంది. కానీ ఇతరులెవరూ అంబేడ్కర్‌ను విమర్శించకూడదు! అంబేడ్కర్ స్వయంగా తన రచనల్లో హిందూమతంపైనా, బ్రాహ్మణులపైనా తన ద్వేషాన్ని వెళ్లగక్కారు. 1956 అక్టోబర్ 14న అమాయక హిందువులను బౌద్ధమతంలోకి మారుస్తూ దీక్ష ఇచ్చిన సమయంలో చేయించిన 22 ప్రతిజ్ఞల్లోనూ ఇదే విద్వేషం కనిపిస్తుంది. వీటిని అంబేడ్కరే రూపొందించారు. ఆరోజు అక్కడ చేరిన వారందరూ తాము హిందూ మతంలోకి మారుతున్నామనే అనుకున్నారు. బౌద్ధమతంలో ఈ 22 ప్రతిజ్ఞలు లేవని వారెవరికీ తెలియదు. నిజానికి అంబేడ్కర్ బౌద్ధమతంలోకి మార్చే పేరుతో ఆయనే ఓ సొంత మతాన్ని కనుగొన్నారు.

అసలు ఆయన తన 22 ప్రతిజ్ఞలను ఎలా సమర్థించుకుంటారనేది ఆశ్చర్యకరం. ఎందుకంటే బుద్ధిజం ఎప్పుడూ హిందూ మతాన్నీ, బ్రాహ్మణులనూ ద్వేషించలేదు. 1920ల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని అంబేడ్కర్ పనులను సమర్థిస్తున్నారు అంబేడ్కర్ వాదులు. మరి రాజ్యాంగ ముసాయిదా కమిటీకి ఛైర్మన్‌గా ఉండమని ఆహ్వానిస్తూ ఇచ్చిన గౌరవం సంగతేంటి? (అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రాయలేదనేది వేరే సంగతి అనుకోండి!) మల్లెపల్లి లక్ష్మయ్య లాంటి వారు అంబేడ్కర్ వెళ్లగక్కిన హిందూ ద్వేషాన్ని ఒక యుద్ధంగా సమర్థిస్తున్నారు. అంబేడ్కర్ ఎటువంటి మతాన్ని ప్రతిపాదించారనేది ఇప్పటికీ అర్థంకావడం లేదు!!

– డాక్టర్ పి. కృష్ణమోహన్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్వీయూ

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.నవమి రా.10.53 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ధనిష్ఠ తె.4.06 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి శతభిషం, **వర్జ్యం:** ఉ.9.20 నుండి 10.52 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.20 నుండి 12.05 వరకు, **అమృతఘడియలు:** సా.6.20 నుండి 7.50 వరకు; **రాహుకాలం :** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం :** ఉ.7.30 నుండి 9.00 వరకు; **సూర్యోదయం** 6.02; **సూర్యాస్తమయం** 5.26.

కమనీయంగా 'ఉయ్యాల కంబాల'


పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: సిరులతల్లి పైడితల్లి అమ్మవారి ఉత్సవాల ముగింపు వేడుకల్లో కీలకఘట్టమైన ఉయ్యాల కంబాల మహోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ఊయల ఊగుతూ భక్తులను ఆశీర్వదించారు. విజయనగరం మూడులాంతర్ల వద్దనున్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి భక్తుల దర్శనాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ అర్చకులు వేకువజామునుంచే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు జరిపారు. ఆలయ ఈవో కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో చదురుగుడి ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాల చుట్టూ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు సమక్షంలో ఉయ్యాలలో అమ్మను ఆశీనులను చేసి ఘట్టాన్ని నిర్వహించారు. ఉయ్యాల కంబాల అనంతరం సిరిమానుతో పాటూ తెచ్చిన రాటకు మూడుసార్లు గొడ్డలి ఆనించి ఊయలను తీసివేశారు. దీంతో అమ్మవారి నెలరోజుల జాతరకు ముగింపు పలికినట్లేనని, వనంగుడి వద్ద బుధవారం నిర్వహించే చండీహోమం, పూర్ణాహుతితో జాతర ముగుస్తుందని అర్చకులు తెలిపారు. ఉత్సవం పూర్తయిన తర్వాత అమ్మవారిని మేళతాళాలతో వనంగుడికి తీసుకువెళ్తారు. ఆరు నెలల పాటు అమ్మవారు అక్కడే భక్తులకు దర్శనమిస్తారు.

బీసీల అభ్యున్నతి చూసి ఓర్వలేకే విమర్శలు

- ఆర్.కృష్ణయ్యపై బురదచల్లడం తగదు
- బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్


మాట్లాడుతున్న పితాని ప్రసాద్

ఏయూక్యాంపస్: రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ కోవర్టులుగా ఉన్న నాయకులు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అర్పించి, అవిశ్రాంత పోరాటాలు చేసిన ఆర్.కృష్ణయ్యపై టీడీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. టీడీపీ నాయకులు, ముఖ్యంగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలను పితాని ప్రసాద్ ఖండించారు. ఆర్.కృష్ణయ్యపై విమర్శలు చేస్తున్న టీడీపీ నాయకులకు ఆత్మసాక్షి ఉందా... అని ప్రశ్నించారు. ఇటీవల విజయవాడలో బీసీల ఆత్మగౌరవ సభ విజయవంతం కావడం చూసి ఓర్వలేక టీడీపీ అధినాయకత్వం సూచనలతో ఆ పార్టీ నాయకులు దిగజారుడు వ్యాఖ్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆర్.కృష్ణయ్యపై దిగజారుడు వ్యాఖ్యలు మానుకోవాలని, లేకపోతే బీసీలంతా తిరగబడి తగిన గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు. ఇప్పటికే తెలంగాణలో నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకు పోయిన టీడీపీ... ఆంధ్రప్రదేశ్‌లో కూడా భూస్థాపితం అవుతుందన్నారు. బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కుక్కల ధర్మరాజు, సంయుక్త కార్యదర్శి కాగితాల రామారావు గౌడ్, విద్యార్థి నాయకులు బర్ల సురేష్‌కుమార్, ఈశ్వరపు మహేష్, శివ, ఎం.అరుణ్‌కుమార్, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

బాబు అండ్ కోకు శాస్తి తప్పదు

765వ రోజు రిలే నిరాహార దీక్షలలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అధికారం కోసం చేయ రాని తప్పులు చేసి ప్రజాధనం దోపిడీ చేసిన బాబు అండ్ కోకు తగిన శాస్తి తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 765వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎక్కడ నుంచి పాలన కొనసాగిస్తే అదే ప్రధాన రాజధాని అని, భవిష్యత్తులో విశాఖ నుంచి పాలన కొనసాగడం ఖాయమన్నారు. నిపుణుల కమిటీల నివేదికలను పక్కన బెట్టి ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తానని చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో లక్షల కోట్లు దోచుకున్న బాబును అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. రెండు చోట్లా పోటీచేసి చతికిలబడ్డ పవన్ కళ్యాణ్ .. చంద్రబాబు చంకలో చేరి ప్యాకేజీ కళ్యాణ్‌గా మారిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పేరుతో కొనసాగుతున్న అమరావతి బినామీ ఉద్యమానికి.. కోర్టు తీర్పుతో తగిన శాస్తి జరిగిందన్నారు. పేదలకు కూడా రాజధానిలో స్థానం కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్ చట్టసభల సాక్షిగా తీసుకున్న నిర్ణయం హర్షణీయమని తెలిపారు. మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఓ/o. స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

లెఫ్ నెం. బి1/294/2022 — **ఫారమ్ నెం.VI(ఎ)** — తేది: 22-10-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన అల్లూరి సీతారామరాజు జిల్లా, **వి.ఆర్.పురం మండలం, రామవరం గ్రామము (రామవరం మరియు రామవరంపాడు)** నందలి కట్టడములు ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ముంపునకు గురయ్యే నిమిత్తం అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధికల్పన చట్టము-2013 నందలి 11 వ విభాగపు 1 వ విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయమును గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణం ప్రభావం మదింపు (ఇ ఐ ఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖవారి లేఖ నెం. జె-12011/74/2005 -1ఎ1, తేది 25-10-2005 ప్రకారం జారీచేయబడినది.

ఈ ప్రాజెక్టు వలన పైనపేర్కొన్న గ్రామము నందు ఇండ్లు ముంపునకు గురిఅగుటవలన సుమారు 161 కుటుంబాలు నిర్వాసితులగుదురు. చట్టంలోని విభాగము43(1) క్రింద ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారిని బాధిత కుటుంబాలకు పునరావాస, పునరుపాధికల్పన కల్పించు నిమిత్తం కార్యనిర్వాహకునిగా నియమించుచూ ప్రభుత్వం జి. ఓ. ఎమ్. ఎస్. నెం. 42, రెవెన్యూ (భూసేకరణ) డిపార్టుమెంట్ తేది 10.05.2020 నందు ప్రకటించబడినది.

ప్రత్యేక కలెక్టర్ (భూ.సే) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు ప్రత్యేక కలెక్టర్ (భూ.సే) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కూనవరం యూనిట్, చింతూరు వారి సిబ్బందికి పనిబాలకి ఇందు మూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలో సెక్షన్ - 11 (4) ననుసరించి ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి ప్రత్యేక కలెక్టర్ (భూ.సే) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కూనవరం యూనిట్, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిలోని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ - 15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కూనవరం యూనిట్, చింతూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: అల్లూరి సీతారామరాజు — మండలం: వి. ఆర్.పురం — గ్రామం: రామవరం(రామవరం మరియు రామవరంపాడు)

వ.నెం.	సర్వే నెం.	భూ వివరములు	డోర్. నెం.	ప్లాటు నెం.	పట్టాదారుని యొక్క పేరు	ఇంటి స్వభావం	హద్దులు తూ	ప	ఉ	ద	కట్టడముల వివరాలు
	రామవరంపాడు గ్రామం										
1	70/5	పట్టా భూమి	6-56	1	మానే నాగమణి భర్త రామకృష్ణ	సిమెంటు రేకుల ఇల్లు	సిసి రోడ్	కుంజా రామారావు	జిన్నె భూషణం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
2	70/5	పట్టా భూమి	6-63	2	జిన్నె భూషణం తండ్రి రంగయ్య	తాటాకుల ఇల్లు	సిసి రోడ్	ఖాళీ స్థలం	సోలా నరసింహరావు	మానే నాగమణి	సిమెంటు రేకుల బాత్‌రూమ్
3	70/5	పట్టా భూమి	6-62	3	సోలా నరసింహరావు తండ్రి సీతారామయ్య	తాటాకుల ఇల్లు	సిసి రోడ్	ఖాళీ స్థలం	సోలా బుల్లెమ్మ	జిన్నె భూషణం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
4	70/5		6-61	4	సోలా బుల్లెమ్మ భర్త సీతారామయ్య	తాటాకుల ఇల్లు	సిసి రోడ్	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	సోలా నరసింహరావు	..
5			6-48	5	వెట్టి ముత్తమ్మ భర్త నాగయ్య	తాటాకుల ఇల్లు	కుంజా లక్ష్మయ్య	సిసి రోడ్	ఖాళీ స్థలం	వెట్టి బుజ్జి	తాటాకుల పశువుల షెడ్‌పందిరి
6			6-49	6	వెట్టి బుజ్జి తండ్రి నాగయ్య	తాటాకుల ఇల్లు	కుంజా లక్ష్మయ్య	సిసి రోడ్	వెట్టి ముత్తమ్మ	కుంజా నాగయ్య	..
7			6-44	7	కుంజా నాగయ్య తండ్రి వెంకయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీ స్థలం	సిసి రోడ్	వెట్టి బుజ్జి	కుంజా ముత్తమ్మ	తాటాకుల పశువుల షెడ్
8			No House Tax	8	కుంజా ముత్యయ్య తండ్రి నాగయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీ స్థలం	సిసి రోడ్	కుంజా నాగయ్య	కుంజా రమేష్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట పాక, తాటాకుల పాక
9			6-45	9	కుంజా రమేష్ తండ్రి నాగయ్య	సిమెంటు రేకుల ఇల్లు (కొత్తగా నిర్మిస్తున్నారు)	ఖాళీ స్థలం	ఖాళీ స్థలం	కుంజా ముత్యయ్య	ఖాళీ స్థలం	తాటాకుల పశువుల షెడ్
10			6-14	10	కుంజా చిన ముత్యయ్య తండ్రి వెంకయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	సిసి రోడ్	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల పశువుల షెడ్
11			6-43	11	సరియం సీతమ్మ భర్త లక్ష్మయ్య	తాటాకుల ఇల్లు	పెరుమళ్ల దుర్గా రావు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట పాక
12			6-42	12	పెరుమళ్ల దుర్గారావు తండ్రి రామకృష్ణ	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	సరియం సీతమ్మ	బత్తుల పార్వతి	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
13			6-40	13	ఇంటి చెల్లమ్మ భర్త రాములు	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	సరియం సీతమ్మ	పెరుమళ్ల దుర్గారావు	ఆర్ అండ్ బి రోడ్	..
14			6-41	14	బత్తుల పార్వతి భర్త రాములు	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	సరియం సీతమ్మ	కుంజా రమేష్	పెరుమళ్ల దుర్గారావు	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల షెడ్
15			6-18	15	కుంజా బుచ్చిరాజు తండ్రి వెంకయ్య	సిమెంటు రేకుల ఇల్లు	కుంజా కార్తీక్	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల పశువుల షెడ్
16			6-19	16	కుంజా కార్తీక్ తండ్రి బుచ్చిరాజు	తాటాకుల ఇల్లు	మాడె బాబూరావు	కుంజా బుచ్చిరాజు	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	..
17			6-21	17	మాడె ముత్యాలరావు తండ్రి బాబూరావు	తాటాకుల ఇల్లు	మాడె వీరన్న	కుంజా కార్తీక్		ఆర్ అండ్ బి రోడ్	తాటాకుల షెడ్ తాటాకుల పశువుల షెడ్
18			6-20	18	మాడె బాబూరావు తండ్రి రాములు	తాటాకుల ఇల్లు	మాడె వీరన్న	కుంజా కార్తీక్	ఖాళీస్థలం	మాడే ముత్యాలరావు	సిమెంటు రేకుల బాత్‌రూమ్
19	69/1		6-22	19	మాడె వీరన్న తండ్రి రాములు	తాటాకుల ఇల్లు	కుంజా వీరమ్మ	మాడె బాబూరావు	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	తాటాకుల షెడ్, సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంటపాక, తాటాకుల బిజినెస్‌షాపు
20			6-27	20	కుంజా వీరమ్మ తండ్రి రాముడు	తాటాకుల ఇల్లు	మాడెసం శివ రావు	మాడె వీరన్న	మానే వెంకటయ్య	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
21			6-29	21	సోలా రాంబాబు తండ్రి కన్నయ్య	తాటాకుల ఇల్లు	కుంజా తమ్మయ్య	కుంజా వీరమ్మ	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	
22			6-28	22	మాడె సంజీవరావు తండ్రి చిన్నయ్య	తాటాకుల ఇల్లు	కుంజా తమ్మయ్య	కుంజా వీరమ్మ	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల షెడ్
23			6-30	23	కుంజా చిన తమ్మయ్య తండ్రి జోగయ్య	నిర్మాణంలో ఉన్న పునాది భూమి	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్ బోర్‌మోటర్
24			6-39	24	జిన్నె చిట్టెమ్మ భర్త వీరన్న	తాటాకుల ఇల్లు	సోయం కన్నయ్య	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
25			6-38	25	సోయం కన్నయ్య తండ్రి మూతయ్య	సిమెంటు రేకుల ఇల్లు	కుంజా వీరయ్య	జిన్నె చిట్టెమ్మ	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
26			6-37	26	కుంజా వీరయ్య తండ్రి రామిశెట్టి	సిమెంటు రేకుల ఇల్లు	పైడా సీతయ్య	సోయం కన్నయ్య	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల వంటపాక
27			6-35	27	పైడా సీతయ్య తండ్రి సుబ్బయ్య	తాటాకుల ఇల్లు	సున్నం తమ్మయ్య	కుంజా వీరయ్య	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	తాటాకుల వంటపాక, సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల పశువుల షెడ్
28			7-1	28	సున్నం తమ్మయ్య తండ్రి సుబ్బయ్య	తాటాకుల ఇల్లు	సున్నం వెంకమ్మ	పైడా సీతయ్య	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	తాటాకుల పశువుల షెడ్, తాటాకుల కోళ్ల షెడ్, సిమెంటు రేకుల బాత్‌రూమ్
29			7-2	29	సున్నం వెంకమ్మ తండ్రి సుబ్బయ్య	తాటాకుల ఇల్లు	అల్లి హరిత్ కుమార్	సున్నం తమ్మయ్య	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
30			6-50	30	మానే రాములు తండ్రి వీరయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	సిసి రోడ్	ఖాళీస్థలం	వెట్టి ముత్తమ్మ	..
31			6-46	31	కుంజా లక్ష్మయ్య తండ్రి రాములు	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	కుంజా ప్రసాద్	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల పశువుల షెడ్
32			6-47	32	కుంజా ప్రసాద్ తండ్రి లక్ష్మయ్య	తాటాకుల ఇల్లు	పులి నాగేశ్వరరావు +245	వెట్టి ముత్తమ్మ	ఖాళీస్థలం	ఖాళీస్థలం	తాటాకుల షెడ్ తాటాకుల మేకల షెడ్
33	68/2	ప్రభుత్వ భూమి	6-51	33	పులి నాగేశ్వరరావు తండ్రి శంకరు	తాటాకుల ఇల్లు	సిసి రోడ్	ఖాళీస్థలం	పులి రత్తయ్య	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
34			6-52	34	పులి రత్తయ్య తండ్రి వీరయ్య	సిమెంటు రేకుల ఇల్లు	సిసి రోడ్	పులి రాజమ్మ	పులి నాగేశ్వరరావు	సి సి రోడ్	తాటాకుల షెడ్ తాటాకుల పశువుల షెడ్, సిమెంటు రేకుల బాత్‌రూమ్ బోర్‌మోటర్
35			6-53	35	పులి రాజమ్మ తండ్రి మూతయ్య	పెంకుటిల్లు	పులి రత్తయ్య	పులి రామకృష్ణ	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
36			6-54	36	పులి రామకృష్ణ తండ్రి చంద్రయ్య	తాటాకుల ఇల్లు	పులి రాజమ్మ	పులి చంద్రయ్య	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్ బోర్‌మోటర్
37			6-55	37	పులి చంద్రయ్య తండ్రి నాగయ్య	తాటాకుల ఇల్లు	పులి రామకృష్ణ	ఖాళీస్థలం	ఖాళీస్థలం	దారి	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పశువుల షెడ్‌తాటాకుల షెడ్
38			6-59	38	కూరా బ్రహ్మయ్య తండ్రి లక్ష్మయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	కుర్సా పోసమ్మ	తాటాకుల వంటపాక, తాటాకుల పందిరి, తాటాకుల పశువుల షెడ్, సిమెంటు రేకుల బాత్‌రూమ్
39			6-57	39	కూరా రోసమ్మ భర్త లక్ష్మయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	కూరా బ్రహ్మయ్య	మానే నాగయ్య	తాటాకుల మేకల పాక
40			6-67	40	మానే నాగయ్య తండ్రి లక్ష్మయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	కుంజా తమ్మయ్య	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, సిమెంటు రేకుల షెడ్‌బోర్‌వెల్
41			6-68	41	కుంజా తమ్మయ్య తండ్రి లక్ష్మయ్య	సిమెంటు రేకుల ఇల్లు	మానే నాగయ్య	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	తాటాకుల పందిరి, సిమెంటు రేకుల పందిరి
42	68/3	పట్టా భూమి	6-65	42	కుంజా ప్రసాద్ తండ్రి పుల్లయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	కుంజా పుల్లయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్
43			6-66	43	కుంజా పుల్లయ్య తండ్రి లక్ష్మయ్య	పెంకుటిల్లు	కుంజా రాములమ్మ	పాండ్రు వెంకటేశ్వర్లు	కుంజా ప్రసాద్	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పందిరి
44	68/3	పట్టా భూమి	6-64	44	కుంజా రాములమ్మ భర్త పొట్టయ్య	ఆర్‌సిసి బిల్డింగ్	ఖాళీస్థలం	కుంజా పుల్లయ్య	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల ఇల్లు, తాటాకుల వంటపాక, తాటాకుల పందిరి
45			6-69	45	పాండ్రుం వెంకటేశ్వర్లు తండ్రి ముత్యయ్య	తాటాకుల ఇల్లు	కుంజా పుల్లయ్య	కుంజా ముత్తమ్మ	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల షెడ్
46			6-70	46	కూరా ముత్తమ్మ భర్త ధర్మయ్య	తాటాకుల ఇల్లు	పండ్రం వెంకటేశ్వర్లు	కుంజా చంద్రరావు	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
47			6-95	47	కుంజా చంద్రరావు తండ్రి పుల్లయ్య	సిమెంటు రేకుల ఇల్లు	కూరా ముత్తమ్మ	కుర్సా పొట్టి	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంటపాక
48			6-2	48	కుంజా జానకమ్మ భర్త పొట్టి	సిమెంటు రేకుల ఇల్లు	కుంజా చంద్ర రావు	ఖాళీ స్థలం	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల పశువుల షెడ్
49	68/2	ప్రభుత్వ భూమి	6-58	49	కూరా ధర్మయ్య తండ్రి లక్ష్మయ్య	పునాదితో ఉన్న ఇల్లు (రూమ్‌లు, పై కప్పులు లేవు)	ఖాళీ స్థలం	పులి చంద్రయ్య	ఖాళీస్థలం	ఖాళీస్థలం	తాటాకుల పశువుల షెడ్
50	69/3	పట్టా భూమి	6-118	50	మానే విజయ్	సిమెంటు రేకుల ఇల్లు నిర్మాణంలో ఉన్నది	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	నరసింహ రావు	పైడా చంద్రమ్మ	..
51	66/1	పట్టా భూమి	6-117	51	పులి నారాయణ తండ్రి బాలయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	తాటాకుల వంట పాక, తాటాకుల పందిరి, తాటాకుల పశువుల షెడ్, సిమెంటు రేకుల బాత్‌రూమ్
52	66/1	పట్టా భూమి	6-116	52	పులి రమేష్ తండ్రి మల్లయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
	రెండవ లిస్టు										
53	77	పట్టా భూమి	6-77	14/ఎ	రవ్వా దూలయ్య తండ్రి సన్యాసి	తాటాకుల ఇల్లు(గోడలు లేవు)	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
54	76	పట్టా భూమి	6-81	18	పండ్రం కన్నయ్య తండ్రి పెద వెంకటేశ్వర్లు	పునాదితో ఉన్న ఇల్లు (రూమ్‌లు, పై కప్పులు లేవు)	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల వంటపాక తాటాకుల కోళ్ల షెడ్
55	76	పట్టా భూమి	6-82	19	పాండ్రుం బాలరాజు తండ్రి చిన వెంకటేశ్వర్లు	తాటాకుల ఇల్లు	గ్రావెల్ రోడ్	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	తాటాకుల షెడ్ సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల మేకల షెడ్, తాటాకుల కోళ్ల షెడ్
56	77	పట్టా భూమి	6-73	20	మానే భాయమ్మ భర్త లేట్ వెంకటయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	మానే సీతారామయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్‌మేకల షెడ్
57	77	పట్టా భూమి	6-74	21	మానే సీతారామయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	మానే భాయమ్మ	పూసం సత్తెమ్మ	పై కప్పు లేని బాత్‌రూమ్, తాటాకుల షెడ్, తాటాకుల వంట పాక, తాటాకుల పశువుల షెడ్
58			6-75	22	పూసం సత్తెమ్మ భర్త లేట్ భద్రయ్య	తాటాకుల ఇల్లు(గోడలు లేవు)	ఖాళీస్థలం	ఖాళీస్థలం	మానే సీతారామయ్య	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
59			6-76	23	మానే బుల్లెమ్మ భర్త లేట్ వెంకటయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల మేకల షెడ్
60			..	24	మానే బుజ్జి తండ్రి వెంకటయ్య	తాటాకుల ఇల్లు	కారం దారయ్య	ఖాళీస్థలం	రవ్వా దూలయ్య	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల షెడ్
61			6-78	25	కారం దారయ్య తండ్రి రామిశెట్టి	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	మానే బుజ్జి	ఖాళీస్థలం	గ్రావెల్ రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
62	76	పట్టా భూమి	6-79	26	మానే రాజయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల మేకల షెడ్
	మూడవ లిస్టు – రామవరం గ్రామం										
63	92/2	పట్టా భూమి	5-32	1	గొర్లె ముత్యయ్య తండ్రి వెంకయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	ఖాళీస్థలం	ఎలుగంటి భూషణం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల షెడ్, తాటాకుల వంటపాక
64			5-33	2	ఎలుగంటి భూషణం తండ్రి సీతారామయ్య	తాటాకుల ఇల్లు	ఎలుగంటి చంద్ర శేఖర్	ఆర్ అండ్ బి రోడ్	గొర్లె ముత్యయ్య	గొర్లె రామారావు	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంటపాక
65				3	ఎలుగంటి చంద్రశేఖర్	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ్	గొర్లె ముత్యయ్య	గొర్లె రామారావు	..
66	93/3	ప్రభుత్వ భూమి	5-34	4	గొర్లె రామారావు తండ్రి పాపయ్య	సిమెంటు రేకుల ఇల్లు	కూరా వెంకట రామయ్య	ఆర్ అండ్ బి రోడ్	ఎలుగంటి భూషణం	గ్రావెల్ రోడ్	సిమెంటు రేకుల షెడ్, సిమెంటు రేకుల బాత్‌రూమ్‌సిమెంటు రేకుల పశువుల షెడ్‌సిమెంటు రేకుల షెడ్
67			5-35	5	కూరా ముత్తమ్మ భర్త రాజు	సిమెంటు రేకుల ఇల్లు	గంట్ల రవి	ఆర్ అండ్ బి రోడ్	గ్రావెల్ రోడ్	గంట్ల బాబూ రావు	సిమెంటు రేకుల బాత్‌రూమ్ సిమెంటు రేకుల షెడ్
68			5-38	6	కూరా వెంకటరామయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	గొర్లె రామారావు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంటపాక తాటాకుల పశువుల షెడ్ తాటాకుల షెడ్
69			5-37	7	కూరా భద్రమ్మ	తాటాకుల ఇల్లు (గోడలు లేవు)	ఖాళీస్థలం	గొర్లె రామారావు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
70	92/2	పట్టా భూమి	5-62	8	బొగ్గా లక్ష్మయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	..	తాటాకుల షెడ్, సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల పశువుల షెడ్, తాటాకుల మేకల షెడ్, సిమెంటు రేకుల ఇల్లు (నిర్మాణంలో ఉన్నది)
71	93/3	ప్రభుత్వ భూమి	5-60	9	గొర్లె పెదబుజ్జి తండ్రి బజారు	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	కాలిబాట	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంటపాక, తాటాకుల షెడ్, తాటాకుల పశువుల షెడ్
72			5-61	10	కూరా అర్జునరావు	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	కాలిబాట	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల షెడ్, తాటాకుల వంటపాక
73			5-59	11	గొర్లె చినబుజ్జి తండ్రి బజారు	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల షెడ్, తాటాకుల వంటపాక తాటాకుల పశువుల షెడ్
74			5-57	12	దారా శ్రీను తండ్రి సాయిబాబు	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	..	ఖాళీస్థలం	ఖాళీస్థలం	..
75			5-56	13	గంట్ల కన్నమ్మ భర్త బాబూరావు	తాటాకుల ఇల్లు (గోడలు లేవు) సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	గంట్ల మల్లెమ్మ	దారి	దారి	తాటాకుల పశువుల షెడ్
76			5-40	14	గంట్ల మల్లమ్మ భర్త బుచ్చయ్య	తాటాకుల ఇల్లు (గోడలు లేవు)	గంట్ల కన్నమ్మ	గంట్ల బాబూరావు	గంట్ల కన్నమ్మ (బి)	గంట్ల రమణ	సిమెంటు రేకుల బాత్‌రూమ్
77			5-41	15	కలువ వెంకటరమణ తండ్రి రాజు	తాటాకుల ఇల్లు (గోడలు లేవు)	ఖాళీస్థలం	ఖాళీస్థలం	గంట్ల మల్లమ్మ	కాలిబాట	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంటపాక
78			5-39	16	గంట్ల ముత్యాలు భర్త బాబూరావు	తాటాకుల ఇల్లు	గంట్ల మల్లమ్మ	ఖాళీస్థలం	కూరా ముత్తమ్మ	కలువ వెంకట రమణ	సిమెంటు రేకుల బాత్‌రూమ్
79				17	అంగన్‌వాడి కేంద్రం, రామవరం (గొమ్ము)	..	కాలిబాట	ఆర్ అండ్ బి రోడ్	కలువ వెంకట రమణ	కాలిబాట	సిమెంటు రేకుల వంట షెడ్
80			5-42	18	గొర్లె చినబిక్షం	పెంకుటిల్లు	కూరా రాజమ్మ	ఆర్ అండ్ బి రోడ్	అంగనవాడి కేంద్రం	కూరా సునీత	ముందు వైపు సిమెంటు రేకుల షెడ్ ఐరన్ రేకుల షెడ్ సిమెంటు రేకుల వంటషెడ్ సిమెంటు రేకుల బాత్‌రూమ్ సిమెంటు రేకుల కార్ పార్కింగ్ షెడ్ సిమెంటు రేకుల ట్రాక్టర్ షెడ్‌బోర్‌వెల్
81	101/1	పట్టా భూమి	5-43	19	కూరా సునీత	సిమెంటు రేకుల ఇల్లు	సోలా నాగ భూషణం	ఆర్ అండ్ బి రోడ్	గొర్లె బిక్షం	గ్రావెల్ రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
82	101/1	పట్టా భూమి	5-44	20	సోలా నాగభూషణం తండ్రి వీరయ్య	తాటాకుల ఇల్లు (గోడలు లేవు)	గొర్లె పెదబిక్షం	కూరా సునీత	గొర్లె చినబిక్షం	గ్రావెల్ రోడ్	..
83	101/1	పట్టా భూమి	5-96	21	గొర్లె పెదబిక్షం తండ్రి పెదబొజ్జి	తాటాకుల ఇల్లు	గొర్లె రాజయ్య	సోలా నాగ భూషణం	కూరా రాజమ్మ	గ్రావెల్ రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట పాకతాటాకుల పందిరి తాటాకుల మేకల షెడ్

(మిగతా 10వ పేజీలో...)

ట్విట్టర్‌కు శ్రీరామ్ రిపేర్లు



న్యూయార్క్: దిగ్గజ సామాజిక మాధ్యమం ట్విట్టర్‌ను సంస్కరణల బాట పట్టిస్తానని ప్రతిజ్ఞ చేసిన దాని నూతన అధిపతి ఎలాన్ మస్క్ దృష్టి టెక్నాలజీ నిపుణుడు, చెన్నై వ్యక్తి శ్రీరామ్ కృష్ణన్‌పై పడింది. టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్‌గా విశేష అనుభవం ఉన్న శ్రీరామ్‌కు ట్విట్టర్‌లో కీలక మార్పులు చేర్పుల తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. చెన్నైలో జన్మించిన శ్రీరామ్ గతంలో అన్నా యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కాలేజీలో 2001–05లో ఇంజనీరింగ్(ఐటీ) పూర్తిచేశారు. మైక్రోసాఫ్ట్‌లో వృత్తిజీవితం మొదలుపెట్టిన ఈయన 2017లో కొంతకాలం ట్విట్టర్‌లో పనిచేశారు. సెర్చ్, డిస్కవరీ, హోమ్ టైమ్‌లైన్, ఆన్ బోర్డింగ్/న్యూ యూజర్ ఎక్స్‌పీరియన్స్, ఆడియన్స్ గ్రోత్ వంటి కోర్ ప్రొడక్ట్ విభాగాలకు నాయకత్వం వహించారు. రీ–డిజైన్ చేసిన ఈవెంట్ ఎక్స్‌పీరియన్స్ ఉత్పత్తులను స్వయంగా ప్రారంభించారు. స్నాప్, ఫేస్‌బుక్ వంటి సంస్థలకు మొబైల్ ప్రకటనల ఉత్పత్తుల అభివృద్ధిని పర్యవేక్షించారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలోని పెట్టుబడుల (వెంచర్ క్యాపిటల్) సంస్థ అండ్రెసెన్ హోరోవిట్జ్(ఏ16జెడ్)లో ప్రస్తుతం భాగస్వామిగా ఉన్నారు. బిట్సీ, హోప్‌ఇన్, పాలీవర్క్ సంస్థలకూ సేవలందిస్తున్నారు.

క్లుప్తంగా...

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లు... నలుగురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో మంగళవారం రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. పుల్వామా జిల్లా ఖంది పొరాలో భద్రతా బలగాలతో ఎదురుకాల్పుల్లో ముగ్గురు, అనంత్‌నాగ్ జిల్లా సీమంథన్ వద్ద ఒకరు హతమయ్యారు. పుల్వామా ఎన్‌కౌంటర్‌ను భద్రతా బలగాలు సాధించిన భారీ విజయంగా అదనపు డీజీపీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మృతుల్లో ఒకరు విదేశీ ఉగ్రవాదిగా పేర్కొన్నారు. ఘటనా స్థలి నుంచి రెండు ఏకే–47 రైఫిళ్లు, ఒక పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా, శ్రీనగర్, బుద్గాం జిల్లాల్లో గాలింపు చర్యల సందర్భంగా లష్కరే తోయిబాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు పట్టుబడ్డారు. వీరిచ్చిన సమాచారం 10 కిలోల ఐఈడీని స్వాధీనం చేసుకున్నారు.

గ్రీస్‌లో 'వలస' పడవ మునక

ఏథెన్స్: టర్కీలోని ఇజ్మీర్ నుంచి వలసదారులతో బయలుదేరిన పడవ గ్రీస్ తీరం సమీపంలో మునిగిపోయింది. ఈ ఘటనలో గల్లంతైన 59 మంది కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు గ్రీస్ తీర రక్షక దళం తెలిపింది. ఎవ్వియా, ఆండ్రోస్ ద్వీపాల మధ్యనున్న కఫిరియా జలసంధిలో ఆదివారం రాత్రి దాటాక ఘటన చోటుచేసుకుంది.

'మా వల్లే హాలోవిన్ విషాదం'

సియోల్: రాజధాని సియోల్‌లో శనివారం రాత్రి చోటుచేసుకున్న దుర్ఘటనకు తమ వైఫల్యమే కారణమని దేశ పోలీస్ చీఫ్ యూన్ హీ క్యూన్ అంగీకరించారు. 'జరగబోయే ప్రమాదం గురించి ఘటనకు ముందు అందిన అత్యవసర ఫోన్ కాల్స్‌పై మా అధికారులు సరిగా స్పందించలేదని తేలింది.' అని చెప్పారు. హాలోవిన్ ఉత్సవాల్లో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 156 మంది చనిపోగా, మరో 151 మంది గాయపడ్డారు.

మోర్బీలో ప్రధాని పర్యటన

బాధిత కుటుంబాలకు పరామర్శ

మోర్బీ(గుజరాత్)/న్యూఢిల్లీ: నిర్లక్ష్యపు నిర్వహణ, కిక్కిరిసిన జనంతో బరువెక్కువై కుప్పకూలిన గుజరాత్‌లోని మోర్బీ తీగల వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ఏరియల్ సర్వే అనంతరం అక్కడే ఉండి గాలింపు చర్యలను పర్యవేక్షించారు. తర్వాత ప్రభుత్వాసుపత్రిలో బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలను ఓదార్చారు. గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ఈ మృతుల సంఖ్య సోమవారం 135కు పెరిగింది.

రాత్రికి రాత్రి ఆస్పత్రి వార్డు సిద్ధం

మోదీ ఆస్పత్రికి రానుండటంతో అధికారులు అత్యుత్సాహం చూపారు. మిగతా ఆస్పత్రి అంతా అధ్వానంగా ఉండగా ఆయన సందర్శించే వార్డు రూపురేఖల్ని మాత్రం రాత్రికి రాత్రి మార్చేశారు. ఈ ఫోటోలను కాంగ్రెస్ ట్వీట్ చేసింది. మోదీ ఫోటో షూట్ కోసం ఆస్పత్రిని తీర్చిదిద్దారంటూ ఎద్దేవాచేసింది.

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మోదీ



14న సుప్రీంలో న్యాయ విచారణ

మోర్బీ ఘటనపై న్యాయ విచారణకు జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఈ నెల 14న సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. మరోవైపు ఈ ఘోరానికి భారీ అవినీతే కారణమని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపించారు. గుజరాత్ సీఎం రాజీనామా చేసి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.



కొనసాగుతున్న గాలింపు చర్యలు

మాన్‌గఢ్ ధామ్.. మరో జలియన్ వాలాబాగ్

చరిత్రలో గుర్తింపుకు నోచని రక్తచరిత్ర



మాన్‌గఢ్ ధామ్ ప్రాంతం

ఆదివాసీల ప్రాబల్యమున్న మాన్‌గఢ్ ప్రాంతమది. బ్రిటిష్ పాలనలో రక్తమోడింది. జలియన్ వాలాబాగ్ ఘటనకి ఆరేళ్ల ముందు ఇక్కడ తెల్లదొరలు మారణహోమం సాగించి అక్షరాలా 1500 మంది ఆదివాసీల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారు. ఈ దారుణానికి చరిత్రలో అంతగా గుర్తింపు లభించలేదు. ఈ ప్రాంతం రాజస్తాన్‌లోని బన్స్వారా జిల్లాలో గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉంది. సంఘ సంస్కర్త గోవింద్ గురు 1913లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆదివాసీలను ఉత్తేజపరిచారు. ఈ ప్రాంతంలో నివసించే గిరిజనుల్ని భిల్ అని పిలుస్తారు. వీరు విలువిద్యలో ఆరితేరినవారు. బానిసత్వ వ్యవస్థ, పన్నుల భారాన్ని నిరసిస్తూ గోవింద్ గురు ఇచ్చిన పిలుపుతో గిరిజనులు ఉద్యమించారు. 1913 నవంబర్ 17న బ్రిటిష్ సైనికుల విచక్షణారహిత కాల్పుల్లో 1500 మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు.

ఒక్క దెబ్బకు మూడు రాష్ట్రాలు

మాన్‌గఢ్ ధామ్‌ను నేషనల్ మాన్యుమెంట్‌గా ప్రకటించడం వెనుక ఆదివాసీల ఓట్లను ఆకర్షించే రాజకీయం దాగుంది. గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో గిరిజనులు మాన్‌గఢ్ ప్రాంతాన్ని అత్యంత పవిత్రమైన స్థలంగా భావిస్తారు. ఇక్కడ రాజకీయ లబ్ధికి బీజేపీ, కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయి. డిసెంబర్లో గుజరాత్, వచ్చే ఏడాది మధ్యప్రదేశ్, రాజస్తాన్ అసెంబ్లీలకు ఎన్నికలున్న నేపథ్యంలో రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ఇప్పటికే ఈ ప్రాంతాన్ని జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించాలంటూ ప్రధానికి రెండు లేఖలు రాశారు. ఆదివాసీల సంక్షేమం కోసం పని చేసే భారతీయ ట్రైబల్ పార్టీ (బీటీపీ) నాలుగు రాష్ట్రాల్లోని 39 జిల్లాల్లో భిల్ ఆదివాసీల ప్రాంతాలతో ప్రత్యేక భిల్ ప్రదేశ్ ఏర్పాటు చేయాలని గళమెత్తుతోంది. గుజరాత్‌లో 16, రాజస్తాన్‌లో 10, మధ్యప్రదేశ్‌లో ఏడు, మహారాష్ట్రలో ఆరు జిల్లాలను కలిపి భిల్ ప్రదేశ్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది. రాజస్తాన్ జనాభాలో గిరిజనులు 13.48%, గుజరాత్‌లో 14.8%, మధ్యప్రదేశ్‌లో 21.1%, మహారాష్ట్రలో 9.35% ఉన్నారు. రాజస్తాన్‌లో 25 అసెంబ్లీ నియోజకవర్గాల్లో భిల్ ఆదివాసీలు అధికంగా ఉన్నారు. ప్రస్తుతం వాటిలో కాంగ్రెస్ 13, బీజేపీ 8, బీటీపీ, స్వతంత్రులు చెరొక స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో కూడా 27 సీట్లలో 13 బీటీపీ నెగ్గింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇక జాతీయ స్మారక చిహ్నం

మాన్‌గఢ్ (రాజస్తాన్): మాన్‌గఢ్ ధామ్‌ను జాతీయ స్మారక చిహ్నంగా కేంద్రం ప్రకటించింది. మాన్‌గఢ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాజస్తాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ ముఖ్యమంత్రుల సమక్షంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ ప్రాంత అభివృద్ధికి రాజస్తాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర సీఎంలు రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. "మాన్‌గఢ్ ధామ్‌ను మరింతగా విస్తరించడానికి అభివృద్ధి చేయాలని మనందరికీ బలమైన కోరిక ఉంది. నాలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్చించుకొని ఒక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయండి" అని ప్రధాని అన్నారు. ఈ ధామ్‌ని అభివృద్ధి చేస్తే కొత్త తరంలో స్ఫూర్తిని నింపిన వాళ్లమవుతామని ప్రధాని వ్యాఖ్యానించారు.



గోవింద్ గురుకు మోదీ నివాళులు

ఆఫ్రికాకు ఆశాకిరణం భారత్

ఆ దేశాల రక్షణ అవసరాలు తీర్చే సత్తా భారత్‌కు ఉంది: ఎగ్జిమ్ బ్యాంక్ నివేదిక

జోహన్నస్‌బర్గ్: ఆఫ్రికా దేశాలు తమ నౌకా, వైమానిక, రక్షణ ఉపకరణాలు సమకూర్చుకునేందుకు భారత్‌పైనే ఆధారపడ్డాయని ఇండియా ఎగ్జిమ్ బ్యాంక్ 'రీఇన్విగోరేటింగ్ ఇండియాస్ ఎకనమిక్ ఎంగేజ్‌మెంట్స్ విత్ సదరన్ ఆఫ్రికా' నివేదికలో స్పష్టంచేసింది. '2017–2021 కాలంలో మారిషస్, మొజాంబిక్, సీషెల్స్ వంటి ఆఫ్రికా దేశాల కీలక రక్షణ అవసరాలు తీర్చడంలో భారత్ పెద్దదిక్కుగా మారింది. భారత ఆయుధాలను ఈ దేశాలు భారీమొత్తంలో కొన్నాయి. ఉత్పత్తి సామర్థ్యం పెంపు, మానవతా సాయం, వేరే దేశ సైన్యానికి శిక్షణ అంశాలపైనా భారత్ దృష్టిసారించాలి. అప్పుడే 2025 కల్లా 5 బిలియన్ డాలర్ల రక్షణ ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్య లక్ష్యాన్ని భారత్ సాకారం చేసుకోగలదు. ఇందులో రక్షణ ఉత్పత్తుల తయారీసంస్థలైన టాటా మోటార్స్, అశోక్ లేలాండ్ తమ వంతు భాగస్వామ్య పాత్ర పోషిస్తున్నాయి. ఇక, కొత్త తరం స్వదేశీ సాంకేతికతల సాయంతో నావికారంగంలో మానవరహిత జలాంతర్గత వ్యవస్థలు, డ్రోన్లను అభివృద్ధిచేయాలి' అని నివేదిక పేర్కొంది. జోహన్నస్‌బర్గ్‌లో భారత్–దక్షిణాఫ్రికా దేశాల అభివృద్ధి భాగస్వామ్యం కోసం సీఐఐ–ఎగ్జిమ్ బ్యాంక్ ప్రాంతీయ సదస్సును నిర్వహించాయి. సదస్సులో ఈ నివేదికను ఆవిష్కరించారు. హిందూ సముద్ర ప్రాంత భద్రత, రక్షణలో భారత్, ఆఫ్రికా దేశాల పాత్ర కీలకమైనదని నివేదిక శ్లాఘించింది. సైబర్ సెక్యూరిటీలోనూ దేశాల పరస్పర సహకారం ప్రధానమని సూచించింది. ఈ సదస్సులో పలు ప్రభుత్వాల ఉన్నతాధికారులు, పరిశ్రమల, వ్యాపార సంస్థల అధినేతలు పాల్గొని ఏఏ అంశాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పటిష్టం చేసుకోవాలో చర్చించారు.

జల సంరక్షణ సాంకేతికతలను అభివృద్ధి చేయండి

శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు రాష్ట్రపతి పిలుపు

గ్రేటర్ నోయిడా: దేశంలోని నీటి వనరుల పరిరక్షణకు అవసరమైన సాంకేతికతలను అభివృద్ధి చేయాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. దేశ జల భద్రతలో సాంకేతికత కీలక పాత్ర పోషించనుందని ఆమె అన్నారు. ఏడో విడత 'ఇండియా వాటర్ వీక్'ను పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, పట్టణ ప్రణాళిక అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగించారు. 'దేశ జనాభా పెరుగుతోంది. జలాశయాలు, నదుల్లో నీటి లభ్యత తగ్గుతోంది. గ్రామాల్లో చెరువులు ఎండిపోతున్నాయి. స్థానిక నదులు కనుమరుగవుతున్నాయి. జల భద్రత ఆందోళనకరంగా మారింది' అన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సమాజంలోని అన్ని వర్గాల సహకారంతో శుద్ధమైన నీటిని ప్రజలకు అందించడం సవాలుగా మారిందని ముర్ము చెప్పారు. 'దేశంలోని జలవనరుల్లో 80% వరకు వ్యవసాయ అవసరాలకే వాడుకుంటున్నాం. ఈ పరిస్థితుల్లో నీటి సద్వినియోగం, సాగు నీటి నిర్వహణ చాలా కీలకం' అని రాష్ట్రపతి చెప్పారు. ముఖ్యంగా చిన్నారులు నీటిని పొదుపుగా వాడుకోవడం నిత్య జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని కోరారు.



దురాక్రమణ దుస్సాహసం చేయొద్దు

సియోల్: అమెరికాతో కలిసి దక్షిణకొరియా చేస్తున్న సంయుక్త వైమానిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కొరియా ద్వీపకల్పంలో శాంతిభద్రతలను అమెరికా నాశనం చేస్తోందని దుయ్యబట్టింది. దురాక్రమణకు సాహసిస్తే దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించింది. ఉత్తర కొరియా తరచూ క్షిపణి పరీక్షలు చేస్తుండటంతో అమెరికా, దక్షిణ కొరియా 200 యుద్ధవిమానాలతో విన్యాసాలు చేస్తున్నాయి.

ఈవీఎంలో పార్టీ గుర్తుల తొలగింపునకు సుప్రీం నో

సాక్షి, న్యూఢిల్లీ: ఈవీఎం, బ్యాలెట్లపై పార్టీ గుర్తులు నిలిపివేయాలంటూ ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈవీఎంలో అభ్యర్థి పేరు, వయసు, విద్యార్హత, ఫొటోలు ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)ను ఆదేశించాలంటూ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ బేలా ఎం. త్రివేదిల ధర్మాసనం విచారించింది. ఈవీఎంలో పార్టీ గుర్తులుండడంపై అభ్యంతరం ఎందుకని ప్రశ్నించింది. ఎన్నికలు పార్టీలతో ముడిపడి ఉంటాయని, పిటిషన్‌ను అంగీకరిస్తే అభ్యర్థి గెలిచాక పార్టీలు మారే ప్రమాదముందని పేర్కొంది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ.. పార్టీల నీడలో అభ్యర్థులు ఉండడం వల్లే చట్టసభల సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. నేర చరిత్ర లేని వారికి పార్టీలు ఎందుకు టికెట్ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పిటిషనర్ వాదనపై అటార్నీ జనరల్ వెంకట రమణి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈవీఎంలో ఓటు వేయడానికి ముందుగానే ఓటర్లు తమ అభ్యర్థిని ఎంపిక చేసుకుంటారని ఏజీ పేర్కొన్నారు. పిటిషన్ ఉపసంహరించుకోవాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచన చేసింది. కోర్టు విచారణకు అంగీకరించని నేపథ్యంలో తాను ఈసీని ఆశ్రయిస్తాయని వికాస్ సింగ్ పేర్కొన్నారు. తమకు ఫిర్యాదు వస్తే తప్పకుండా పరిశీలిస్తామని ఈసీ తరఫు న్యాయవాది కోర్టులో చెప్పారు.



'పుల్వామా' సంబరాలు చేసుకున్నందుకు ఐదేళ్ల జైలు

బెంగళూరు: సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై జైషే మొహమ్మద్ ఆత్మాహుతి బాంబర్ దాడికి తెగబడి 40 మంది జవాన్ల మరణానికి కారణమైన పుల్వామా ఉగ్రదాడి ఘటనను కీర్తిస్తూ సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన 22 ఏళ్ల యువకునిబెంగళూరు కోర్టు ఐదేళ్ల కారాగార శిక్ష విధించింది. 2019 ఫిబ్రవరి 14న ఈ దారుణం జరిగింది. విషయం తెలిగానే బెంగళూరులోని కచరక్నాహళ్లికి చెందిన 19 ఏళ్ల ఫయాజ్ రషీద్ దాడిని 'వేడుక' చేసుకుంటూ వేర్వేరు సోషల్ అకౌంట్లలో 24కు పైగా అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేశాడు. సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అతన్ని అదే రోజు అరెస్ట్ చేశారు. మూడున్నరేళ్లుగా కస్టడీలోనే ఉన్నాడు. తాజాగా అతనికి శిక్ష ఖరారు చేస్తూ అదనపు సిటీ సివిల్, సెషన్స్ జడ్జి(ఎన్‌ఐఏ ట్రయల్ కేసుల స్పెషల్ జడ్జి) గంగాధర తీర్పు వెలువరించారు.

జేడీఎస్ 'పంచరత్న రథ యాత్రే'

కోలార్ (కర్ణాటక): వచ్చే ఏడాది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జేడీఎస్ మంగళవారం 'పంచరత్న రథ యాత్రే'కు శ్రీకారం చుట్టింది. కోలార్ జిల్లా కురుదుమలేలో ప్రఖ్యాత గణేశాలయంలో జేడీఎస్ వ్యవస్థాపకుడు, మాజీ ప్రధాని దేవేగౌడ ప్రత్యేక పూజలు చేసి, యాత్రను ప్రారంభించారు. మూడు దశల్లో జరిగే రథ యాత్రలో అన్ని నియోజక వర్గాల్లో సభలుంటాయి.

గిరిజన ప్రాంతాల వెనకబాటుకు గత ప్రభుత్వాలే కారణం: మోదీ

జంబూఘోడ(గుజరాత్): గత ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని ప్రధాని మోదీ విమర్శించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలున్న గుజరాత్‌లో మూడ్రోజులుగా పర్యటిస్తున్న మోదీ చివరిరోజైన మంగళవారం పలు ప్రాజెక్టులను ప్రారంభించి పంచమహల్ జిల్లాలోని జంబూఘోడలో ప్రసంగించారు. 'గుజరాత్ నేను సీఎంగా కాకముందు వరకు గత ప్రభుత్వాల హయాంలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధే లేదు. కేంద్రంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ కాలంలోనే తొలిసారిగా గిరిజన మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేసి గిరిపుత్రుల పురోభివృద్ధికి బాటలుపరిచాం. గిరిజన విద్యార్థుల కోసం 10,000 స్కూళ్లు నిర్మించాం. గిరిజన సోదరీమణుల సాధికారత కోసం సఖి మండళ్లను ఏర్పాటుచేశాం. ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు, నిరంతర విద్యుత్ సదుపాయం కల్పించాం. గత ప్రభుత్వాలు చేసింది శూన్యం' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాలను మోదీ విమర్శించారు. గిరిజన యోధుడు బిర్సా ముండాను స్మరిస్తూ బీజేపీ సర్కార్ నవంబర్ 15ను జనజాతీయ గౌరవ దివస్‌గా జరుపుతోంది' అని అన్నారు. మరోవైపు, గుజరాత్‌లో రూ.860 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఆప్‌కు రూ.50 కోట్లిచ్చా

ఆప్ మాజీ మంత్రి జైన్ 10 కోట్లు గుంజాడు • ఆర్థిక నేరగాడు సుఖేశ్

- పార్టీ పదవి, రాజ్యసభ ఆశ చూపారు
- జైళ్ల డీజీ 12.5 కోట్లు తీసుకున్నాడు
- ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు సుఖేశ్ లేఖ
- లోతైన దర్యాప్తుకు విజ్ఞప్తి
- ఆరోపణలపై బీజేపీ, ఆప్ వాగ్యుద్ధం



సత్యేంద్ర జైన్



సుఖేశ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ: పలువురు ప్రముఖుల దగ్గర భారీగా డబ్బులు గుంజిన ఆరోపణలపై జైల్లో ఉన్న ఆర్థిక నేరగాడు సుఖేశ్ చంద్రశేఖర్ ఆమ్ ఆద్మీ పార్టీపై బాంబు పేల్చాడు. పార్టీలో ప్రాధాన్యమున్న పదవి ఇస్తామని, రాజ్యసభకు కూడా నామినేట్ చేస్తామని వాగ్దానం చేసినందుకు ఆప్‌కు రూ.50 కోట్లకు పైగా 'విరాళం'గా ఇచ్చానని సంచలన ఆరోపణలు చేశాడు. అంతేగాక తిహార్ జైల్లో ప్రాణాలకు భద్రత కోసం 2019లో నాటి ఢిల్లీ జైళ్ల మంత్రి, ఆప్ నేత సత్యేంద్ర జైన్ రూ.10 కోట్లు వసూలు చేశారంటూ మరో బాంబు పేల్చాడు. ఈ మేరకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు సుఖేశ్ లేఖ రాశాడు. దీనిపై విచారణకు హైకోర్టులో వేసిన పిటిషన్ వెనక్కు తీసుకోవాలంటూ ఆప్ తనను తీవ్రంగా వేధిస్తోందని ఆరోపించాడు. "ఈ మొత్తం ఉదంతంపై లోతైన విచారణకు దర్యాప్తు సంస్థలను ఆదేశించండి. వాస్తవాలన్నీ వెలుగులోకి రావాలి. వాటిని ఇంకెంతమాత్రమూ నాలో దాచుకోలేను. నిజాయతీ మారుపేరని చెప్పుకునే ఆప్ అసలు రంగేమిటో, జైళ్లను కూడా వదలకుండా అది ఎంత భారీగా అవినీతికి, వసూళ్లకు పాల్పడుతోందో అందరికీ తెలియాలి" అని కోరాడు. తన దగ్గర అన్ని సాక్ష్యాలూ ఉన్నాయని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెప్పాడు. లేఖను అక్టోబర్ 8న తన లాయర్ ద్వారా ఎల్జీ కార్యాలయానికి పంపాడు. తదుపరి చర్యల నిమిత్తం దాన్ని అక్టోబర్ 18న ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపినట్టు ఎల్జీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ అంశం బీజేపీ, ఆప్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలకు, తీవ్రస్థాయి వాగ్యుద్ధానికి దారి తీసింది. ఆప్‌ను మహా దోపిడీదారుల పార్టీగా బీజేపీ అభివర్ణించింది. మోర్బీ వంతెన విషాదం నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీ డ్రామాలాడుతోందని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఎదురుదాడికి దిగారు.

జైలుకొచ్చి మరీ...

రూ.200 కోట్ల మనీ లాండరింగ్ కేసులో సుఖేశ్ ఢిల్లీలోని మాండోలీ జైల్లో ఉన్నాడు. జైన్ 2017లో జైళ్ల మంత్రి హోదాలో తిహార్ జైల్లో తనను కలిశారని లేఖలో అతను చెప్పుకొచ్చాడు. "ఆప్‌కు నేనిచ్చిన 'విరాళం' గురించి విచారణ సంస్థలకు ఏమైనా చెప్పానా అంటూ జైన్ ఆరా తీశారు. మళ్లీ 2019లోనూ జైన్ తన కార్యదర్శి, సన్నిహిత మిత్రుడు సుశీల్‌తో కలిసి మరోసారి నన్ను జైల్లో కలిశాడు. జైల్లో నా ప్రాణాలకు ప్రమాదం లేకుండా చూసేందుకు నెలకు రూ.2 కోట్ల చొప్పున చెల్లించాలన్నాడు. లేదంటే కనీస సౌకర్యాలు కూడా దక్కవన్నాడు. తన నమ్మకస్తుడైన జైళ్ల శాఖ డీజీ సందీప్ గోయల్‌కు రూ.1.5 కోట్లు చెల్లించేలా నాపై ఒత్తిడి తెచ్చాడు. అలా రెండు మూడు నెలల్లో నా నుంచి బలవంతంగా రూ.10 కోట్ల దాకా జైన్ గుంజాడు. కోల్‌కతాలోని జైన్ సన్నిహితులు ఈ మొత్తాలను ఎప్పటికప్పుడు వసూలు చేసుకుంటూ వచ్చారు. డీజీ గోయల్‌కు మొత్తమ్మీద రూ.12.5 కోట్లు సమర్పించుకున్నాను" అని ఆరోపించాడు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణలో ఈ విషయమంతా వెల్లడించానని చెప్పాడు. ఈ ఉదంతంపై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసినట్టు సుఖేశ్ వెల్లడించాడు. వచ్చే నెలలో విచారణకు కోర్టు అంగీకరించిందని చెప్పాడు. తిహార్ జైలు ఢిల్లీ ప్రభుత్వ జైళ్ల శాఖ ఆధ్వర్యంలోనే నడుస్తుంది. అవినీతి ఆరోపణలపై ప్రస్తుతం జైన్ కూడా తిహార్ జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే. కేసు వెనక్కు తీసుకోవాలంటూ జైళ్ల డీజీ, జైలు యంత్రాంగం ద్వారా ఆయన తనను తీవ్రంగా బెదిరిస్తున్నాడని సుఖేశ్ ఆరోపించాడు.

ఎవరీ సుఖేశ్?

సుఖేశ్ ఓ ఆర్థిక నేరగాడు. రాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్లు మల్వీందర్‌సింగ్, శివిందర్ సింగ్‌లకు బెయిలిప్పిస్తానంటూ వారి భార్యల నుంచి ఏకంగా రూ.200 కోట్లు వసూలు చేసిన కేసులో అరెస్టయ్యాడు. బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు అతడు పలు ఖరీదైన బహుమతులిచ్చినట్టు ఆరోపణలున్నాయి.

దొంగనే దోచుకున్న ఆప్: బీజేపీ

ఓ పెద్ద దోపిడీదారునే దోచుకున్న మహా దొంగల పార్టీ ఆప్ అంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ఎద్దేవా చేశారు. ఆప్ ఎంతటి కరడుగట్టిన అవినీతి పార్టీయో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చన్నారు.

చౌకబారు ఎత్తుగడ: ఆప్



సుఖేశ్ ఆరోపణలను బీజేపీ చౌకబారు ఎత్తుగడగా కేజ్రీవాల్ అభివర్ణించారు. "పంజాబ్ ఎన్నికలకు ముందు కుమార్ విశ్వాస్‌ను ఇలాగే మా పార్టీపైకి ఉసిగొల్పారు. గుజరాత్‌లో బీజేపీ పరిస్థితి దయనీయంగా ఉండటంతో సుఖేశ్‌ను తెరపైకి తెచ్చారు" అని ఆరోపించారు.

సాక్షి శ్రీకాకుళం

బుధవారం ‌। 2 ‌। నవంబర్ ‌। 2022



ఉత్తమ సేవలకు గుర్తింపు

ఉత్తమ పోలీసు అధికారులకు సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. ఐదుగురికి ఈ పతకాలు వరించాయి. - 8లో



సీతారామాలయంలో చోరీ

పాత టెక్కలి సీతారామాలయంలో చోరీ జరిగింది. అమ్మవారి పుస్తెల తాడును దొంగిలించారు. - 8లో

దివ్యాంగులకు జాతీయ ఉపకారవేతనాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ విద్యా సంవత్సరానికి ప్రీ మెట్రిక్ నేషనల్ స్కాలర్‌షిప్‌నకు దివ్యాంగ విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఎం.కిరణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.స్కాలర్‌షిప్.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 15 వరకు గడువు ఉందని, వివరాలకు 08942-240519ను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

వికేంద్రీకరణకు మద్దతుగా రౌండ్‌టేబుల్ సమావేశం నేడు

ఆమదాలవలస: రాష్ట్రంలో మూడు రాజధానులు, విశాఖపట్నంలో పరిపాలనా రాజధాని ఏర్పాటుకు సంబంధించి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై వివిధ వర్గాలు, పలు సంఘ నాయకులు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శారద కల్యాణమండపంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్న ఈ సమావేశంలో కార్మిక, విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ, న్యాయవాదుల సంఘాలు ప్రతినిధులు, మేధావి వర్గం, వివిధ సంస్థల సభ్యులు హాజరు కానున్నారు.

నరసన్నపేటలో ఉత్తరాంధ్ర గర్జన ర్యాలీ నేడు



వివిధ సంఘాల ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మూడు రాజధానులు, విశాఖలో రాజధాని ఏర్పాటుకు సిక్కోలులో మద్దతు పెరుగుతోంది. ఇప్పటికే నరసన్నపేటలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో ఐదు రోజులు రిలే దీక్షలు నిర్వహించారు. తాజాగా జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఉత్తరాంధ్ర గర్జన ర్యాలీ నిర్వహించనున్నారు. దీనికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ స్వయంగా మంగళవారం ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం స్థానిక వర్తకులు, వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. విశాఖను ఎలాగైనా పరిపాలన రాజధానిగా చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం నాటి ర్యాలీలో అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ర్యాలీ సందర్భంగా పైడితల్లి కూడలి వద్ద సభను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఉత్తరాంధ్ర జేఏసీ కన్వీనర్ లజపతిరాయ్, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం జేఏసీ కన్వీనర్ డాక్టర్ దానేటి శ్రీధర్‌లు ప్రసంగిస్తారు.

శిక్షణ, ఉపాధికి ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంజినీరింగ్ చదివిన ఉద్యోగార్థులకు వివిధ ట్రేడ్‌లలో ఆరునెలల పాటు శిక్షణ, అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ విద్యా సాగర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీ టెక్‌లో ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆరు నెలలు శిక్షణ, అనంతరం ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఉచిత శిక్షణ, మెటీరియల్‌తోపాటు వసతి సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 3వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎచ్చెర్లలోని టీటీడీసీలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా శరత్



శరత్‌బాబు

కవిటి: కవిటికి చెందిన తుంగాన శరత్ బాబు విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అఖిల భారత స్థాయి సీనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ సంఘం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆయన విలేకరులకు తెలిపారు. శ్రీకాకుళం విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ సహాయకునిగా పనిచేస్తున్న శరత్‌బాబు జాతీయ స్థాయి అంపైర్‌గా ఎంపిక కావడంపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయి రాజ్, ఏపీ గ్రీనింగ్‌అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, కడియాల ప్రకాష్, పూడి నేతాజీ, పూడి లక్ష్మణరావు, తమరాల జయరాం, బెందాళం రమేష్ తదితరులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

బిగిసిన పిడికిలి



విశాఖే మా రాజధాని: వికేంద్రీకరణకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీకి అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు, ప్రజలు

- పొందూరులో విద్యార్థుల సింహ గర్జన
- మూడు రాజధానులకు మద్దతుగా భారీ ర్యాలీ
- విశాఖ రాజధాని ఆవశ్యకత వివరించిన స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు:

పొందూరులో విద్యార్థి లోకం గర్జించింది. వైజాగ్‌లో రాజధాని ఏర్పాటు చేయాల్సిందేనని నినదించింది. రాజధాని సాధన తమ హక్కు అని చాటి చెప్పింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అధ్యక్షతన పొందూరులో మంగళవారం మూడు రాజధానులకు మద్దతుగా విద్యార్థులు చేపట్టిన భారీ ర్యాలీ విజయవంతమైంది. కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొని స్ఫూర్తిదాయకంగా ప్రసంగించారు. నేటి విద్యార్థుల గర్జన సిక్కోలు సింహ గర్జనలా మారబోతోందని అన్నారు. ముందుగా మార్కెట్ యార్డ్ బయట ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం విద్యార్థులు భారీ ర్యాలీ చేశారు. విశాఖ రాజధాని కావాలని నినాదాలు చేశారు. మార్కెట్ యార్డ్ నుంచి పాత బస్టాండ్, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మహారాజా మార్కెట్ మీదుగా బస్టాండ్‌కు ర్యాలీ చేరుకుంది. ఈ ర్యాలీలో సుమారు 2 వేల మంది విద్యార్థులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ఆ కమిటీల నివేదికలు చూడాలి..



రాష్ట్రాల విభజన అంశాలపై శివరామకృష్ణన్ కమిటీ నివేదించిన ప్రకారం అభివృద్ధి ఒకే చోట కాకుండా వికేంద్రీకరించాలి. రాజధాని పేరున ఒకే చోట కోట్లాది రూపాయలు వెచ్చించడం సరికాదు. అన్ని రాజకీయ పార్టీలు వికేంద్రీకరణకు మద్దతునివ్వాలి.

– పప్పల రమేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, పొందూరు

సామాన్యుల ఆశలు నెరవేరుతాయి..



విశాఖ పరిపాలన రాజధాని అయితే అత్యంత వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రజల ఆశలు నెరవేరుతాయి. హైదరాబాద్‌లో రాజధాని ఉండటం, విడిపోవడంతో మనం చాలా నష్టపోయాం. ఇప్పుడైనా సీఎం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందాం.

– లోలుగు కాంతారావు, జెడ్పీటీసీ, పొందూరు

ఉపాధి పెరుగుతుంది..



విశాఖలో రాజధాని ఏర్పాటు జరిగితే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో విద్య, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ముఖ్యంగా విద్యార్థులు చదువు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగ అవకాశం లభిస్తుంది.

– పి.కల్పన, డిగ్రీ విద్యార్థిని, సిస్టం డిగ్రీ కళాశాల, పొందూరు

విశాఖ రాజధాని ఉత్తరాంధ్రుల హక్కు



పొందూరు : ర్యాలీలో విద్యార్థులతో కలిసి నడుస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, చిరంజీవి నాగ్ తదితరులు

పొందూరు: విశాఖలో పాలనా రాజధాని ఉత్తరాంధ్రుల హక్కని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చాక మనకు మద్రాసు రాజధానిగా ఉండేదన్నారు. అక్కడ అభివృద్ధి జరిగింది తప్ప తెలుగు వారికి ఒరిగిందేమీ లేదని గుర్తు చేశారు. తర్వాత కర్నూలు, ఆ తర్వాత హైదరాబాద్ రాజధానులుగా ఏర్పడ్డాయని.. మన ప్రాంతం మాత్రం అభివృద్ధి చెందకుండా మిగిలిపోయిందన్నారు. హైదరాబాద్‌లో చాలా అభివృద్ధి జరిగింది కాబట్టే కేసీఆర్ తెలంగాణ ఉద్యమం చేపట్టి హైదరాబాద్‌ను సాధించుకున్నారని చెప్పారు. మళ్లీ గతంలో మాదిరిగా అభివృద్ధి అంతా ఒకేచోట కేంద్రీకృతమైతే ఉత్తరాంధ్రకు ఎప్పటిలానే అన్యాయం జరుగుతుందన్నారు. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకే సీఎం వైఎస్ జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారని వివరించారు. అమరావతి నుంచి రైతులమంటూ ర్యాలీ చేస్తున్నవారంతా ఉత్తరాంధ్రకు రాజధాని వద్దు అని అడిగేందుకే అరసవల్లి వస్తున్నారని మండిపడ్డారు. విదేశీ వస్త్ర బహిష్కరణ సమయంలో పొందూరులో ఖాదీ ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు విశాఖ రాజధాని మన హక్కు అనే నినాదం సిక్కోలు గర్జన కావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు విశాఖకు రావాలని.. ఆయన సీఎంగా ఉన్నప్పుడు ఉత్తరాంధ్ర అభివృద్ధి జరిగిందో లేక వైఎస్ జగన్ సీఎంగా ఉన్న ఈ మూడున్నరేళ్లలో జరిగిందో చర్చిద్దామని సవాల్ విసిరారు. టీడీపీ ఖర్మ కాకపోతే అచ్చెన్నాయుడిని అధ్యక్షుడిని చేయడం ఏమిటన్నారు. జూపార్క్ నుంచి రుషికొండ వరకు కారుచవకగా టీడీపీ ఎందుకు భూములు కట్టబెట్టిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానులను ప్రతిపాదించారని చెప్పారు. విశాఖలో పరిపాలన రాజధాని వస్తే ఉద్యోగ కల్పనతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విశాఖ నుంచి ఇచ్ఛాపురం వరకు కోస్టల్ కారిడార్ వస్తుందని, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. భావనపాడు పోర్టు, మంచినీళ్లపేట హార్బర్, బుడగట్లపాలెం హార్బర్, అణువిద్యుత్ కేంద్రం వంటివి వస్తున్నాయని, మన జిల్లా వైజాగ్‌కు దగ్గర కాబట్టే ఇన్ని ప్రాజెక్టులు వచ్చాయని వివరించారు. విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తే చంద్రబాబుకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. అమరావతిలో శాసన రాజధాని, కర్నూలులో న్యాయరాజధానిగా, విశాఖలో పాలనా రాజధాని ఏర్పాటు చేస్తామన్నారు.

అప్పు తీర్చలేదని హత్య



- వీడిన దేవరాపల్లి హత్య కేసు మిస్టరీ
- రూ.45 వేలు అప్పు తీసుకుని తీర్చకపోవడంతో దుశ్చర్య
- నిందితుడు గణేష్‌ది విజయనగరం జిల్లా

హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మహేంద్ర మత్తే

శ్రీకాకుళం క్రైమ్: అతనికి 19 ఏళ్లు. పదో తరగతి కూడా పాసవ్వలేదు. తల్లిదండ్రులు దినసరి కూలీలు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ రోజుకు రూ.200 తెచ్చుకుని భద్రంగా దాచుకునేవాడు. ఇది తెలిసిన సన్నిహితుడు అప్పు అడగడంతో వడ్డీ వస్తుందనే ఆశతో ఇచ్చాడు. కానీ ఆ సన్నిహితుడు వడ్డీ ఇవ్వకపోగా.. అసలు కూడా ఇవ్వనని తెగేసి చెప్పాడు. ఈ వివాదం ముదిరి ఆ యువకుడు ఏకంగా హత్య చేసేంతవరకు వెళ్లింది. రణస్థలం మండలం దేవరాపల్లిలో గత నెల 28న లభ్యమైన మృతదేహం వెనుక దాగిన కథ ఇది. ఇచ్చిన అప్పు తీర్చడం లేదనే కోపంతో విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలానికి చెందిన యండవ గణేష్, రణస్థలం మండలం దేవరాపల్లికి చెందిన బూర్లె నాగరాజు (35)ను హత్య చేశాడు. హత్య జరిగిన నాలుగు రోజుల్లోనే పోలీసులు కేసును ఛేదించారు. ఆ వివరాలను శ్రీకాకుళం డీఎస్పీ మహేంద్ర మత్తే మంగళవారం తెలిపారు. ఆ వివరాల మేరకు..

నిందితుడు గణేష్‌ది విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కలిశెట్టిబడి గ్రామం. నాగరాజు అత్తవారి ఊరు కూడా ఇదే కావడంతో ఇద్దరికీ పరిచయం ఏర్పడింది. గణేష్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ బతికేవాడు. ఇతని వద్ద నాగరాజు అప్పుడప్పుడూ డబ్బులు అప్పుగా తీసుకునేవాడు. ఇలా విడతల వారీగా రూ.45 వేలు వరకు తీసుకున్నా డు. వడ్డీ ఇస్తానని చెప్పి డబ్బు తీసుకున్న నాగరాజు నెలన్నర నుంచి వడ్డీ ఇవ్వ లేదు. అసలు కూడా ఇవ్వను పొమ్మంటూ తెగేసిచెప్పాడు. దీంతో గణేష్ కు ఈ మాటలు ఆగ్రహం తెప్పించాయి. ఆ కోపంతోనే నాగరాజును చంపేయాలని పథకం వేశాడు.

మద్యం సేవిద్దామని పిలిచి..

నాగరాజుకు తాగుడు అలవాటు ఉండడంతో గత నెల 27న గణేష్ నాగరాజుకు ఫోన్ చేసి పార్టీ చేసుకుందాం.. దేవరాపల్లి ఆంజనేయ స్వామి బొమ్మ వద్దకు రావాలని చెప్పాడు. అంతకంటే ముందుగానే గణేష్ కమ్మసిగడాం సెంటర్‌కు బైక్‌పై వెళ్లి మరొకరి చేత వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేయించాడు. ఆ తర్వాత దేవరాపల్లి ఆంజనేయ బొమ్మ వద్ద నాగరాజును కలిశాడు. అక్కడ నుంచి కొండవైపు ఉన్న కచ్చారోడ్డుకు తీసుకెళ్లి తాగడం ప్రారంభించారు. ఈ లోపు గణేష్ మూత్రానికి పోయి వస్తానని పక్కకు వెళ్లి అక్కడున్న షెడ్డు నుంచి ఒక బ్లేడు, బలమైన కర్ర తీసుకువచ్చాడు. అప్పు తీర్చమని నాగరాజును డబ్బులు అడిగితే.. మద్యం మత్తులో ఉన్న ఆయన ఇవ్వను పొమ్మన్నాడు. దీంతో గణేష్ పట్టరాని కోపంతో నాగరాజు ఎడమ వైపు ఉన్న చెంప కణితిపై కర్రతో కొట్టాడు. దీంతో నాగరాజు చెవుల నుంచి రక్తం వచ్చి కేకలు వేయగా గణేష్ వెంటనే నోరు, ముక్కు గట్టిగా మూసేశాడు. నాగరాజులో చలనం లేకపోయినా ఇంకా బతికే ఉన్నాడన్న అనుమానంతో తాను తెచ్చుకున్న బ్లేడుతో కంఠాన్ని కోసేశాడు.

నాలుగు రోజుల్లోనే..

గత నెల 28న రణస్థలం మండలం దేవరాపల్లిలోని కొండవైపు కచ్చా రోడ్డులోని ముళ్లపొదల బయట శవం ఉందన్న సమాచారం స్థానికుల ద్వారా పోలీసులకు తెలిసింది. వెంటనే డీఎస్పీతో పాటు జేఆర్ పురం సీఐ బీసీహెచ్ స్వామినాయుడు, ఎస్‌ఐ జి.ఆర్.రాజేష్, క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ ఘటనా స్థలికి వెళ్లి ఆ మృతదేహం బూర్లె నాగరాజు (35)దిగా గుర్తించారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో ఆరాతీశారు. మృతుని అత్తవారి గ్రామం కలిశెట్టిబడి గ్రామమని తెలిసి అక్కడా వాకబు చేశారు. అక్కడే వారికి క్లూ దొరికింది. హత్య చేశాక మృతుని సెల్‌ఫోన్‌ను నిందితుడు తీసుకుపోవడంతో పోలీసుల పని సులువైపోయింది. ఆ సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా దర్యాప్తు చేయగా యండవ గణేష్ దొరికిపోయాడు. అతడిని పట్టుకుని తమదైన శైలిలో విచారించగా ఆ యువకుడు నిజం ఒప్పుకున్నాడు. అతని వద్ద పోలీసులు హీరోహోండా బైక్, రక్తం మరకలు ఉన్న షర్టు, కర్ర, బ్లేడు, మృతుని సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

పల్లె మురిసింది..



తనను కన్న ఊరికి తొలిసారి కదలి వచ్చింది న్యాయం. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానానికి న్యాయమూర్తిగా నియమితులై తిరిగి వచ్చిన తన బిడ్డను ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది చిన్నబొడ్డేపల్లి గ్రామం. అపూర్వ రీతిలో స్వాగత సత్కారాలు చేసి మురిసిపోయింది. ఈ గ్రామానికి చెందిన దుప్పల వెంకటరమణ ఇటీవల హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆ హోదాలో మంగళవారం తొలిసారి స్వగ్రామానికి వచ్చారు. ఆయన రాకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఊరంతా తమకే పదవి వచ్చిందన్నంత సందడి చేశారు. – పొందూరు

పాతవారికే కొత్త కలరింగ్!



ఈ ఫొటోలో రౌండప్ చేసిన వ్యక్తి పేరు కూనబిల్లి దామోదరరావు. ఈయన లావేరు మండలం కొత్త కుంకాం మాజీ సర్పంచ్. టీడీపీ నాయకుడిగా కొనసాగుతున్నారు. ఆరు నెలల కిందట టీడీపీ నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో కొత్త కుంకాంలో నిర్వహించిన ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమంలో ఊరంతా తిరిగారు. టీడీపీ కరపత్రాలు కూడా గ్రామస్తులకు పంచిపెట్టారు. ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వేదికపైన కూర్చొన్నారు. ఆయన పక్కనే నిల్చొని కలిశెట్టి అప్పలనాయుడు ప్రసంగం కూడా చేశారు.



ఇప్పుడు అదే వ్యక్తికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కళా వెంకటరావు సోమవారం సాయంత్రం టీడీపీ కండువా వేసి ఆయనతో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరారని ప్రచారం చేశారు. ఆ ఫొటోను మీడియాకు, సామాజిక మాధ్యమాలకు వదిలారు. దీంతో చూసిన వారంతా అవాక్కయ్యారు. టీడీపీ నాయకుడు వైఎస్సార్‌సీపీ నుంచి చేరడమేంటని అంతా ఆశ్చర్యపోయారు. మిగతా రాజకీయ పక్షాలకు చెందిన వారిని పక్కన పెడితే సాక్షాత్తు టీడీపీకి చెందిన వారే తప్పు పడుతున్నారు. మన పార్టీ నాయకుడికి కండువా వేసి, మన పార్టీలోకి చేరడమేంటని కళా వెంకటరావు తీరుపై పెదవి విరుస్తున్నారు. టీడీపీ కార్యకర్తలకు కండువాలు వేసి, వారంతా వైఎస్సార్‌సీపీ వారని చెప్పడం సిగ్గుగా లేదా అని ఆక్షేపిస్తున్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులున్న వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్‌లో ఓ రేంజ్‌లో కళాను కడిగేస్తున్నారు. –సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

... ఇలా చేయడం కళా వెంకటరావుకు కొత్తేమీ కాదు. అధిష్టానం వద్ద తన బలం పెరిగిందని చెప్పుకోవడానికి రకరకాల జిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారు.

- ఏప్రిల్‌లో లావేరు మండలం పట్నాయునిపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలను రణస్థలం మండలం వీఎస్‌పురానికి తీసుకొచ్చి టీడీపీ కండువాలు చేసి, వారంతా వైఎస్సార్‌సీపీకి చెందిన వారని ఫొటోలు తీసి మీడియాకు వదిలారు. టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసి చేరికలేమిటని సాక్షాత్తూ తెలుగు తమ్ముళ్లే నివ్వెరపోయారు.
- సెప్టెంబర్‌లో కూడా ఇదే తరహా డ్రామా వేశారు. పాలఖండ్యాం పంచాయతీ సీతారాంపురం గ్రామానికి చెందిన 25 వైఎస్సార్‌సీపీ కుటుంబాలు టీడీపీలో చేరినట్టుగా, వారందరికీ కండువాలు వేసి ఫొటోకు ఫోజులిచ్చి మీడియాకు ఇచ్చారు. కానీ, వాస్తవానికి వారంతా మెట్టవలస గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు. వాస్తవం తెలుసుకున్న జనం ఛీకొట్టారు. ఇదే విషయమై వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి.. చేరారని చూపించిన వారిలో ఒక్కరైనా వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఉన్నారని నిరూపించాలంటూ సవాల్ విసిరారు. దానికి కళా వెంకటరావు తోక ముడిచి సైలెంట్ అయిపోయారు.

కళా వారి రాజకీయ మాయా కళ

- ఇప్పటికే టీడీపీలో ఉన్న కొత్త కుంకాం మాజీ సర్పంచ్
- అతనికే మళ్లీ పచ్చ కండువా వేసి ఆర్భాటం
- వైఎస్సార్‌సీపీని వీడి తమ పార్టీలో చేరినట్లు ప్రకటన
- గతంలోనూ ఇలాంటి మాయాజాలం చేసి అభాసుపాలైన మాజీమంత్రి



చీప్ పాలిట్రిక్స్..

కళా వెంకటరావు ఇలా వింత పోకడకు దిగుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో తనకు బలం లేకపోయినప్పటికీ, ఉన్న కేడర్‌ను తనను పట్టించుకోనప్పటికీ తనకు పట్టు ఉందని, తన వెంట కేడర్ ఉందని చెప్పుకోవడానికి చీప్ పాలిటిక్స్ చేస్తున్నారు. కళా వైభవం పోయిందని, ఆయనకంత సీన్ లేదని కార్యకర్తలు సైతం తేలికగా తీసుకుని పట్టించుకోవడం మానేశారు. ఆయనకు ప్రత్యామ్నాయమైన కలిశెట్టి అప్పలనాయుడును తమ నాయకుడిగా గుర్తిస్తున్నారే తప్ప కళా వెంకటరావును ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. పెళ్లి ఇతరత్రా శుభ కార్యక్రమాల ఆహ్వానం కోసం వచ్చిన వారితో ఫొటోలు తీసుకుని, వారు కూడా తన బలగమని చెప్పుకునే స్థాయికి కళా దిగజారిపోయారు. చావు పరామర్శకు వెళ్లి, అక్కడ టీడీపీ వాళ్లకే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి చేరినట్టుగా చిత్రీకరించిన సందర్భం కూడా ఉంది. దీనిపై అప్పట్లో సోషల్ మీడియాలో కూడా వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ట్రోల్ అయింది కూడా.

‘పింఛన్’ వచ్చింది..

వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం పాత బస్టాండ్: మండలంలో మంగళవారం పింఛన్ల పండగ జరిగింది. సాంకేతిక కారణాలతో పింఛన్లకు దూరమైన వారికి ఈ నెల పెన్షన్లు అందించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 135 కొత్త పింఛన్లను మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజు మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు 83.05 శాతం మందికి పింఛన్లు అందించారు.



వజ్రపుకొత్తూరు: కొత్తగా మంజూరైన పింఛన్లతో లబ్ధిదారుల ఆనందం

క్లుప్తంగా

మంత్రి ధర్మానను కలిసిన ఏపీఐడీసీ డైరెక్టర్

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును స్థానిక పెదపాడు క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏపీఐడీసీ శ్రీకాకుళం డైరెక్టర్ ఆర్.అనురాధ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఇండస్ట్రియల్ తరఫున జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ధర్మానకు వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన డైరెక్టర్ అనురాధ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ రేసు అనురాధ మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. పారిశ్రామిక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సౌర విద్యుత్ ప్లాంట్ పరిశీలన



సౌర విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా గ్రామంలో గల సచివాలయంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రత్యేక నిధులతో మంజూరు చేసిన సౌర విద్యుత్ పరికరాలను (సోలార్ ప్లాంట్)ను మంగళవారం శ్రీకాకుళం ఎంపీడీఓ రఘు, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ పరిశీలించారు. అలాగే శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మంజూరు చేసిన ప్రత్యేక నిధులతో ఎల్‌ఈడీ లైట్లను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అరవల రాంప్రతాప్, పంచాయతీ కార్యదర్శి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి గుంటూరులో రెవెన్యూ క్రీడలు



కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గుంటూరు పట్టణంలో గల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో 6వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకలకు జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్, శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతిలను మంగళవారం ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం తరఫున ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలిపారు.

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్‌కు పితృ వియోగం

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యా సంస్థల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తండ్రి రామారావు మంగళవారం మృతి చెందారు. ఆయన మృతిపై కళాశాల యాజమాన్యంతో పాటు పట్టణంలోని పలువురు సంతాపాన్ని తెలిపారు. నాగేశ్వరరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఉప ఖజానా కార్యాలయం ప్రారంభం రేపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలోని తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలోని కొత్తగా నిర్మించిన ఉప ఖజానా కార్యాలయం గురువారం ప్రారంభించనున్నట్లు ఖజానా శాఖ ఉప సంచాలకులు రవి కుమార్ మంగళవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

డీఆర్‌ఎం దృష్టికి మందస రైల్వే స్టేషన్ సమస్యలు

మందస: మందస రైల్వేస్టేషన్‌లో ఉన్న సమస్యలను డివిజనల్ రైల్వే మేనేజర్ రింకేష్‌రాయ్(ఖుర్దా)కు స్థానిక ప్రజా ప్రతినిధులు, స్థానికులు వివరించారు. డీఆర్‌ఎం రాకను తెలుసుకున్న వారంతా మంగళవారం మందస రైల్వేస్టేషన్(కమలాపురం) చేరుకుని నిరీక్షించారు. ప్రత్యేక రైలులో వచ్చిన ఆయనను కలిసి రైల్వే స్టేషన్‌లోని సమస్యలతో పాటు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్‌ఓబీ) కావాలని, విశాఖ ఎక్స్‌ప్రెస్ ఇక్కడ నిలపాలని, బరంపురం నుంచి విశాఖపట్నం రెండో ఇంటర్‌సిటీ ట్రైన్‌కు హాల్ట్ ఇవ్వాలని కోరారు. రిజర్వేషన్ కౌంటర్‌లో బుకింగ్ క్లర్క్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యలపై డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారు. ఎఫ్‌ఓబీ మంజూరుకు ప్రతిపాదన ఉందని, విశాఖ ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌ను కూడా పరిశీలిస్తున్నామన్నారు. స్టేషన్ వ్యాపార పరంగా అభివృద్ధి చెందితే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని అన్నారు. సదుపాయాలను పరిశీలించి స్థానిక సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో కుంటికోట సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుంపల వైకుంఠరావు, గొలుసు చంద్రశేఖర్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రౌతు చిరంజీవరావు, మండల కార్యదర్శి ఇప్పిలి వెంకటరావు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొర్ల హేమారావుచౌదరి, కమలాపురం ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



సీఐ డీవీవీ సతీష్‌కుమార్

ఇచ్ఛాపురం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం పోలీసులకు సేవా పతకాలను ప్రకటించింది. ఇందులో జిల్లాకు చెందిన ఐదుగురు పతకాలకు ఎంపికయ్యారు. ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) దేవగుప్తా వీర వెంకట సతీష్‌కుమార్ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. ఈయన మొదట జిల్లాలో కంచిలి పోలీస్ ఎస్‌ఐగా 2000లో విధుల్లో చేరారు. అనంతరం ఆయన జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. 2012లో స్పెషల్ బ్రాంచ్ సీఐగా పదోన్నతి పొంది ఆ తర్వాత విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీసీఆర్‌బీ, విశాఖ స్టీల్ ప్లాంట్ పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో సీఐగా విధులు నిర్వహించారు. జిల్లాలో సోంపేట పోలీస్‌స్టేషన్ సీఐగా 2019లో విధులు నిర్వహిస్తూ బదిలీపై 2021 నవంబర్‌లో ఇచ్ఛాపురం సీఐగా వచ్చారు. టౌన్, రూరల్ ఎస్‌ఐలు కె.గోవిందరావు, కె.రామకృష్ణ సీఐకి అభినందనలు తెలిపారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు..



చిన్నారావు



నరసింహులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్‌ఐ ఎం.చిన్నారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ యల్లా నరసింహులు పోలీస్ సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఉత్తమ సేవలకు వీరికి గుర్తింపు లభించింది. చిన్నారావు 1984లో కానిస్టేబుల్‌గా చేరి 2012లో ఎస్‌ఐగా పదోన్నతి పొందారు. నరసింహులు 1984లో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా చేరి 2005లో కన్వర్షన్‌లో ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుల్‌గా చేరారు. పోలీస్ అధికారులు వీరికి అభినందనలు తెలిపారు.

అగ్ని మాపక శాఖాధికారికి..



ఎస్.వరహాలు

సోంపేట: సోంపేట అగ్నిమాపక శాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వరహాలు ఈ ఏడాది సేవా పతకానికి ఎంపికైనట్లు సిబ్బంది తెలిపారు. ఎస్.వరహాలుకు అవార్డు మంజూరు కావడంతో సిబ్బంది అభినందనలు తెలిపారు.

విజిలెన్స్ హెచ్‌సీకి..



రామమోహనరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ కానిస్టేబుల్ జి.రామమోహనరావుకు ప్రభుత్వం సేవా పథకం ప్రకటించింది. ఆయన 1998లో సివిల్ కానిస్టేబుల్‌గా వజ్రపుకొత్తూరులో చేరారు. ఆ తర్వాత జీఆర్పీగా ఐదున్నరేళ్లు పనిచేశారు. అనంతరం సోంపేటలో కానిస్టేబుల్‌గా, శ్రీకాకుళంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా, 2019లో పదోన్నతిపై హెచ్‌సీగా జి.సిగడాంలో చేరారు. 2021లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో చేరారు. ఉద్యోగ జీవితంలో 200 సార్లు ఆయన నగదు బహుమతులు అందుకోవడం విశేషం.

అమరజీవి స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలసలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఉద్యమిద్దామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆనాడు భాషాప్రయుక్త రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి తెగువను స్మరించుకుంటూ.. మూడు రాజధానుల ఏర్పాటుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి తరతరాల అసమానతలు నిర్మూలించేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ చారిత్రక నిర్ణయాన్ని తీసుకున్నారని అన్నారు. దీన్ని రాజకీయ కోణంలో ఆలోచించకూడదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, ఏఈ కె.అప్పలనాయుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జీజీ మోహన్‌రావు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కె. శ్యామ్ ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ వైస్ ఫ్లోర్‌లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు, ముఖ్యనాయకులు బి.చిన్నంనాయుడు, డాక్టర్ పి.తాతయ్యలు, ఎ.రామకృష్ణ, బి.భాస్కరరావు, గుడ్ల బాబు, మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, డి. చిరంజీవిరావు, సిల్లా మల్లికార్జునరావు, ఎస్. కామేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు పొన్నాడ చిన్నారావు, మామిడి రమేష్, పట్టణంలోగల వర్తకులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: అమరజీవి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

'సీఎం దృష్టికి ఇద్దివానిపాలెం పునరావాస కాలనీ సమస్య'



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెం పునరావాస కాలనీలో మత్స్యకారుల ఇళ్ల నిర్మాణం పరిస్థితుల్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఈఈ పీవీ జోగారావు అన్నారు. ఆయన మంగళవారం ఇద్దివానిపాలెం పునరావాస కాలనీలో శ్రీకాకుళం జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇక్కడ సుమారు 17 ఎకరాల సువిశాల స్థలంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో కాలనీని 2006లో ఏర్పాటు చేశారు. ఇందులో 700 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. వీరిలో 433 మందికి వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణం చేశారు.

మిగిలిన 267 మందికి పట్టా లు ఇచ్చినప్పటికీ ఇంటి నిర్మాణ బిల్లులు మంజూరు కాలేదు. దీంతో బాధితులకు గరిష్ఠ ప్రయోజనం అందేలా ఇంటి బిల్లులు చెల్లించాలన్న ప్రతిపాదనతో ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ దృష్టికి ఇక్కడి సమస్యల్ని తీసుకెళ్లినట్టు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. తాజా స్థితిపై గృహనిర్మాణశాఖ అధికారులు తయారు చేసిన నివేదికతో మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీఈఈ శేషయ్య, ఏఈ సాయిరాం, మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, వై.అశోక్, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ రామయ్య, మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడు బైపల్లి మోహన్, గండుపల్లి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అచ్చెన్న అభివృద్ధిపై మాట్లాడడమా..!

- అచ్చెన్నాయుడు అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్నారు
- దుమ్మెత్తిపోసిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ముసుగులో వేల కోట్ల అవినీతికి పాల్పడిన అచ్చెన్నాయుడు ఈరోజు అభివృద్ధి కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన మంగళవారం టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. టెక్కలి నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.450 కోట్లు ఖర్చు చేశారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గడచిన మూడున్నరేళ్ల కాలంలో ఒక్క టెక్కలి నియోజకవర్గంలో సుమారు రూ.1,026 కోట్ల మేరకు అభివృద్ధి చేశారని దువ్వాడ చెప్పారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో అచ్చెన్నాయుడు ఆయన గ్యాంగ్ కలిసి వేల కోట్ల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. చివరకు టెక్కలిలో కోర్టు నిర్మాణం పేరుతో న్యాయస్థానాన్ని నిలువునా మోసం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలో నియోజకవర్గంలో ప్రజల్ని, పర్యావరణాన్ని విషతుల్యం చేయడానికి పవర్ ప్లాంట్‌కు అనుకూలంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఉద్యోగాలిస్తానంటూ నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన చరిత్ర అచ్చెన్నాయుడిదేనని మండిపడ్డారు. భావనపాడు పోర్టు పేరుతో సుమారు 15 వేల ఎకరాల్లో భూసేకరణ చేసి భూములను కాజేసేందుకు అచ్చెన్నాయుడు పెద్ద కుట్ర చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో కేవలం 350 ఎకరాల్లో పోర్టు నిర్మాణం చేసేందుకు రూ.4,300 కోట్లు కేటాయిస్తున్నామని దువ్వాడ పేర్కొన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరడి బ్యారేజీ నిర్మాణానికి మార్గాన్ని సుగమం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో టెక్కలిలో అప్పటి కేంద్రమంత్రి కిల్లి కృపారాణి తీసుకువచ్చిన రక్షిత మంచినీటి పథకానికి ఎర్రన్నాయుడు పేరు పెట్టడం సిగ్గుచేటుగా ఉందన్నారు. కమీషన్ల కక్కుర్తి కోసం ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేస్తే... వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశారని ఎమ్మెల్సీ దువ్వాడ పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ఆఫ్‌షోర్‌ను నిర్లక్ష్యం చేశారని, జగనన్న ప్రభుత్వంలో రూ.856 కోట్లు కేటాయించారని వెల్లడించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత విపత్తుల సమయంలో ఒక్కసారైనా ప్రజల ముంగిటకు అచ్చెన్న వెళ్లారా అని దువ్వాడ ప్రశ్నించారు. టీడీపీ దోపిడీ, తమ అభివృద్ధి పనులపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధమని పేర్కొన్నారు. సొంత పార్టీనే దూషించిన అచ్చెన్న ప్రస్తుతం అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. సమావేశంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సర్పంచ్ జి.సుజాత, ఎంపీటీసీలు వి.శ్రీధర్‌రెడ్డి, డి.శాంతామణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పి.జనకమోహన్‌రావు, నాయకుడు చింతాడ గణపతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా మాస్టర్ స్విమ్మర్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపికలు మంగళవారం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్విమ్మింగ్ పూల్ వేదికగా శ్రీకాకుళం జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలను అంతర్జాతీయ మాస్టర్ స్విమ్మర్ ఎస్.కాంతారావు నేతృత్వంలో డీఎస్‌ఏ కోచ్ మురళీధర్ ఎంపికలను నిర్వహించారు. స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరికాప్రసాద్, కార్యదర్శి ఎం.విష్ణుమూర్తి పర్యవేక్షించారు. రాష్ట్రపోటీలకు జిల్లా మాస్టర్స్ స్విమ్మర్లను సిద్ధం చేస్తామని వారు పేర్కొన్నారు.

శ్వేత పుష్కరిణి గట్లు పటిష్టం



పుష్కరిణి గట్లు పనులు జరుగుతున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథుని ఆలయంలో శ్వేత పుష్కరిణి గట్లు పటిష్టం చేసే పనులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం నావికోత్సవం జరగనున్న దృష్ట్యా ఇటీవలే ఎంపీపీ గొండు రఘురామ్ పుష్కరిణిని పరిశీలించారు. గట్లు బాగుచేసేందుకు సుమారు రూ. 50 వేలు అవసరమని గుర్తించారు. దీంతో ఆయన తన సొంత నిధులతో జేసీబీ వాహనం ఏర్పాటు చేయడంతో పాటు గట్లు బాగు చేయించారు. మంగళవారం నుంచి పనులు ప్రారంభం కాగా ఎంపీపీతో పాటు ఈఓ గురునాథం, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. శుక్రవారం నాటికి గట్లు పటిష్టతతో పాటు చుట్టూ రోడ్డు ఉండేలా చూడాలని ఆయన సూచించారు.

పాతటెక్కలి సీతారామాలయంలో చోరీ



ఆలయంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాతటెక్కలి బీసీ కాలనీలో కొలువైన సీతారామాలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు తాళాలు పగలగొట్టి ఆలయంలోకి జొరబడి సీతమ్మ వారి విగ్రహం మెడలో ఉన్న తులం బంగారు పుస్తెలతో పాటు అర కిలో బరువైన ఎనిమిది వెండి కిరీటాలు, నగదుతో కూడిన హుండీని దొంగిలించారని వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

హుండీని విరగ్గొట్టి అందులో నగదును తీసి హుండీని ఆలయం సమీపంలోని పొదల్లో పడేసినట్లు చెప్పారు. ఆలయంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగల వివరాలు తెలియరాలేదని ఆలయ ట్రస్ట్ మేనేజర్ ఐ.గణపతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. అనంతరం వజ్రపుకొత్తూరు పోలీసులు, శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్ టీం ఆలయ పరిసరాలను పరిశీలించారు. అయితే ఆలయంలో రెండు కిలోల బరువైన మూల విగ్రహాలు, నాలుగు, ఉత్సవ విగ్రహాల కిరీటాలు నాలుగు, వెండి శఠగోపం, ఉద్ధరిణి చెంచాలు రెండు, వెండి పళ్లెం, వెండి జంధ్యాలు రెండు జతలు, అమ్మవారి విగ్రహం మెడలోని రెండు తులాల పుస్తెలతాడు మాయమైనట్లు స్థానికులు చెబుతున్నారు.

ట్రస్ట్ మేనేజర్ గణపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు.

జిల్లాలో వ్యాపార కేంద్రాల్లో మహిళా మార్ట్‌లు



స్థానిక ఏపీఎం, ఇతర సిబ్బందితో మహిళా మార్ట్ ఏర్పాటుపై సమీక్ష చేస్తున్న పీడీ విద్యా సాగర్

నరసన్నపేట: జిల్లాలో నరసన్నపేట, శ్రీకాకుళంతో పాటు ఇతర ప్రధాన వ్యాపార కేంద్రాల్లో మహిళా మార్టులు ఏర్పాటు చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నరసన్నపేటలో మహిళా మార్ట్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక సిబ్బందితో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆసక్తి ఉన్న మహిళా సంఘాల ప్రతినిధులకు మరింతగా ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ మార్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదట్లో నరసన్నపేట, శ్రీకాకుళంలో వీటిని ఏర్పాటు చేయాలనుకున్నామని, ముందుగా నరసన్నపేటలో మహిళా మార్ట్ ప్రారంభిస్తామని చెప్పారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, రణస్థలం, ఆమదాలవలస వంటి ప్రధాన వ్యాపార కేంద్రాల్లోనూ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. సాంకేతిక కారణాలతో 175 మందికి పింఛన్లు ఆగాయని, సాంకేతిక ఇబ్బందులు తొలగించి నవంబర్‌లో వారికి కూడా పింఛన్లు అందజేస్తామని చెప్పారు.

విద్యుత్ శాఖ ఏఈపై కలెక్టర్ ఆగ్రహం



ఇంజినీరింగ్ అసిస్టెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

జలుమూరు: అల్లాడ గ్రామంలోని జగనన్న కాలనీలో విద్యుత్ సదుపాయం కల్పించడంలో నిర్లక్ష్యం వహించినందుకు విద్యుత్ శాఖ ఏఈ వారణాశి వెంకటరావుపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మండలంలోని అల్లాడ సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం అల్లాడలో ఏర్పాటు చేస్తున్న జగనన్న లే అవుట్‌లను పరిశీలించి, అక్కడ విద్యుత్ సదుపాయం కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 10వ తేదీలోగా పనులు పూర్తి చేయాలని, లేదంటే దీనిపై రిపోర్టు తయారు చేసి తనకు పంపించాలని ఎంపీడీఓకు సూచించారు. అలాగే ఈ గ్రామంలో నిర్మిస్తున్న వెల్‌నెస్ సెంటర్ పునాదులకే పరిమితం కావడంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్ నక్క పూజపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నవంబర్ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. అల్లాడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మొజ్జాడ శ్యామలరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సత్యం, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఏఓ కె.సురేష్, ఏపీఓ నారాయణరావు తదితరులు ఉన్నారు.

సత్తాచాటిన బాలికలు

కోటబొమ్మాళి: అక్టోబర్ 29, 30 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో స్థానిక కేజీబీవీ బాలికలు మూడో స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.వెంకటరత్నం, పీఈటీ ఆర్.రమణమ్మలు తెలియజేశారు. ఈ మేరకు పాఠశాలలో వారిని మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్ రత్నకుమారి, బి.విమలాకుమారి, ఆర్.లక్ష్మీకుమారి, కె.ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,380-00
బంగారం(22సి. 10గ్రా.)	46,460-00
వెండి (కిలో)	60,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235

గడప గడపలో సంతోషం

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- జె.ఆర్.పురం–2 గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'


సీతంవలసలో ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషం వ్యక్తమవుతోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. జె.ఆర్.పురం–2 గ్రామ సచివాలయ పరిధిలోని సీతంవలస, పిన్నింటిపేట, గొల్లపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 334 ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందిన సంక్షేమ పథకాల వివరాల జాబితాను చదివి వినిపించారు. ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సీతంవలసలో కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని, మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా... అధికారులతో మాట్లాడి త్వరలో పనులు జరిగేలా నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. మరికొంతమంది జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా.. అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలందరికీ సంపూర్ణంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే అందుకు కారణం సీఎం జగనేని, మళ్లీ ఈ పథకాలన్నీ రావాలంటే రానున్న ఎన్నికల్లో ఆయన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల బూత్ కన్వీనర్ చిల్లా వెంకటరెడ్డి, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, మండల నాయకులు పిల్లా ఆనందరావుపాత్రుడు, మహంతి పెదరామినాయుడు, మైలపల్లి కామరాజు, బడి రాంబాబు, పైడి శ్రీనివాసరావు, కరిమజ్జి భాస్కరరావు, రెడ్డి విశ్వేశ్వరరావు, లంకలపల్లి ప్రసాద్, గ్రామ నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, పిన్నింటి సత్యంనాయుడు, ఆర్.శ్రీనివాసరావు, టేకి బ్రహ్మాజీ, కోల అప్పన్న, అప్పడుదొర, కోల సూరిబాబు, ఎం.రాజశేఖర్, పిట్ట రమణ, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి ధర్మాన పరామర్శ


పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: మండలంలోని అంపోలు గ్రామానికి చెందిన మెరుగు సింహాచలం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం పరామర్శించారు. అలాగే బూరవెల్లికి చెందిన మల్ల రాము, శిలగాంకు చెందిన గేదెల రమణ, దీర్ఘాశి బుగ్గమ్మ, జల్లువలసలో దువ్వాడ సూర్య ప్రకాశ్‌లు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పీస శ్రీహరిరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, యాళ్ల నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న సత్యవతి

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనబడి నాడు–నేడు రెండో విడత పనులను సంబంధిత అధికారులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ మీసాల సత్యవతి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లుల కోసం వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, ఎంఈవో అరసాడ రవి, ఏఈఈ గోవిందరావు, ప్రధానోపాధ్యాయులు తురక బలరాం, బి.మణయ్య పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: హైకోర్టు న్యాయవాది సయ్యద్ బిలాల్ అహ్మద్‌పై అనుచితంగా ప్రవర్తించిన పల్నాడు జిల్లా శావల్యపురం పోలీసులపై చర్యలు తీసుకోవాలని జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. బార్ అధ్యక్షుడు బెజ్జిపురం పాల్గుణరావు మాట్లాడుతూ.. అహ్మద్‌పై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ, కొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పొన్నాడ వెంకటరమణారావు, సీనియర్ న్యాయవాదులు, బార్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రవణ నక్షత్ర పూజలు


స్వామివారికి హారతి ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు బూరాడ వంశీశర్మ ఆధ్వర్యంలో క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నగర వీధుల్లో హరినామ సంకీర్తనలు, విష్ణు సహస్రనామ పారాయణలు చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లోకనాథం నందికేశ్వరరావు, మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

14న విచిత్ర వేషధారణ పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14వ తేదీన శ్రీకాకుళం బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లోని డాక్టర్ వైఎస్సార్ ఆడిటోరియంలో చిన్నారులకు విచిత్ర వేషధారణల పోటీలు నిర్వహించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో నిర్వాహకులు తెలియజేశారు. పోటీల్లో పాల్గొన్నవారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. జూనియర్ విభాగంలో 4 నుంచి 8 ఏళ్లలోపు చిన్నారులు, సీనియర్స్ విభాగంలో 8 నుంచి 10 ఏళ్లలోపు బాలలు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతీ విభాగానికి కేవలం 25 మంది చిన్నారుల పేర్లు మాత్రమే తీసుకోవడం జరుగుతుందని, ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94410 72762 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: చిలకపాలెం, అల్లినగరం, ఎచ్చెర్ల గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనులు చేపట్టాలి

జి.సిగడాం: వేతనదారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధి పనులు చేపట్టాలని ఏపీడీ శైలజ అన్నారు. పాలఖండ్యాం గ్రామంలో సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ అధ్యక్షతన మంగళవారం ఉపాధి పనుల కార్యాచరణ ప్రణాళికల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం వేతనదారులకు వరంలాంటిదన్నారు. అవసరమైన పనులను గుర్తించి వేతనదారులకు ఉపాధి కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, పంచాయితీ కార్యదర్శి రాజా రమేష్, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఉపసర్పంచ్ ఇజ్జి గోవిందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాయపురెడ్డి సూర్యనారాయణ, దారబోయిన వెంకట అప్పారావు, పెద్ది భాస్కరరావు, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

ఎచ్చెర్ల: ప్రతిఒక్కరూ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శోభాదేవి అన్నారు. మంగళవారం ఎచ్చెర్ల టీటీడీసీ కార్యాలయానికి విచ్చేసిన ఆమె ఇక్కడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డీపీఎం రవి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే ఉజ్వల భవిత


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

జి.సిగడాం: సాంకేతిక విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోబోటిక్‌సైన్స్ ల్యాబ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు. అనంతరం రోబో తయారు చేసేవిధానంను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి తవుడమ్మ, ఎంఈవో అరసాడ రవి, ప్రధానోపాధ్యాయులు పీవీ నర్సింహంమూర్తి, పాఠశాల సమన్వయకర్త కుప్పిలి రవికుమార్ పట్నాయక్, మాజీ సర్పంచులు మహదాస్యం నారాయణరావు, నాయిని సింహాచలం, నాయకులు ముద్దాడ గౌరీ, పిన్నింటి రామినాయుడు, సీఆర్పీ రంగనాథం పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజలేశ్వరస్వామి దేవాలయంలో ఉప దేవాలయంగా ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి కార్తీక మాస తొలి మంగళవారం సందర్భంగా అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు బి.అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

'ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలి'


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్రావు

శ్రీకాకుళం రూరల్: ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు కోసం ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.వెంకట్రావు స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు సంబంధించి వీఆర్వోలతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయం కేంద్రంగా ఓట్ల నమోదులో వీఆర్వోలు పాల్గొనాలని సూచించారు. 2019 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులంతా అర్హులన్నారు. ప్రతీ సచివాలయంలో ఫారం–18లు అందుబాటులో ఉన్నాయని, వలంటీర్ల ద్వారా ఓట్ల నమోదుకు కృషి చేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను సచివాలయంలో గానీ, తహసీల్దార్ కార్యాలయానికి గానీ అందజేయాలన్నారు. సమావేశంలో డీటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు


జస్టిస్ డీవీ రమణను కలిసిన ఎస్పీ, న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణను జిల్లా న్యాయవాదులు బార్ ప్రతినిధులు, ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం నవభారత్ సెంటర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో బార్ అధ్యక్షుడు బెజ్జిపురం ఫల్గుణరావు, వాన కృష్ణచంద్, ఆఫీస్ నాయుడు, జల్లు తిరుపతిరావు, మామిడి క్రాంతి ఉన్నారు.

వాలీబాల్ పోటీలకు జిల్లా జట్ల పయనం


క్రీడాకారులతో వాలీబాల్ సంఘ ప్రతినిధులు, చీఫ్ కోచ్

శ్రీకాకుళం న్యూకాలనీ: విజయనగరం జిల్లా బొబ్బిలి వేదికగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఏపీ రాష్ట్ర జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ ఛాంపియన్‌షిప్–2022 పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు మంగళవారం పయనమయ్యాయి. వీరికి వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు, పీడీలు పలు సూచనలు చేశారు. సూర శ్రీనుతోపాటు విశ్రాంత ఎస్ఐ, సీనియర్ వాలీబాల్ ప్లేయర్ పిట్ట రాజేశ్వరరావులు క్రీడా దుస్తులు సమకూర్చి బాసటగా నిలిచారు. అలాగే ఐదు రోజులు పాటు నిర్వహించిన బాలుర రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్‌కు ధర్మాన లక్ష్మణ్‌దాస్, శ్రీకాకుళం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయాన్ని అందించి చేయూతను అందించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సూర శ్రీనివాసరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాళ్ల పోలినాయుడు, శాప్ వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు పిట్ట వాసు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యుడికి పరామర్శ


సీతారాంను పరామర్శిస్తున్న నాయకులు

లావేరు: రణస్థలం మండల జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలియడంతో లావేరు మండల జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, రణస్థలం ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు గొర్లె సూర్యప్రకాష్, గురుగుబిల్లి మాజీ సర్పంచ్ బాడిత రాంబాబు తదితరులు చినయామల గ్రామానికి మంగళవారం వెళ్లి ఆయన్ని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

6న దేశభక్తి గీతాల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 6వ తేదీన బాల కథానిలయం ఆధ్వర్యంలో చిన్నారులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు భోగిల ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బలగ హడ్కోకాలనీ పార్కు గ్రంథాలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. 8 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులు తమ పేర్లను 5వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94913 25714 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్తంగా...

రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు

లావేరు: రైతుల వద్దకు వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి సిబ్బందికి సూచించారు. లావేరులోని మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై వీఆర్వోలు, రైతు భరోసా కేంద్రాల అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, వలంటీర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎలా కొనుగోలు చేయాలి, తేమశాతం తెలుసుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.విశ్వేశ్వరరావు, డీటీ మూర్తి, ఆర్ఐలు ఆర్.శ్రీనివాసరావు, రామచంద్రరరావు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటుహక్కు పొందాలి

గార: పట్టభద్రులంతా ఓటుహక్కు పొందాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, కొర్లాం సర్పంచ్ పీస శ్రీహరిరావు సూచించారు. మండలంలోని కొర్లాం సచివాలయంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు వేసేందుకు హక్కును పొందాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వి.మహేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛన్ అందజేసి..

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ముద్దాడ గ్రామానికి చెందిన బందిల సూరయ్య అనారోగ్యంతో శ్రీకాకుళం రూరల్ మండలం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో వలంటీర్ లింగాల లక్ష్మణ అక్కడకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందించారు. సర్పంచ్ ముద్దాడ శంకర్ పాల్గొన్నారు.

కోలుకుంటున్న విద్యార్థి


ఆస్పత్రిలో విద్యార్థి నాని

లావేరు: లావేటిపాలెం గ్రామానికి చెందిన రెండో తరగతి విద్యార్థి కాకి నాని గత నెల 12న పాఠశాల సమీపంలో విద్యుత్‌షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే కుడి చేయికి ఇన్ఫెక్షన్ సోకడంతో వైద్యులు తొలగించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందుతుండడంతో తమ కుమారుడు కోలుకుంటున్నాడని తల్లిదండ్రులు కాకి గంగులు, రమణమ్మ తెలిపారు.

రాజధానితోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

- జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్


సంతలో స్థానికులతో మాట్లాడుతున్న లజపతిరాయ్

గార: విశాఖపట్నంను పరిపాలన రాజధానిగా చేస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. రాజధానిగా విశాఖపట్నం అవసరంపై స్థానిక సంతలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రామిక వర్గాల ప్రజలు సైతం విశాఖ రాజధానిగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. విశాఖపట్నం రాజధానిగా మారితే తమ బతుకులు మారుతాయని అంటున్నారని తెలియజేశారు. మూడు రాజధానులతో అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కర్నూలులో న్యాయ రాజధాని కావాలని ఇప్పటికే ఉద్యమం జరుగుతోందన్నారు. సామాన్యులంతా ఉద్యమంలోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సూర్యం, పైడి నిర్మల్‌కుమార్, రమణ, గున్న ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్ర ఫౌండేషన్ పరిశీలన


భోజనాలను రుచి చూస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం, గార, ఆమదాలవలస ప్రాంతాల్లో గల ప్రభుత్వ విద్యాసంస్థలకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న సింగుపురంలో గల అక్షయపాత్ర ఫౌండేషన్ కేంద్రాన్ని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ సోమవారం పరిశీలించారు. భోజనం తయారు చేసే పద్ధతులు, కిచెన్ గార్డెన్, అలాగే కూరగాయలు నిల్వ ఉండే స్టోరేజ్ ప్రాంతాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా గల ప్రభుత్వ పాఠశాలలకు అక్షయపాత్ర ద్వారా భోజనం సరఫరా చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, ఎంపీడీఓ రఘు, పంచాయతీ సెక్రటరీ రమేష్, అక్షయపాత్ర మేనేజర్ శ్రీనివాసరావు, స్థానిక పార్టీ నాయకులు గుండ మోహన్, బగ్గు అప్పారావు, నక్క శంకరావులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం లాభదాయకం


మాట్లాడుతున్న జేడీ కిషోర్

గార: చిన్నపాటి మెలకువలు పాటిస్తే గొర్రెల పెంపకం లాభదాయకంగా ఉంటుందని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ఎం.కిషోర్ అన్నారు. స్థానిక సంతలో గొర్రెల పెంపకంపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధులు సంక్రమించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ రెండేళ్లకు ఒకసారి విత్తన పొట్టేళ్లను మార్చుకుంటే మేలుజాతి గొర్రెలు జన్మిస్తాయన్నారు. రెండు సంవత్సరాలకు మూడు ఈతలు ఉండేలా చూసుకోవాలన్నారు. మొబైల్ సర్వీస్ ద్వారా 1962 కాల్ చేస్తే అంబులెన్సు సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్పు ధర్మారావు, సర్పంచ్ పృథ్వీరాజ్, డాక్టర్ సూర్యం, ఎంపీటీసీ ఆరంగి రమణమూర్తి, డీడీ జగన్నాథం, డీడీటీసీ మనోజ్, ఏడీ గొలివి రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీని నిర్వీర్యం చేయడం సరికాదు


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: భారతదేశ ఆర్థిక రంగానికి వెన్నుముక లాంటి భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)ని నిర్వీర్యం చేసే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని ఎస్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యూఐ విశాఖపట్నం అధ్యక్షుడు జేవీఎస్ఎన్ రాజు, ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఎల్ఐసీ విశాఖపట్నం డివిజన్ పరిధిలోని వివిధ బ్రాంచిల వికాసాధికారులు శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్ నాయుడుని కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్త విధానాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే విధంగా పార్లమెంటులో ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రవికుమార్, కిషోర్, మధుబాబు, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


జీవితావలోకనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సువ్వారి సువర్ణ తదితరులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, కార్యదర్శి బి.కుమార్ రాజు ఆధ్వర్యంలో నడికట్టు రామిరెడ్డి జీవితావలోకనం పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సువ్వారి సువర్ణ మాట్లాడుతూ ఈ పుస్తకం రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌చే అక్షరీకరించబడిందన్నారు. అనంతరం నవంబర్ 14 నుండి 20 వరకు జరగాల్సిన గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వారి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు పొట్టి శ్రీరాములు


శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


జి.సిగడాం: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


అరసవల్లి: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈవో వెంకట్రామన్


శ్రీకాకుళం అర్బన్: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సువ్వారి సువర్ణ


శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంధవరపు సూరిబాబు తదితరులు


శ్రీకాకుళం అర్బన్: అమరజీవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

భాషాప్రయుక్త రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను అర్పించిన ఆదర్శనీయుడు పొట్టి శ్రీరాములు అని వక్తలు అన్నారు. మంగళవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్

(5వ పేజీ తరువాయి....)

వ.నెం.	సర్వే నెం.	భూ వివరములు	డోర్. నెం.	ప్లాటు నెం.	పట్టాదారుని యొక్క పేరు	ఇంటి స్వభావం	హద్దులు తూ	హద్దులు ప	హద్దులు ఉ	హద్దులు ద	కట్టడముల వివరాలు
84	93/3	ప్రభుత్వ భూమి	5-47	22	కూరా నాగేశ్వరరావు తండ్రి మల్లయ్య	సిమెంటు రేకుల ఇల్లు	గొర్లె సీతయ్య	బండరాళ్లు	ఖాళీస్థలం	కూరా రాజమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంటపాక
85	101/1	పట్టా భూమి	5-46	23	కూరా రాజమ్మ భర్త మల్లయ్య	తాటాకుల ఇల్లు	..	..	కూరా నగేశ్వరావు	గొర్లె పెద భీక్షం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
86	101/2	ప్రభుత్వ భూమి	5-48	24	గొర్లె రాజయ్య తండ్రి బుర్రయ్య	తాటాకుల ఇల్లు	..	గొర్లె పెదభీక్షం	గొర్లె శేఖర్	గ్రావెల్ రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంటపాక తాటాకుల పందిరి
87	101/2	ప్రభుత్వ భూమి	5-89	25	గొర్లె శేఖర్ తండ్రి రాజయ్య	సిమెంటు రేకుల ఇల్లు	..	గొర్లె పెదభీక్షం	గొర్లె సీతయ్య	గొర్లె రాజయ్య	తాటాకుల పందిరి
88	93/3	ప్రభుత్వ భూమి	5-49	26	గొర్లె సీతయ్య తండ్రి దూలయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	కూరా నాగేశ్వర రావు	గంట్ల వినోద్	గొర్లె శేఖర్	తాటాకుల వంటపాక సిమెంటు రేకుల బాత్‌రూమ్
89	101/2	ప్రభుత్వ భూమి	5-51	27	రావి ముత్తమ్మ భర్త పూర్ణయ్య	తాటాకుల ఇల్లు	మిడియం ముత్తయ్య	దారి	గొర్లె అచ్చమ్మ	గ్రావెల్ రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
90	101/2	ప్రభుత్వ భూమి	5-52	28	గొర్లె అచ్చమ్మ భర్త సుబ్బయ్య	సిమెంటు రేకుల ఇల్లు	గ్రావెల్ రోడ్	గొర్లె శేఖర్	ఖాళీస్థలం	మిడియం ముత్తయ్య	తాటాకుల వంటపాకసిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల ట్రాక్టర్ షెడ్‌తాటాకుల పశువుల షెడ్ తాటాకుల మేకల షెడ్ తాటాకుల పందిరి
91	93/3	ప్రభుత్వ భూమి	5-53	29	గొర్లె లక్ష్మయ్య తండ్రి పాపయ్య	తాటాకుల ఇల్లు	గ్రావెల్ రోడ్	ఖాళీస్థలం	బొగ్గా రామయ్య	..	సిమెంటు రేకుల బాత్‌రూమ్
92	93/3	ప్రభుత్వ భూమి	5-54	30	బొగ్గా రామయ్య తండ్రి కన్నయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	బొగ్గా చిన్నక్క	గొర్లె వీరమ్మ	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల వంటపాకతాటాకుల పందిరితాటాకుల పశువుల షెడ్
93	93/3	ప్రభుత్వ భూమి	5-55	31	బొగ్గా చిన్నక్క తండ్రి చంద్రయ్య	తాటాకుల ఇల్లు	బొగ్గా రామయ్య	గంట్ల వినోద్	గొర్లె వీరమ్మ		సిమెంటు రేకుల బాత్‌రూమ్
94	93/3	ప్రభుత్వ భూమి	..	32	గంట్ల వినోద్ తండ్రి బాబూరావు	తాటాకుల ఇల్లు	బొగ్గా చిన్నక్క	ఖాళీస్థలం	దారా శ్రీను	గొర్లె సీతయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల వంటపాక
95	101/3	పట్టా భూమి	5-65	33	గొర్లె రాములమ్మ తండ్రి పెదబుజ్జి	సిమెంటు రేకుల ఇల్లు	గొర్లె చిన భీక్షం	గ్రావెల్ రోడ్	ఖాళీస్థలం	గొర్లె కృష్ణ	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల కోళ్ల షెడ్
96	101/3	పట్టా భూమి	5-66	34	గొర్లె చినభీక్షం తండ్రి పెద్దబొజ్జి	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	గొర్లె రాములమ్మ	గొర్లె మాలయ్య	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల వంట పాక, తాటాకుల పందిరి, తాటాకుల పశువుల షెడ్, తాటాకుల మేకల షెడ్
97	101/3	పట్టా భూమి	5-63	35	గొర్లె మల్లయ్య తండ్రి పాపయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	గొర్లె చినభీక్షం	తాటాకుల వంట పాకసిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పశువుల షెడ్‌తాటాకుల మేకల షెడ్ తాటాకుల పందిరి
98	101/3	పట్టా భూమి	5-67	36	గొర్లె కృష్ణయ్య తండ్రి బుర్రయ్య	పెంకుటిల్లు	ఖాళీస్థలం	దారి	గొర్లె రాములమ్మ	గొర్లె సారమ్మ	తాటాకుల వంటపాకసిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల మేకల షెడ్‌తాటాకుల ట్రాక్టర్ షెడ్
99	101/3	పట్టా భూమి	5-68	37	గొర్లె సారమ్మ భర్త లక్ష్మయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	దారి	గొర్లె కృష్ణయ్య	బొగ్గా చంద్రయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల వంటపాక
100	101/2	ప్రభుత్వ భూమి	5-50	38	మిడియం మోహన్‌రావు (యమ్.ముత్తయ్య గారి మనవడు)	తాటాకుల ఇల్లు	దారి	రావి ముత్తమ్మ	గొర్లె అచ్చమ్మ	రోడ్	..
101	101/2	ప్రభుత్వ భూమి	5-88	39	కూరా కామేశ్వరరావు తండ్రి ముత్తయ్య	తాటాకుల ఇల్లు	దారి	మేడి నాగమణి	కూరా పుష్పావతి	గొర్లె ధర్మయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పందిరి
102	101/3	పట్టా భూమి	5-69	50	బుగ్గా చంద్రయ్య తండ్రి చిన్నయ్య	తాటాకుల ఇల్లు	కూరా సీతమ్మ	ఖాళీస్థలం	బుగ్గా సారమ్మ	కాలిబాట	..
103	101/3	పట్టా భూమి	5-70	51	కూరా సీతమ్మ భర్త తమ్మయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	బుగ్గా చంద్రమ్మ	బుగ్గా సారమ్మ	ఖాళీస్థలం	..
104	101/1	పట్టా భూమి	5-96	63	గొర్లె పెదభీక్షం తండ్రి చినబొజ్జి	పెంకుటిల్లు	ఖాళీస్థలం	ఆర్ అండ్ బి రోడ	గ్రావెల్ రోడ్	కర్రి లక్ష్మి	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల వంట పాక (గోడలు లేవు) సిమెంటు రేకుల షెడ్‌తాటాకుల పశువుల షెడ్
105	101/2	ప్రభుత్వ భూమి	5-91	67	మేడి వెంకటేశ్వర్లు తండ్రి బాబూరావు	సిమెంటు రేకుల ఇల్లు	మెడ్డి నాగమణి	సవలం చంద్రమ్మ	రోడ్	సవలం చంద్రమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్
106	101/2	ప్రభుత్వ భూమి	5-90	68	మేడి. నాగమణి భర్త బాబూరావు	తాటాకుల ఇల్లు (గోడలు లేవు)	కూరా పుష్పావతి	మేడి వెంకటేశ్వర్లు	రోడ్	సవలం చంద్రమ్మ	..
	[illegible]										
107	45	పట్టా	5-12	1	సోలా ప్రదీప్ తండ్రి రామిరెడ్డి	తాటాకుల ఇల్లు	చలపతి రావు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	పోషమ్మ	..
108	45	పట్టా	5-11	2	సోలా పోషమ్మ భర్త లేటు రామిరెడ్డి	సిమెంటు రేకుల ఇల్లు	రోడ్	గొర్లె బుచ్చిరాజు	సోలా ప్రదీప్	దారి	తాటాకుల పాక సిమెంటు రేకుల బాత్‌రూమ్‌పందిరి
109	45	పట్టా	5-10	3	గొర్లె బుచ్చిరెడ్డి తండ్రి పాపయ్య	తాటాకుల ఇల్లు	దారి	ఖాళీస్థలం	కూరా చల పతిరావు	బొగ్గా నారాయణ	సిమెంటు రేకుల బాత్‌రూమ్
110	45	పట్టా	5-117	4	బొగ్గా నారాయణ తండ్రి చిన్నక్క	సిమెంటు రేకుల ఇల్లు	దారి	ఖాళీస్థలం	గొర్లె బుచ్చిరాజు	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పాక
111	45	పట్టా	5-8	5	సోలా పోషమ్మ భర్త లేటు భీక్షయ్య	తాటాకుల ఇల్లు	రోడ్	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ప్రసాద్ యాదవ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్ ఓపెన్ షెడ్
112	45	పట్టా	5-9	6	సోలా ప్రసాద్ యాదవ్ తండ్రి భీక్షమయ్య	ఇల్లు పడిపోయినది (వరదలు నిమిత్తం)	దారి	ఖాళీస్థలం	ప్రసాద్ యాదవ్	ఖాళీస్థలం	..
113	48	పట్టా	5-27	12	మానే బుచ్చమ్మ భర్త లేటు గంగరాజు	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	గొర్లె ప్రసాద్	దారి మార్గం	ఖాళీస్థలం	తాటాకుల పాక
114	45	పట్టా	5-14	22	కూరా చలపతిరావు తండ్రి బుచ్చయ్య	సిమెంటు రేకుల ఇల్లు	దారి మార్గం	కూరా లచ్చమ్మ	దారి మార్గం	గొర్లె బుచ్చిరాజు	సిమెంటు రేకుల ఓపెన్ షెడ్‌తో సిమెంటు రేకుల రూమ్‌సిమెంటు రేకుల బాత్‌రూమ్ బోర్‌వెల్‌సిమెంటు రేకుల షెడ్
115	45	పట్టా	5-15	24	కూరా అచ్చమ్మ భర్త బుచ్చయ్య	సిమెంటు రేకుల ఇల్లు	కూరా చలపతి రావు	ఖాళీస్థలం	దారి మార్గం	గొర్లె బుచ్చి రాజు	..
116	48	పట్టా	5-22	25	గొర్లె లక్ష్మయ్య తండ్రి దేశయ్య	తాటాకుల ఇల్లు	రోడ్ దారి	మానే రామకృష్ణ	ఖాళీస్థలం	దారి	తాటాకుల పాక సిమెంటు రేకుల బాత్‌రూమ్‌పందిరి
117	48	పట్టా	5-29	26	మానే ముత్తయ్య తండ్రి రామకృష్ణ	తాటాకుల ఇల్లు	దారి	ఖాళీస్థలం	ఖాళీస్థలం	మానే రామకృష్ణ	తాటాకుల పాక సిమెంటు రేకుల బాత్‌రూమ్
118	48	పట్టా	5-28	27	మానే రామకృష్ణ తండ్రి ముత్తయ్య	తాటాకుల ఇల్లు	దారి	ఖాళీస్థలం	ముత్తయ్య	మానే బుచ్చమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పాక
119	48	పట్టా	5-24	28	నాగుల కన్నారావు తండ్రి లేటు చిన్నయ్య	తాటాకుల ఇల్లు	దారి	కాలి బాట	మానే రామకృష్ణ	మానే జోగయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్
120	48	పట్టా	5-23	29	మానే జోగారావు తండ్రి రాజయ్య	తాటాకుల ఇల్లు	దారి	ఖాళీస్థలం	నాగుల కన్నారావు	కూరా భీక్షం	తాటాకుల పాక సిమెంటు రేకుల బాత్‌రూమ్‌పందిరి
121	48	పట్టా	5-25	30	బొగ్గా సీతారామయ్య	సిమెంటు రేకుల ఇల్లు	రోడ్	మానే జోగయ్య	ఖాళీస్థలం	గొర్లె కన్నయ్య	..
122	48	పట్టా	5-31	31	గొర్లె కన్నయ్య	సిమెంటు రేకుల ఇల్లు	దారి	కూరా భీక్షం	గొర్లె రంగమ్మ	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
123	48	పట్టా	5-30	32	గొర్లె రంగమ్మ భర్త దేశయ్య	సిమెంటు రేకుల ఇల్లునిర్మాణంలో ఉన్నది	ఆర్ అండ్ బి రోడ్	పశువుల పాక	ఖాళీస్థలం	ఖాళీస్థలం	..
124	48	పట్టా	5-20	33	కూరా సీతమ్మ భర్త నారాయణ	తాటాకుల ఇల్లు	దారి	ఖాళీస్థలం	మానే జోగయ్య	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల వంటపాక
125	48	పట్టా	5-21	34	కూరా భీక్షం తండ్రి నారాయణ	తాటాకుల ఇల్లు	దారి	ఖాళీస్థలం	కూరా సీతమ్మ	రోడ్	తాటాకుల పాక సిమెంటు రేకుల బాత్‌రూమ్
126				35	బస్ స్టాండ్ (డిజైర్డ్)	ఆర్‌సిసి బిల్డింగ్					..
127				36	కమ్యూనిటీ హాల్	సిమెంటు రేకుల షెడ్					..
128	45	పట్టా		37	చర్చ్(గొర్లె నాగమ్మ భర్త మాలయ్య)	సిమెంటు రేకుల చర్చ్	రోడ్	ఖాళీస్థలం	కమ్యూనిటీ హాల్	ఖాళీస్థలం	..
129	45	పట్టా	5-19	38	మిడియం మల్లయ్య తండ్రి ముత్తయ్య	సిమెంటు రేకుల ఇల్లు	దారి మార్గం	ఖాళీస్థలం	ఖాళీస్థలం	ఉయికా మాలయ్య	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల ఇల్లు తాటాకుల పాక పందిరి
130	45	పట్టా	5-18	39	సార్లంక రమణమ్మ భర్త రంగయ్య	తాటాకుల ఇల్లు	రోడ్	ముట్లె పద్మ	దారిమార్గం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
131	45	పట్టా	5-17	40	ముత్యాల పద్మ భర్త కృష్ణ	నిర్మాణంలో ఉన్న ఇల్లు	రోడ్	మిడియం మాలయ్య	ఖాళీస్థలం	దారి	..
132	45	పట్టా	5-16	41	ఉయికా మల్లయ్య తండ్రి లచ్చయ్య	తాటాకుల ఇల్లు	దారి	ఖాళీస్థలం	మిడియం మాలయ్య	కూరా చలపతి రావు	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పాక
133	45	పట్టా	5-13	42	నాగుల రమణమ్మ భర్త సీతారామయ్య	తాటాకుల ఇల్లు	రోడ్	కూరా చల పతిరావు	దారి	సోలా ప్రదీప్	సిమెంటు రేకుల బాత్‌రూమ్
	రామవరంపాడు గ్రామం										
134	81/1	పట్టా భూమి	5-118	43	పులి బొజ్జి తండ్రి చంద్రయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	పులి దూలయ్య	ఖాళీస్థలం	సిమెంటు రేకుల షెడ్‌సిమెంటు రేకుల బాత్‌రూమ్, బోర్‌వెల్, సిమెంటు రేకుల ఇల్లు
135	71/3	పట్టా భూమి	6-72	44	పులి దూలయ్య తండ్రి మూలయ్య	సిమెంటు రేకుల ఇల్లుతో షెడ్	చర్చ్	రోడ్	ఖాళీస్థలం	పులి బొజ్జి	బోర్‌వెల్‌పై కప్పు లేని బాత్‌రూమ్
136	71/3	పట్టా భూమి		46	పులి దూలయ్య తండ్రి మూలయ్య	చర్చ్	పంట భూమి	రోడ్	పులి కన్నయ్య	ఖాళీస్థలం	సిమెంటు రేకుల ఓపెన్ షెడ్
137	71/3	పట్టా భూమి	6-71	47	పులి కన్నయ్య తండ్రి చంద్రయ్య	సిమెంటు రేకుల ఇల్లు	పంట భూమి	రోడ్	పులి భైరాగి	చర్చ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్, సిమెంటు రేకుల షెడ్
138	71/3	పట్టా భూమి	6-3	48	పులి భైరాగి తండ్రి శంకరు	తాటాకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	ఖాళీస్థలం	పులి న్నయ్య	ధాన్యం పాక, సిమెంటు రేకుల బాత్‌రూమ్
139	71/3	పట్టా భూమి	6-4	49	వారా శ్రీనుబాబు తండ్రి బాబూరావు	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీస్థలం	రోడ్	ఖాళీస్థలం	పులి భైరాగి	సిమెంటు రేకుల బాత్‌రూమ్
140	71/3	పట్టా భూమి	6-5	50	శ్యామల వెంకటేశ్వర్లు తండ్రి పుల్లయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీ స్థలం	సోలా పార్వతమ్మ	శ్యామల శేషారావు	ఖాళీస్థలం	వంటపాక మేకల పాక సిమెంటు రేకుల బాత్‌రూమ్
141	71/1	ప్రభుత్వ భూమి	6-6	51	సోలా పార్వతమ్మ భర్త కొండయ్య	తాటాకుల ఇల్లు	శ్యామల వెంకటేశ్వర్లు	మేకల పాక	శ్యామల జానకమ్మ	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
142	71/1	ప్రభుత్వ భూమి	6-7	52	శ్యామల జానకమ్మ భర్త పుల్లయ్య	తాటాకుల ఇల్లు	శ్యామల వెంకటేశ్వర్లు	రోడ్	శ్యామల శేషారావు	సోలా పార్వతమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పందిరి
143	71/1	ప్రభుత్వ భూమి	6-8	53	మేకల గోపాలరావు తండ్రి సత్యం	పెంకుటిల్లు	శ్యామల శేషారావు	రోడ్	శ్యామల లక్ష్మి	శ్యామల జానకమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్‌మేకల పాక
144	71/1	ప్రభుత్వ భూమి	6-9	54	శ్యామల శేషారావు తండ్రి కన్నయ్య	తాటాకుల ఇల్లు	శ్యామల వెంకటేశ్వర్లు	మేకల గోపాల రావు	ఖాళీస్థలం	శ్యామల జానకమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పందిరి
145	71/1	ప్రభుత్వ భూమి	6-9	55	గోపాల పైడమ్మ భర్త కోటేష్	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	శ్యామల శేషారావు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	..
146	71/1	ప్రభుత్వ భూమి	6-12	56	శ్యామల లక్ష్మమ్మ భర్త ముత్తయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	కుంజా నగేష్	మేకల గోపాల రావు	..
147	71/1	ప్రభుత్వ భూమి	6-10	57	శ్యామల గంగరాజు తండ్రి ముత్తయ్య	సిమెంటు రేకుల ఇల్లు	శ్యామల సంధ్యా రాణి	శ్యామల లక్ష్మమ్మ	ఖాళీస్థలం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
148	71/1	ప్రభుత్వ భూమి	6-11	58	శ్యామల సంధ్యారాణి భర్త లేటు కృష్ణ	తాటాకుల ఇల్లు	ఖాళీస్థలం	శ్యామల గంగరాజు	ఖాళీస్థలం	ఖాళీస్థలం	
149	70/5	పట్టా భూమి	6-13	59	కుంజా నాగేశ్వరరావు తండ్రి ముత్తయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	సరియం కృష్ణ	శ్యామల లక్ష్మమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్ వంటపాకపందిరి
150	70/5	పట్టా భూమి	6-16	60	సరియం కృష్ణ తండ్రి లక్ష్మయ్య	తాటాకుల ఇల్లు	నాగుల సతీష్	రోడ్	స్కూల్	దారి	సిమెంటు రేకుల బాత్‌రూమ్
151	70/5	పట్టా భూమి	6-15	61	నాగుల సతీష్ తండ్రి కన్నారావు	తాటాకుల ఇల్లు	ఖాళీ స్థలం	దారి మార్గం	స్కూల్	ఖాళీ స్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్ వంటపాక
152	70/5	పట్టా భూమి		62	అంగన్‌వాడి రేషన్ షాపు(జి.పి.యస్. స్కూల్)	ఆర్‌సిసి బిల్డింగ్స్-3	ఖాళీ స్థలం	రోడ్	కుంజా రాముడు	సరియం కృష్ణ	సిమెంటు రేకుల షెడ్స్-2
153	70/5	పట్టా భూమి	6-17	63	కుంజా చినరాముడు తండ్రి కన్నయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	ఖాళీస్థలం	స్కూల్	పందిరి సిమెంటు రేకుల బాత్‌రూమ్ వంటపాక పెంకుల షెడ్
154	70/5	పట్టా భూమి	6-23	64	సోగిలొమ్మ శ్రీనివాస్‌రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	మాడి బాబూ రావు	కుంజా రాముడు	సిమెంటు రేకుల షెడ్ సిమెంటు రేకుల రైస్‌మిల్‌బాత్‌రూమ్
155	70/5	పట్టా భూమి	6-24	65	సోలా మల్లిఖార్జునరావు తండ్రి వెంకన్న	సిమెంటు రేకుల ఇల్లు	మానే సునీల్..	రోడ్	దారి మార్గం	సోలా శేషమ్మ	సిమెంటు రేకుల బాత్‌రూమ్
156	70/5	పట్టా భూమి	6-25	66	సోలా శేషమ్మ భర్త వెంకన్న	తాటాకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	మల్లిఖర్జున్	ఖాళీస్థలం	..
157	70/5	పట్టా భూమి	6-31	91	మానే సునీల్ తండ్రి లక్ష్మయ్య	సిమెంటు రేకుల ఇల్లు	మానే వెంకటయ్య	సోలా మల్లి ఖార్జున్	దారి మార్గం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్
158	70/5	పట్టా భూమి	6-26	92	మానే చినవెంకటయ్య తండ్రి పుల్లయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	మానే సునీల్	దారి మార్గం	ఖాళీస్థలం	సిమెంటు రేకుల బాత్‌రూమ్, తాటాకుల ఇల్లు, తాటాకుల పాక
159	70/2	పట్టా భూమి	6-32	93	జిన్ని రంగయ్య తండ్రి లేటు గంగరాజు	సిమెంటు రేకుల ఇల్లు గోడలు లేవు	ఖాళీ స్థలం	దారిమార్గం	జిన్ని నరసింహరావు	దారి మార్గం	సిమెంటు రేకులబాత్‌రూమ్
160	70/2	పట్టా భూమి	6-33	94	జిన్ని నరసింహరావు తండ్రి గంగరాజు	సిమెంటు రేకుల ఇల్లుగోడలు లేవు	ఖాళీ స్థలం	దారిమార్గం	ఖాళీస్థలం	జిన్ని పూలమ్మ	..
161	70/2	పట్టా భూమి	6-30	95	సున్నం చిన్నక్క భర్త బాబూరావు	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	దారి మార్గం	దారి మార్గం	సిమెంటు రేకుల బాత్‌రూమ్ తాటాకుల పాక
162	70/2	పట్టా భూమి	6-36	96	పైడా చంద్రమ్మ తండ్రి సుబ్బయ్య	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	ఖాళీస్థలం	దారి మార్గం	..
163	70/2	పట్టా భూమి	6-34	97	చెంబు నరసింహరావు తండ్రి సత్యం	సిమెంటు రేకుల ఇల్లు	ఖాళీ స్థలం	రోడ్	సోలా రామారావు	ఖాళీస్థలం	తాటాకుల పాక-2 సిమెంటు రేకుల బాత్‌రూమ్
164	70/2	పట్టా భూమి	7-155	98	మానే రామకృష్ణ తండ్రి బాలయ్య	పెంకుటిల్లు	ఖాళీ స్థలం	రోడ్	అల్లి భాస్కరరావు	రోడ్	సిమెంటు రేకుల బాత్‌రూమ్ సిమెంటు రేకుల ఓపెన్ షెడ్
165	75	పట్టా భూమి	..	101	సున్నం వెంకయ్య తండ్రి రామిరెడ్డి	తాటాకుల ఇల్లు	నాగేశ్వరరావు	ఖాళీస్థలం	రోడ్	ఖాళీ స్థలం	తాటాకుల పాక
166	72	పట్టా భూమి	6-114	102	మడకం ఉంగయ్య తండ్రి రామయ్య	తాటాకుల ఇల్లు	ఖాళీ స్థలం	ఖాళీస్థలం	జామాయిల్ తోట	రోడ్	తాటాకుల పాకబాత్‌రూమ్

సం/- సి.వి.ప్రవీణ్ ఆదిత్య, I.A.S., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆదర్శనీయుడు పొట్టిశ్రీరాములు

● ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్



పతాకావిష్కరణలో పాల్గొన్న ఎస్పీ ఎం.దీపిక



మువ్వన్నెల జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

విజయనగరం అర్బన్: ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాడి రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలనే అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో రాష్ట్ర అవతరణ దినోత్సవానికి కూడా అంతే ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవంలో పాల్గొన్నారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, ఇ.రఘురాజు తదితరులతో కలిసి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుతల్లికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

విజయనగరం క్రైమ్: తెలుగు మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమించిన మహనీయుడు పొట్టి శ్రీరాములని ఎస్పీ ఎం.దీపిక కొనియాడారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 56 రోజుల పాటు నిరాటంకంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ఆయన ప్రత్యేక రాష్ట్ర స్థాపనకు తుదిశ్వాస విడిచారన్నారు. ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవశ్యకతను గుర్తించి, కర్నూల్ రాజధానిగా నవంబరు 1, 1953న ఆంధ్రరాష్ట్రాన్ని ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్. మోహనరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి సేవలో ప్రముఖులు



అమ్మవారి శేషవస్త్రాలను, ఫొటోను అందుకుంటున్న రాష్ట్ర ఆడిట్ అధికారి హరిప్రకాష్ దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని రాష్ట్ర ఆడిట్‌శాఖ డైరెక్టర్ హరిప్రకాష్ దంపతులు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారిచేతుల మీదుగా వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం వేదాశీస్సులు, అమ్మవారి శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిటర్ అరుణకుమారి, ఇతర ఆడిట్ అధికారులు, ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

వినియోగదారుడా..మేలుకో..!

● జాతీయ వినియోగదారుల ఫోరం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ ప్రసాదరావు

పార్వతీపురం టౌన్: వస్తువులు కొనుగోలు చేసే ముందు ఒక్కసారి వినియోగదారుడు విజ్ఞతతో ఆలోచించాలని, జాతీయ వినియోగదారుల రక్షణ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు సీహెచ్ ప్రసాదరావులు హితవు పలికారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వినియోగదారుల రక్షణ చట్టం 2019పై పార్వతీపురం మన్యం జిల్లా ఫోరం సభ్యులకు శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యత లేని వస్తువలను వినియోగదారులకు ఇచ్చి మోసం చేసే వ్యాపారుల ఆట మనమే కట్టించాలని సూచించారు. నాణ్యమైన వస్తువులను పొందడమే వినియోగదారుల హక్కు అని ఫోరం సభ్యులు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి వస్తువుకు గడువు ముగింపు తేదీ ఉంటుందని, అలాంటి వాటిని గమనించి వినియోగదారులు కొనుగోలు చేసేలా మనమే అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం వినియోగదారుల ఫోరం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బి.శ్రీనివాసరావు, జె శ్రీనివాసరావులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బోగి శ్రీను, జామి శ్రీను పాల్గొన్నారు.

అప్పు తీర్చలేదని హత్య



హత్యకు గల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మహేంద్ర మత్తే

● వీడిన దేవరాపల్లి హత్య కేసు మిస్టరీ
● రూ.45 వేలు అప్పు తీసుకుని తీర్చకపోవడంతో దుశ్చర్య
● నిందితుడు గణేష్‌ది విజయనగరం జిల్లా

శ్రీకాకుళం క్రైమ్: అతనికి 19 ఏళ్లు. పదో తరగతి కూడా పాసవ్వలేదు. తల్లిదండ్రులు దినసరి కూలీ లు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ రోజుకు రూ.200 తెచ్చుకుని భద్రంగా దాచుకునేవాడు. ఇది తెలిసిన సన్నిహితుడు అప్పు అడగడంతో వడ్డీ వస్తుందనే ఆశతో ఇచ్చాడు. కానీ ఆ సన్నిహితుడు వడ్డీ ఇవ్వకపోగా.. అసలు కూడా ఇవ్వనని తెగేసి చెప్పాడు. ఈ వివాదం ముదిరి ఆ యువకుడు ఏకంగా హత్య చే సేంతవరకు వెళ్లింది. రణస్థలం మండలం దేవరాపల్లిలో గత నెల 28న లభ్యమైన మృతదేహం వెనుక దాగిన కథ ఇది. ఇచ్చిన అప్పు తీర్చడం లేదనే కోపంతో విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలానికి చెందిన యండవ గణేష్, రణస్థలం మండలం దేవరాపల్లికి చెందిన బూర్లె నాగరాజు (35)ను హ త్య చేశాడు. హత్య జరిగిన నాలుగు రోజుల్లోనే పోలీసులు కేసును ఛేదించారు. ఆ వివరాలను శ్రీకాకుళం సబ్ డివిజనల్ డీఎస్పీ మహేంద్ర మత్తే మంగళవారం తెలిపారు. ఆ వివరాల మేరకు..

నిందితుడు గణేష్‌ది విజయనగరం జిల్లా చీపు రుపల్లి మండలం కలిశెట్టిబడి గ్రామం. నాగరాజు అత్తవారి ఊరు కూడా ఇదే కావడంతో ఇద్దరికీ పరిచయం ఏర్పడింది. గణేష్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ బతికేవాడు. ఇతని వద్ద నాగరాజు అప్పుడప్పుడూ డబ్బులు అప్పుగా తీసుకునేవాడు. ఇలా విడతల వారీగా రూ.45 వేలు వరకు తీసుకున్నా డు. వడ్డీ ఇస్తానని చెప్పి డబ్బు తీసుకున్న నాగరాజు నెలన్నర నుంచి వడ్డీ ఇవ్వ లేదు. అసలు కూడా ఇవ్వను పొమ్మంటూ తెగేసిచెప్పాడు. దీంతో గణేష్ కు ఈ మాటలు ఆగ్రహం తెప్పించాయి. ఆ కోపంతోనే నాగరాజును చంపేయాలని పథకం వేశాడు.

తాగుదాం రమ్మని చెప్పి..

నాగరాజుకు తాగుడు అలవాటు ఉండడంతో గత నెల 27న గణేష్ నాగరాజుకు ఫోన్ చేసి పార్టీ చేసుకుందాం.. దేవరాపల్లి ఆంజనేయ స్వామి బొమ్మ వద్దకు రావాలని చెప్పాడు. అంతకంటే ముందుగానే గణేష్ కమ్మసిగడాం సెంటర్‌కు బైక్‌పై వెళ్లి మరొకరి చేత వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేయించాడు. ఆ తర్వాత దేవరాపల్లి ఆంజనేయ బొమ్మ వద్ద నా గరాజును కలిశాడు. అక్కడ నుంచి కొండ వైపు ఉన్న కచ్చారోడ్డుకు తీసుకెళ్లి తాగడం ప్రారంభించారు. ఈ లోపు గణేష్ మూత్రానికి పోయి వస్తానని పక్కకు వెళ్లి అక్కడున్న షెడ్డు నుంచి ఒక బ్లేడు, బలమైన కర్ర తీసుకువచ్చాడు. అప్పు తీర్చమని నాగరాజును డబ్బులు అడిగితే.. మద్యం మత్తులో ఉన్న ఆయన ఇవ్వను పొమ్మన్నాడు. దీంతో గణేష్ పట్టరాని కోపంతో నాగరాజు ఎడమ వైపు ఉన్న చెంప కణితిపై క ర్రతో కొట్టాడు. దీంతో నాగరాజు చెవుల నుంచి రక్తం వచ్చి కేకలు వేయగా గణేష్ వెంటనే నోరు, ముక్కు గట్టిగా మూసేశాడు. నాగరాజులో చలనం లేకపోయినా ఇంకా బతికే ఉన్నాడన్న అనుమానంతో తాను తెచ్చుకున్న బ్లేడుతో కంఠాన్ని కోసేశాడు.

నాలుగు రోజుల్లోనే..

గత నెల 28న రణస్థలం మండలం దేవరాపల్లిలోని కొండవైపు కచ్చా రోడ్డులోని ముళ్లపొదల బయట శవం ఉందన్న సమాచారం స్థానికుల ద్వారా పోలీసులకు తెలిపింది. వెంటనే డీఎస్పీతో పాటు జేఆర్‌పురం సీఐ బీసీహెచ్ స్వామినాయుడు, ఎస్‌ఐ జి.ఆర్.రాజేష్, క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ ఘటనా స్థలికి వెళ్లి ఆ మృతదేహం బూర్లె నాగరాజు (35)దిగా గు ర్తించారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో ఇన్వెస్టిగేషన్ చేశారు. మృతుని అత్తవారి గ్రామం కలిశెట్టిబడి గ్రామమని తెలిసి అక్కడా వాకబు చేశారు. అక్కడే వారికి క్లూ దొరికింది. హత్య చేశాక మృతుని సెల్‌ఫో న్‌ను నిందితుడు తీసుకుపోవడంతో పోలీసుల పని సులువైపోయింది. ఆ సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా దర్యాప్తు చేయగా యండవ గణేష్ దొరికిపోయాడు. అతడిని పట్టుకుని తమదైన శైలిలో విచారించగా ఆ యువకుడు నిజం ఒప్పుకున్నాడు. అతని వద్ద పో లీసులు హీరోహోండా బైక్, రక్తం మరకలు ఉన్న ష ర్టు, కర్ర, బ్లేడు, మృతుని సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి జేఆర్ పురం జుడీషియల్ కోర్టుకు తరలించారు.




వేదికపై అమరజీవి పొట్టిశ్రీరాములు, మహానేత దివంగత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్. వేదికపై ఆశీనులైన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం వైఎస్ జగన్, వైఎస్ విజయమ్మ



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సామాన్యుల్లో అసామాన్యులు వీరే

వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ సత్కారం



గవర్నర్ చేతుల మీదుగా వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును అందుకుంటున్న అంతర్జాతీయ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు. చిత్రంలో సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు



నాగేంద్రనాథ్ (కళా తపస్వి కె.విశ్వనాథ్ తరపున)



ఆర్.నారాయణమూర్తి, సినీ నటుడు, దర్శకుడు



డాక్టర్ కె.వరప్రసాదరెడ్డి (శాంతా బయోటెక్స్ హెపటైటిస్-బి వ్యాక్సిన్)



డాక్టర్ డి.నాగేశ్వర రెడ్డి (ఏఐజీ హాస్పిటల్స్)



డాక్టర్ శాంతి నారాయణ (సాహిత్యం)



సునీతా కృష్ణన్ (ప్రజ్వల ఫౌండేషన్)



సోమేశ్వరరావు (శిరీష రిహాబిలిటేషన్ సెంటర్, ఉయ్యూరు)




అనంత జ్యోతి (రిషి వ్యాలీ ఇన్‌స్టిట్యూషన్, డాక్టర్ మీనాక్షి తపన్ తరపున)



వినయ్ కుమార్ రెడ్డి (జవహర్ భారతి విద్యాసంస్థలు, కావలి)



బీవీ పట్టాభి రామ్ (వ్యక్తిత్వ వికాస నిపుణుడు)



భండారు శ్రీనివాసరావు (జర్నలిజం)



ఎం.సతీష్ చందర్ (జర్నలిజం)




మంగు రాజ గోపాల్ (జర్నలిజం)



ఎంఈవీ ప్రసాద రెడ్డి (జర్నలిజం)



సంగీతా రెడ్డి (సి.ప్రతాపరెడ్డి, అపోలో హాస్పిటల్స్ తరపున)



గుళ్లపల్లి నాగేశ్వరరావు (ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్)



మనోహర్ నాయుడు, విశాలాంధ్ర పబ్లికేషన్స్



ఎమ్మెస్కో విజయ్ కుమార్ (ఎమ్మెస్కో పబ్లిషింగ్ హౌస్)



కృష్ణా ఎల్లా, సుచిత్ర ఎల్లా (భారత్ బయోటెక్) అవార్డు అందుకుంటున్నవారు కృష్ణా ఎల్లా

వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు



సోడెం ముక్కయ్య (ఆదివాసీ జీడిపప్పు రైతుల ఉత్పత్తిదారు కంపెనీ లిమిటెడ్, ఏలూరు జిల్లా)



గోపాలకృష్ణ (కుశలవ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ, అంబేద్కర్ కోనసీమ జిల్లా)



జయబ్బనాయుడు, (అన్నమయ్య మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, తలుపల, అన్నమయ్య జిల్లా)



కేఎల్ఎన్ మౌక్తిక (అమృతఫల ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ, సబ్బవరం, అనకాపల్లి జిల్లా)



గోవర్ధన్ బాబీ (కట్టమంచి బాలకృష్ణారెడ్డి తరఫున, కట్టమంచి గ్రామం, చిత్తూరు జిల్లా)



షేక్ గౌసియా బేగం (దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన ఉదయగిరి ఉడెన్ కట్లరీ)



దస్తగిరిరెడ్డి (బ్యాంకింగ్ రంగం, నంద్యాల)



నాయుడు గోపి (సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు)



పిచుక శ్రీనివాస్ (పెడన కలంకారీ నేతన్న)



దిశ పోలీసింగ్- రవాడ జయంతి, ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ, రాయుడు సుబ్రహ్మణ్యం, హజరత్తయ్య, పి.శ్రీనివాసులు (ఉమ్మడిగా వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు)

మహోన్నత గౌరవం

మొదటి పేజీ తరువాయి

గవర్నర్, ముఖ్యమంత్రి ప్రదానం చేశారు. వీటిల్లో 20 వైఎస్సార్ జీవిత సాఫల్య, 10 వైఎస్సార్ సాఫల్య పురస్కారాలున్నాయి. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా వైఎస్ విజయమ్మ హాజరయ్యారు. వైఎస్సార్ అవార్డులను నెలకొల్పడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం, అవార్డు గ్రహీతల గొప్పతనాన్ని వివరించారు.

పురస్కారం సాధించిన 'దిశ'

వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి వైఎస్సార్ అవార్డులను ప్రదానం చేశారు. వ్యవసాయంలో 5, కళలు- సంస్కృతిలో 5, సాహిత్యంలో 3, మహిళా, శిశు సాధికారతలో 3, విద్యలో 4, జర్నలిజంలో 4, వైద్యంలో 5 అవార్డులు, పరిశ్రమల విభాగంలో ఒక అవార్డును అందజేశారు. వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు కింద రూ.10 లక్షల నగదు, వైఎస్సార్ సాఫల్య అవార్డు కింద రూ.5 లక్షల నగదుతో పాటు వైఎస్సార్ కాంస్య విగ్రహం, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కళలు, సంస్కృతి రంగంలో కళాతపస్వి కె.విశ్వనాథ్ తరపున వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆయన తనయుడు కాశీనాథుని నాగేంద్రనాథ్ అందుకోగా వైద్య రంగంలో ప్రతాప్ సి.రెడ్డి తరఫున వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని ఆయన కుమార్తె సంగీతారెడ్డి స్వీకరించారు. వ్యవసాయంలో వైఎస్సార్ సాఫల్య పురస్కారాన్ని కట్టమంచి బాలకృష్ణారెడ్డి తరఫున ఆయన కుటుంబీకులు అందుకున్నారు. సీఎం మానస పుత్రిక 'దిశ' ద్వారా మహిళా రక్షణకు కృషి చేసిన ఐదుగురు పోలీసులకు ఉమ్మడిగా అవార్డులను బహూకరించారు.

హాజరైన మంత్రులు, ప్రజా ప్రతినిధులు

కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానమ్, హోంమంత్రి తానేటి వనిత, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, తెలుగు, సంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ కార్యక్రమాల కన్వీనర్ తలశిల రఘురాం, ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్), వైఎస్సార్ అవార్డుల కమిటీ కన్వీనర్ జీవీడీ కృష్ణ మోహన్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ, సాధారణ పరిపాలన (రాజకీయ) కార్యదర్శి రేవు ముత్యాలరాజు, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆచరించిన విధానాల స్ఫూర్తితో..

వ్యక్తులుగా, సంస్థలుగా సమాజంలో గొప్ప పనులు చేస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తోడుగా నిలుస్తుంది. అందుకు సంకేతంగానే ఏటా నాన్న (దివంగత వైఎస్సార్) పేరుతో ఈ అవార్డులను అందజేస్తున్నాం. సీఎంగా ఉన్న 5.3 ఏళ్ల స్వల్ప కాలంలోనే వైఎస్సార్ ఆచరించి చూపిన రైతు, మహిళా, నిరుపేద పక్షపాత విధానాలు, సామాజిక, ప్రాంతీయ న్యాయం, వైద్య రంగంలో తెచ్చిన విప్లవాత్మక మార్పులు, మనదైన తెలుగుతనం, మన కళలు, సాంప్రదాయాలు, శ్రమ, పరిశ్రమకు నిదర్శనంగా ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నాం. ఈ రోజు అత్యంత ప్రతిష్టాత్మకమైన వైఎస్సార్ అవార్డులు అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వకంగా అభినందనలు తెలియచేస్తున్నా.

మహోన్నత వ్యక్తి వైఎస్సార్: గవర్నర్

సామాజిక సేవా స్ఫూర్తితో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్సార్' అవార్డులతో సత్కరించడం సంతోషంగా ఉందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు, వారి సమస్యలను దగ్గరగా చూసి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పలు ప్రజా సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో తెచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా అవార్డులతో గౌరవించడం సముచితంగా ఉందన్నారు. రాష్ట్రం గొప్ప కళలు, సంస్కృతి, ఆధ్యాత్మికతకు నిలయంగా వెలుగొందుతోందన్నారు. ఎందరో మహనీయుల త్యాగఫలాలతో ఏర్పడిన రాష్ట్రంలో సామాజిక స్పృహతో నిరంతరం సేవలందిస్తూ మన ఖ్యాతిని చాటిన వారిని అవార్డులకు ఎంపిక చేయడం మంచి సాంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు సీఎం జగన్ రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధికి చిరునామాగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

మన కీర్తికి సత్కారం: సీఎం జగన్

దశాబ్దాలుగా మన సంస్కృతి, సాంప్రదాయాలకు వారధులుగా నిలుస్తున్న వారిని ఈ అవార్డులతో సత్కరిస్తున్నాం. సమాజం కోసం శ్రమించిన మానవతామూర్తులు, మహనీయులను రాష్ట్ర అత్యున్నత అవార్డులతో సత్కరించుకోవడం సంతోషంగా ఉంది. సామాన్యుల్లోని అసామాన్యులకు, మానవతామూర్తుల సేవలకు వందనంగా 'వైఎస్సార్' అవార్డులు నిలుస్తాయి. తమ శ్రమ, స్వేదంతో రాష్ట్ర చరిత్రను గొప్పగా లిఖిస్తున్న రైతన్నలను ఎక్కడా లేనివిధంగా ప్రతిష్టాత్మక 'వైఎస్సార్' అవార్డులతో ప్రభుత్వం సత్కరిస్తోంది. మహిళా రక్షణకు నిరంతరం పాటుపడే రక్షణ సారథులను, వెనుకబాటు, అణచివేత, పెత్తందారీ పోకడలపై ఎలుగెత్తిన సామాజిక ఉద్యమకారులను సవినయంగా గౌరవించుకుంటున్నాం. భిన్న కలాలు, గళాలు, పాత్రికేయులు, మన గడ్డపై పుట్టి వైద్య ఆరోగ్య రంగంలో ప్రపంచ కీర్తి గడించిన మహామహులు, అంతర్జాతీయంగా పేరొందిన మన పారిశ్రామిక దిగ్గజాలకు అవార్డులను అందజేస్తున్నాం.

రంగాల వారీగా అవార్డులు ప్రదానం ఇలా..

వ్యవసాయం (అందరికీ వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు

1. ఆదివాసీ క్యాష్యూనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ – సోడెం ముక్కయ్య – బుట్టాయగూడెం, ఏలూరు జిల్లా
2. కుశలవ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ – ఎ.గోపాలకృష్ణ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
3. అన్నమయ్య మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ – జయబ్బ నాయుడు, తలుపల గ్రామం, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లా
4. అమృతఫల ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ, – కె.ఎల్.ఎన్.మౌక్తిక, సబ్బవరం, అనకాపల్లి జిల్లా
5. కట్టమంచి బాలకృష్ణారెడ్డి, కట్టమంచి గ్రామం, చిత్తూరు జిల్లా

కళలు-సంస్కృతి

1. కళాతపస్వి కె.విశ్వనాథ్, సినీ దర్శకుడు (లైఫ్ టైం)
2. ఆర్.నారాయణమూర్తి, సినీ నటుడు, దర్శకుడు (లైఫ్ టైం)
3. నాయుడు గోపి సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు (అచీవ్‌మెంట్)
4. పెడన కలంకారీ నేతన్న పిచుక శ్రీనివాస్ (అచీవ్‌మెంట్)
5. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన ఉదయగిరి ఉడెన్ కట్లరీ – షేక్ గౌసియా బేగం (అచీవ్‌మెంట్)

సాహిత్య సేవ (అందరికీ లైఫ్ టైం అవార్డులు

1. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ (మనోహర్ నాయుడు అవార్డు అందుకున్నారు)
2. ఎమెస్కో పబ్లిషింగ్ హౌస్ – సంస్థ సీఈవో విజయకుమార్ అవార్డును అందుకున్నారు
3. రాయలసీమ ప్రసిద్ధ రచయిత డాక్టర్ శాంతి నారాయణ

మహిళా సాధికారత-రక్షణ

1. ప్రజ్వల ఫౌండేషన్– సునీతా కృష్ణన్ (లైఫ్ టైం)
2. శిరీషా రిహాబిలిటేషన్ సెంటర్, ఉయ్యూరు – ఎం.సోమేశ్వరరావు అవార్డును అందుకున్నారు (లైఫ్ టైం)
3. దిశ పోలీసింగ్– రవాడ జయంతి, ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ, రాయుడు సుబ్రహ్మణ్యం, హజరత్తయ్య, పి.శ్రీనివాసులు (ఉమ్మడిగా వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు)

విద్యా రంగం

1. మదనపల్లి – రిషీ వ్యాలీ విద్యా సంస్థ – అనంత జ్యోతి అవార్డును అందుకున్నారు (లైఫ్ టైం)
2. కావలి– జవహర్ భారతి విద్యా సంస్థ – వినయ్‌కుమార్‌రెడ్డి అవార్డును అందుకున్నారు (లైఫ్ టైం)
3. వ్యక్తిత్వ వికాస నిపుణుడు బి.వి.పట్టాభిరాం (లైఫ్ టైం)
4. బ్యాంకింగ్ రంగంలో వేలాది మందికి దారి చూపిన నంద్యాలకు చెందిన దస్తగిరిరెడ్డి (అచీవ్‌మెంట్)

జర్నలిజం (అందరికీ లైఫ్‌టైం అచీవ్‌మెంట్)

1. భండారు శ్రీనివాసరావు
2. సతీష్ చందర్
3. మంగు రాజగోపాల్
4. ఎంఈవీ ప్రసాదరెడ్డి

వైద్య రంగం (అందరికీ లైఫ్ టైం అచీవ్‌మెంట్)

1. డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ
2. డాక్టర్ వరప్రసాదరెడ్డి, శాంతా బయోటెక్ (హెపటైటిస్–బి వ్యాక్సిన్)
3. భారత్ బయోటెక్ డాక్టర్ కృష్ణా ఎల్లా, సుచిత్ర ఎల్లా (కోవ్యాగ్జిన్) (కృష్ణా ఎల్లా అవార్డు అందుకున్నారు)
4. అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి (ఆయన తరపున కుమార్తె సంగీతా అవార్డు అందుకున్నారు)
5. ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ – గుళ్లపల్లి నాగేశ్వరరావు

పారిశ్రామిక రంగం

అంతర్జాతీయ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు (లైఫ్ టైం)

ఫొటో జర్నలిస్టులకు పురస్కారాలు




అవార్డులు అందుకుంటున్న వి.రూబెన్, సతీష్

కృష్ణలంక (విజయవాడ తూర్పు): విజయవాడ గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రం–బాలోత్సవం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపీసీ), ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన ఫొటో జర్నలిస్టులను అవార్డులతో ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సత్కరించారు. ఈ ఏడాది జీవన సాఫల్య పురస్కారాన్ని సీనియర్ ఫొటో జర్నలిస్ట్ ఎం.రవీంద్రనాథ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ చీఫ్ ఫొటోగ్రాఫర్ రావూరి కోటేశ్వరరావుకు అందజేశారు. సి.రాఘవాచార్యులు అవార్డును సాక్షి అసిస్టెంట్ చీఫ్ ఫొటోగ్రాఫర్ వి.రూబెన్, ఎంఏ రహీమ్ స్మారక పురస్కారాన్ని ఏపీ సీఎం ఫొటోగ్రాఫర్ ఎ.సతీష్, నీలంరాజు మురళీధర్ స్మారక పురస్కారాన్ని హిందూ చీఫ్ ఫొటోగ్రాఫర్ కేఆర్ దీపక్, జి.కృష్ణ పురస్కారాన్ని ఈనాడు స్టాఫ్ ఫొటోగ్రాఫర్ పి.సింహాచలం, మండలి వెంకట కృష్ణారావు పురస్కారాన్ని హిందూ మాజీ చీఫ్ ఫొటోగ్రాఫర్ విజయభాస్కరరావులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన ఆకట్టుకుంది.



రెండో ర్యాంకర్ జబర్‌పై సబలెంకా పైచేయి

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ ఏడో ర్యాంకర్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. టెక్సాస్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో 'ట్రేసీ ఆస్టిన్' గ్రూప్ తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 3-6, 7-6 (7/5), 7-5తో రెండో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యూనిసియా)పై సంచలన విజయం సాధించింది. మరో లీగ్ మ్యాచ్‌లో ఐదో ర్యాంకర్ మరియా సాకరి (గ్రీస్) 7-6 (8/6), 7-6 (7/4)తో జెస్సికా పెగూలా (అమెరికా)పై గెలిచింది. ఈ టోర్నీలో టాప్-8 ర్యాంకర్లు పాల్గొంటున్నారు.

తొలి రౌండ్‌లోనే లక్ష్య సేన్ ఓటమి

హైలో ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగం నుంచి భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. జర్మనీలో మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 8వ ర్యాంకర్ లక్ష్య సేన్ 12-21, 5-21తో ప్రపంచ 15వ ర్యాంకర్ ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయాడు. భారత్‌కే చెందిన స్టార్ ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, సమీర్ వర్మ, సైనా నెహ్వాల్ తమ తొలి రౌండ్ మ్యాచ్‌లను నేడు ఆడనున్నారు.



గిల్ మెరుపు సెంచరీ

సెమీస్‌లో పంజాబ్ • ముస్తాక్ అలీ టోర్నీ



కోల్‌కతా: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో పంజాబ్ 9 పరుగుల తేడాతో కర్ణాటకపై గెలిచింది. ముందుగా పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 225 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (55 బంతుల్లో 126; 11 ఫోర్లు, 9 సిక్సర్లు) మెరుపు సెంచరీ సాధించడం విశేషం. అనంతరం చివరి వరకు పోరాడిన కర్ణాటక 20 ఓవర్లలో 6 వికెట్లకు 216 పరుగులు చేసి ఓడింది.

విదర్భ, హిమాచల్, ముంబై కూడా...

ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో విదర్భ (157/5) పరుగు తేడాతో ఢిల్లీ (156/6)పై, హిమాచల్ ప్రదేశ్ (200/6) నాలుగు వికెట్ల తేడాతో బెంగాల్ (199/6)పై, ముంబై (168/8) రెండు వికెట్ల తేడాతో సౌరాష్ట్ర (166/8)పై విజయం సాధించి సెమీఫైనల్లోకి ప్రవేశించాయి.

స్పర్శ్ శుభారంభం



అమ్మాన్ (జోర్డాన్): ఆసియా ఎలైట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల 51 కేజీల విభాగంలో భారత బాక్సర్ స్పర్శ్ కుమార్ శుభారంభం చేశాడు. నుర్జిగిత్ (కిర్గిస్తాన్)తో జరిగిన తొలి రౌండ్ బౌట్‌లో స్పర్శ్ 5-0తో గెలిచాడు. హుసాముద్దీన్ (57 కేజీలు), శివ థాపా (63.5 కేజీలు), అనంత (54 కేజీలు), ఎతాష్ ఖాన్ (60 కేజీలు), అమిత్ (67 కేజీలు), సచిన్ (71 కేజీలు), లక్ష్య (80 కేజీలు), కపిల్ (86 కేజీలు)లకు నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు... గోవింద్ (48 కేజీలు), సుమిత్ (75 కేజీలు), నవీన్ (92 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు)లకు క్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.

ఆంధ్ర పరాజయం

చెన్నై: బీసీసీఐ సీనియర్ మహిళల టి20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు పోరాటం ముగిసింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హిమాచల్ ప్రదేశ్ జట్టు ఏడు వికెట్ల తేడాతో ఆంధ్ర జట్టుపై గెలిచి సెమీఫైనల్ చేరింది. ముందుగా ఆంధ్ర ఏడు వికెట్లకు 114 పరుగులు సాధించింది. పుష్పలత (35; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. అనంతరం హిమాచల్‌ప్రదేశ్ 19.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది.

సెమీఫైనల్ లక్ష్యంగా!

సాధారణంగా అయితే బంగ్లాదేశ్‌తో భారత్ మ్యాచ్ అంటే ఎలాంటి విశ్లేషణలు లేకుండా మనదే గెలుపు ఖాయమని అందరిలో నమ్మకం. అయితే కొంత కాలంగా బంగ్లాతో మ్యాచ్‌లు కూడా ఒక్కసారిగా ఆసక్తికరంగా మారిపోతున్నాయి. తుది ఫలితం టీమిండియాకు అనుకూలంగా వచ్చినా... మ్యాచ్‌లో వేర్వేరు దశల్లో బంగ్లా అనూహ్యంగా చెలరేగి మన జట్టును ఇబ్బంది పెడుతోంది. పాక్‌తో మ్యాచ్ తరహాలో అభిమానులు కూడా అదనంగా కొన్నిసార్లు తమ భావోద్వేగాలు ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో టి20 ప్రపంచకప్‌లో ఇరు జట్ల మధ్య మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ సెమీస్ చేరడం దాదాపు ఖాయం కానుండగా, తమకంటే చిన్న జట్లపై రెండు విజయాలు సాధించిన బంగ్లాదేశ్ సంచలనాన్ని ఆశిస్తోంది.

- నేడు బంగ్లాదేశ్‌తో కీలక పోరుకు భారత్ సిద్ధం
- గెలిస్తే సెమీస్ బెర్త్ దాదాపు ఖాయం
- సంచలనంపై బంగ్లా దృష్టి

మ. గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం



కేఎల్ రాహుల్, కోహ్లి

అడిలైడ్: గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన పరాజయాన్ని మరచి కొత్త ఉత్సాహంతో మరో పోరుకు భారత్ సన్నద్ధమైంది. సఫారీలను ఓడించి ఉంటే ఇప్పటికే మన సెమీస్ అవకాశాలపై మరింత స్పష్టత వచ్చేది. అయితే పెర్త్ పిచ్ అలాంటి అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు గ్రూప్-2లో బలహీన జట్లలో ఒకటైన బంగ్లాదేశ్‌ను నేడు రోహిత్ సేన ఎదుర్కొంటోంది. బలాబలాలు, ఫామ్‌ను బట్టి చూస్తే భారత్ సహజంగానే ఫేవరెట్ కాగా, అలసత్వం దరి చేరనీయకుండా ఆడాల్సి ఉంటుంది. తమ స్థాయిని బట్టి చూస్తే టోర్నీలో ఇప్పటికే సంతృప్తికర ప్రదర్శన ఇచ్చిన బంగ్లా ఈ మ్యాచ్‌లో ఎలాంటి పోటీనిస్తుందనేది ఆసక్తికరం.

పంత్‌కు చాన్స్!

వరల్డ్‌కప్‌లో ఇప్పటి వరకు కోహ్లి, సూర్యకుమార్ రెండు అద్భుత ఇన్నింగ్స్‌లతో అభిమానులను ఆనందపరిచారు. రోహిత్ కూడా నెదర్లాండ్స్‌పై అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అయితే టోర్నీలో ఇప్పటికీ తనేంటో కేఎల్ రాహుల్ నిరూపించుకోలేకపోయాడు. వరుసగా మూడు మ్యాచ్‌లలో అతను 4, 9, 9 చొప్పున పరుగులు చేశాడు. అయితే రాహుల్ విలువేంటో తమకు తెలుసని, జట్టులోంచి అతడిని తప్పించే అవకాశమే లేదని కోచ్ ద్రవిడ్ ఖరాఖండీగా చెప్పేశాడు కాబట్టి స్థానంపై ఎలాంటి సందేహాలు లేవు. కీపర్ దినేశ్ కార్తీక్ గాయం విషయంలో ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కార్తీక్‌కు ఆడించడంకంటే అవకాశం కోసం ఎదురు చూస్తున్న పంత్‌కు అవకాశం ఇవ్వడమే సరైన నిర్ణయం కావచ్చు. బౌలింగ్‌లో ముగ్గురు రెగ్యులర్ పేసర్లకు తోడు స్పిన్నర్‌గా అశ్విన్‌నే కొనసాగిస్తారా చూడాలి. బంగ్లా లైనప్‌లో నలుగురు ఎడంచేతివాటం బ్యాటర్లు ఉండటంతో అశ్విన్ సరైనోడు కావచ్చు.

పిచ్, వాతావరణం

అడిలైడ్ ఓవల్ మైదానం మొదటి నుంచీ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. భారీ స్కోర్లకు అవకాశం ఉంది. అయితే వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించవచ్చు.

బౌలింగ్‌పైనే ఆశలు...

లీగ్ దశలో జింబాబ్వే, నెదర్లాండ్స్‌లపై స్వల్ప తేడాలతో నెగ్గిన బంగ్లాదేశ్ జట్టుకు ఆ రెండు విజయాలు బౌలింగ్ కారణంగానే వచ్చాయి. ముఖ్యంగా పేసర్ తస్కీన్ అహ్మద్ జట్టు భారం మోస్తున్నాడు. ముస్తఫిజుర్ మళ్లీ ఫామ్‌లోకి రావడం సానుకూలాంశం. హసన్ మహమూద్ కూడా కీలక పేసర్. ఆఫ్ స్పిన్నర్ మొసద్దిక్ కూడా ప్రభావం చూపగలడు. అయితే వీరంతా కూడా బలమైన భారత బ్యాటింగ్‌ను నిలువరించడం అంత సులువు కాదు. బ్యాటింగ్‌లోనైతే జట్టు బలహీనంగా కనిపిస్తోంది. నజ్ముల్, లిటన్, సర్కార్, అఫీఫ్‌లు ఏమాత్రం రాణిస్తారనేదానిపైనే జట్టు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.



అప్పుడు ఏం జరిగిందంటే...

టి20ల్లో భారత్, బంగ్లాదేశ్ మధ్య 11 మ్యాచ్‌లు జరగ్గా, 10 భారత్ గెలిచింది. వరల్డ్‌కప్‌లో 2016లో ఆఖరిసారిగా ఇరు జట్లు తలపడ్డాయి. అద్భుతంగా సాగిన ఈ మ్యాచ్‌లో పరుగు తేడాతో భారత్ నెగ్గింది. 5 బంతుల్లో 10 పరుగులు చేయాల్సిన బంగ్లా వరుసగా 2 ఫోర్లు కొట్టి సంబరాలు చేసుకోగా, తర్వాతి 3 బంతుల్లో భారత్ ఒక్క పరుగూ ఇవ్వకుండా 3 వికెట్లు తీయడాన్ని అభిమానులు మరచిపోలేరు.

అన్నింటికి మించి కెప్టెన్ షకీబ్ ఫామ్‌లో లేకపోవడమే ఇబ్బందిగా మారింది. పైగా 'మేం వరల్డ్ కప్ గెలవడానికి రాలేదు' అంటూ అతను వ్యాఖ్యానించడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీసేవే.

చెలరేగిన బట్లర్, హేల్స్

న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ విజయం



బ్రిస్బేన్: ఇంగ్లండ్ ఓపెనర్లు జోస్ బట్లర్ (47 బంతుల్లో 73; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), అలెక్స్ హేల్స్ (40 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్) ఫామ్‌లోకి రావడంతో టి20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌కు తొలి ఓటమి ఎదురైంది. ఇంగ్లండ్ జట్టు 20 పరుగుల తేడాతో కివీస్‌పై నెగ్గి గ్రూప్-1లో సెమీఫైనల్ రేసును ఆసక్తికరంగా మార్చింది. తాజా ఫలితంతో ఐదు జట్లకూ సెమీఫైనల్ చేరే అవకాశాలు మిగిలి ఉన్నాయి. కివీస్‌తో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బట్లర్, హేల్స్ తొలి వికెట్‌కు 81 పరుగులు జోడించారు. తర్వాత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులే చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (36 బంతుల్లో 62; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), కెప్టెన్ విలియమ్సన్ (40 బంతుల్లో 40; 3 ఫోర్లు) రాణించారు. స్యామ్ కరన్ (2/26) కివీస్‌ను దెబ్బతీశాడు.

లంక విజయఢంకా

ఇదే గ్రూప్‌లో ముందుగా జరిగిన పోరులో శ్రీలంక ఆరు వికెట్ల తేడాతో అఫ్గానిస్తాన్‌ను ఓడించింది. తొలుత అఫ్గాన్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. గుర్బాజ్ (24 బంతుల్లో 28; 2 ఫోర్లు, 2 సిక్సర్లు), ఉస్మాన్ (27 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్), జద్రాన్ (18 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హసరంగ (3/13) తిప్పేయగా, లహిరు 2 వికెట్లు తీశాడు. తర్వాత లంక 18.3 ఓవర్లలో 4 వికెట్లను కోల్పోయి 148 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు కుశాల్ (25; 2 ఫోర్లు, 1 సిక్స్), నిసాంక (10) తక్కువ స్కోర్లే చేసినా... ధనంజయ (42 బంతుల్లో 66 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) గెలిపించే ఇన్నింగ్స్ ఆడాడు.

ఆఖరి మ్యాచ్ అందరికీ కీలకం...

- గ్రూప్-1లో అఫ్గానిస్తాన్ (2 పాయింట్లు) కథ ముగిసింది. కానీ రెండు సెమీస్ బెర్త్‌ల కోసం ఐదు జట్లు న్యూజిలాండ్ (5 పాయింట్లు), ఇంగ్లండ్ (5 పాయింట్లు), ఆస్ట్రేలియా (5 పాయింట్లు), శ్రీలంక (4 పాయింట్లు), ఐర్లాండ్ (3 పాయింట్లు) రేసులోనే ఉన్నాయి.
- అన్నీ జట్లకు ఆఖరి పోరే మిగిలుంది. అంటే మూడు మ్యాచ్‌లతో రెండు జట్లు ముందంజ వేస్తాయి.
- ఈనెల 4న జరిగే మ్యాచ్‌ల్లో ఐర్లాండ్‌పై న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్‌పై ఆసీస్ గెలిస్తే 7 పాయింట్లతో ముందంజలో ఉంటాయి. కానీ సెమీస్ బెర్త్ ఖరారైతే కాదు.
- అప్పుడు 5న శ్రీలంక, ఇంగ్లండ్ మ్యాచ్ కీలకమవుతుంది. ఒకవేళ ఇంగ్లండ్‌ను శ్రీలంక ఓడిస్తే ఈ రెండు జట్లూ నిష్క్రమిస్తాయి. 7 పాయింట్లతో కివీస్, ఆసీస్ సెమీస్ చేరుతాయి. శ్రీలంకపై ఇంగ్లండ్ గెలిస్తే మాత్రం న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ 7 పాయింట్లతో సమంగా నిలుస్తాయి. మెరుగైన రన్‌రేట్ ఉన్న రెండు జట్లు సెమీఫైనల్ చేరుకుంటాయి.
- ఒకవేళ కివీస్‌పై ఐర్లాండ్ గెలిచి... అఫ్గానిస్తాన్ చేతిలో ఆస్ట్రేలియా ఓడిపోతే... కివీస్, ఆసీస్, ఐర్లాండ్ 5 పాయింట్లతో సమంగా నిలుస్తాయి. అప్పుడు ఇంగ్లండ్‌పై శ్రీలంక కూడా గెలిస్తే శ్రీలంక 6 పాయింట్లతో సెమీఫైనల్ చేరుతుంది. న్యూజిలాండ్, ఇంగ్లండ్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా 5 పాయింట్లతో సమంగా నిలుస్తాయి. ఈ నాలుగు జట్లలో మెరుగైన రన్‌రేట్ ఉన్న ఒక జట్టు సెమీఫైనల్ చేరుతుంది. ఐర్లాండ్, ఆసీస్, ఇంగ్లండ్‌లతో న్యూజిలాండ్ రన్‌రేట్ బాగుండటంతో ఆ జట్టు సెమీస్ చేరే చాన్స్ ఉంది.

టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

గ్రూప్-1

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
న్యూజిలాండ్	4	2	1	1	5	2.233
ఇంగ్లండ్	4	2	1	1	5	0.547
ఆస్ట్రేలియా	4	2	1	1	5	-0.304
శ్రీలంక	4	2	2	0	4	-0.457
ఐర్లాండ్	4	1	2	1	3	-1.544
అఫ్గానిస్తాన్	4	0	2	2	2	-0.718

గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
దక్షిణాఫ్రికా	3	2	0	1	5	2.772
భారత్	3	2	1	0	4	0.844
బంగ్లాదేశ్	3	2	1	0	4	-1.533
జింబాబ్వే	3	1	1	1	3	-0.050
పాకిస్తాన్	3	1	2	0	2	0.765
నెదర్లాండ్స్	3	0	3	0	0	-1.948

నోట్: మ్యా-మ్యాచ్‌లు, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

జింబాబ్వే X నెదర్లాండ్స్ (ఉ.గం. 9:30 నుంచి)
భారత్ X బంగ్లాదేశ్ (మ.గం. 1:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

తండ్రి యాక్షన్.. తనయ డైరెక్షన్



• ఐశ్వర్య, రజనీకాంత్

రజనీకాంత్‌తో '2.0',(2018) 'దర్బార్' (2020) వంటి చిత్రాలు తీసిన కోలీవుడ్ బడా నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ రజనీతో మళ్లీ రెండు సినిమాలు కమిటైన సంగతి తెలిసిందే. ఈ చిత్రాల పూజా కార్యక్రమాలు ఈ నెల 5న చెన్నైలో జరగనున్నాయి. రజనీ కెరీర్‌లో 170, 171వ చిత్రాలుగా రూపొందనున్న ఈ సినిమాల దర్శకుల విషయంలో ఇంకా క్లారిటీ లేదు. సిబి చక్రవర్తి, దేసింగు పెరియస్వామి పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా రజనీకాంత్ కుమార్తె, దర్శకురాలు ఐశ్వర్యా రజనీకాంత్ పేరు తెరపైకి వచ్చింది. రజనీకాంత్ 170వ సినిమాకు ఐశ్వర్య దర్శకత్వం వహించనున్నారని కోలీవుడ్ టాక్. కాగా ఐశ్వర్య ఇప్పటికే '3'(2012), 'వేయ్ రాజా వేయ్'(2015) చిత్రాలను డైరెక్ట్ చేశారు. ఇక తన రెండో కుమార్తె సౌందర్య దర్శకత్వంలో రజనీకాంత్ 'కోచ్చడయాన్' (2014) అనే సినిమా చేశారు.

ఫైట్స్ రియల్‌గా ఉండాలి

\- యానిక్ బెన్



• యానిక్ బెన్, సమంత

"సమంత అంకితభావంతో పనిచేస్తారు. ప్రతిసారి తన బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తారు" అని యాక్షన్ కొరియోగ్రాఫర్ యానిక్ బెన్ అన్నారు. సమంత టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'యశోద'. హరి, హరీష్ దర్శకత్వం వహించారు. శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. కాగా మంగళవారం 'యశోద' యాక్షన్ సీన్స్ మేకింగ్ వీడియోని విడుదల చేశారు. ఈ సినిమాకి పనిచేసిన యాక్షన్ కొరియోగ్రాఫర్లలో ఒకరైన యానిక్ బెన్ మాట్లాడుతూ– "ద ఫ్యామిలీ మేన్ 2' వెబ్ సిరీస్ తర్వాత సమంతతో నా రెండో ప్రాజెక్ట్ 'యశోద'. ఫైట్స్ ఎప్పుడూ రియల్‌గా ఉండటం నాకు ఇష్టం. 'యశోద'లో స్టంట్స్ కూడా రియల్‌గా ఉంటాయి. కిక్ బాక్సింగ్, జూడో, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఇందులో ఉంటాయి. సమంతతో పనిచేయడం బాగుంటుంది" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: ఎం.సుకుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: రవికుమార్ జీపీ, రాజా సెంథిల్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, సహ నిర్మాత: చింతా గోపాలకృష్ణారెడ్డి.

రంభకి త్రుటిలో తప్పిన ముప్పు



• ప్రమాదానికి గురైన కారు



• హాస్పిటల్‌లో రంభ కూతురు సాషా

ప్రముఖ నటి రంభ అమెరికాలో కారు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో రంభ కుమార్తెకి గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని రంభ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. నటిగా మంచి స్థాయిలో ఉండగానే కెనడాకు చెందిన ఇంద్ర కుమార్ పద్మనాభన్ అనే వ్యాపారవేత్తను పెళ్లి చేసుకున్నారు రంభ. వీరికి ముగ్గురు పిల్లలు. తన కుటుంబంతో కలిసి ఆమె అమెరికాలో నివసిస్తున్నారు. సోమవారం సాయంత్రం స్కూలు నుంచి పిల్లలను కారులో తీసుకొస్తుండగా వెనుక నుంచి వేరే కారు ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అయితే రంభ స్వల్ప గాయాలతో బయటపడగా, ఆమె కూతురు సాషాకు గాయాలవడంతో హాస్పిటల్‌లో చేర్పించారు. 'నా కూతురు ప్రమాదానికి గురై చికిత్స పొందుతోంది.. మా కుటుంబం కోసం అందరూ ప్రార్థించండి' అని రంభ కోరారు.

\- చెన్నై ప్రతినిధి



• హన్సిక

పెళ్లికి వేళాయె

హీరోయిన్ హన్సిక పెళ్లికి వేళయింది. వ్యాపార భాగస్వామి సోహైల్ కతురియాని జీవిత భాగస్వామిగా ఎంచుకున్నారామె. దక్షిణాదిలో యాభైకిపైగా సినిమాలు చేసి పాపులర్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్నారు హన్సిక. ముంబైకి చెందిన వ్యాపారవేత్త సోహైల్ కతురియాతో ఆమె ఏడడుగులు వేయనున్నారు. రెండు సంవత్సరాలుగా సోహైల్, హన్సికలు సంయుక్తంగా ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని రన్ చేస్తున్నారు. ఇక్కడే వీరిద్దరి స్నేహం ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ డిసెంబరు 4న జైపూర్‌లో జరగనుందని సమాచారం. కేవలం సన్నిహితులు, బంధువులు మాత్రమే ఈ వేడుకలో పాల్గొనేలా పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయట. పెళ్లి డిసెంబరు 4న జరగనున్నప్పటికీ హల్దీ ఫంక్షన్, సంగీత్ ఫంక్షన్‌ల జోష్ డిసెంబరు 2 నుంచే స్టార్ట్ కానుంది.

ఆ హీరోలకు థ్యాంక్స్



• యోగ్ రాజ్ సింగ్

హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబోలో 1996లో వచ్చిన 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమా అద్భుత విజయం సాధించింది. దాదాపు 26 సంవత్సరాల తర్వాత మళ్లీ కమల్–శంకర్ కాంబినేషన్‌లోనే 'ఇండియన్'కు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఇండియన్ మాజీ క్రికెటర్ యువరాజ్‌సింగ్ తండ్రి, యాక్టర్ యోగ్‌రాజ్ సింగ్ ఓ కీ రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నైలో జరుగుతున్న ఈ చిత్రం షూటింగ్‌లో యోగ్‌రాజ్ పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా మేకప్ వేసుకుంటున్న ఫొటోని ఆయన షేర్ చేసి.. "సినిమాల కోసం కెమెరా వెనుక పనిచేస్తున్న అందరు హీరోలకు థ్యాంక్స్. నా మేకప్‌మేన్ నన్ను మరింత స్మార్ట్‌గా చేస్తున్నారు. లెజెండ్ కమల్‌హాసన్‌గారితో 'ఇండియన్ 2' షూట్‌లో పాల్గొంటున్నాను' అని పేర్కొన్నారు.

ప్రేమ.. భావోద్వేగం



• రీతూ వర్మ, అశోక్, శివాత్మిక

అశోక్ సెల్వన్ హీరోగా నటించిన తెలుగు, తమిళ చిత్రం 'ఆకాశం' (తమిళంలో 'నీదాం ఒరు వానమ్'). ఈ చిత్రంలో రీతూ వర్మ, అపర్ణ బాలమురళి, శివాత్మికా రాజశేఖర్ హీరోయిన్స్‌గా నటించారు. ఆర్.ఎ. కార్తీక్ దర్శకత్వంలో వయాకామ్ 18, రైజ్ ఈస్ట్ బ్యానర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అశోక్ సెల్వన్ మాట్లాడుతూ– "నిన్నిలా నిన్నిలా' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పుడు ఆదరించారు. ఇప్పుడు 'ఆకాశం'తో వస్తున్నాను" అన్నారు. "లవ్ అండ్ ఎమోషన్స్ ఉన్న ఫీల్‌గుడ్ మూవీ ఇది" అన్నారు కార్తీక్. రీతూవర్మ, శివాత్మిక, నిర్మాత సాగర్ మాట్లాడారు.

గ్యాంగ్ వార్ నేపథ్యంలో...



• మయూఖి, వాసుకీ

మేనకోడలి కోసం మేనమామ చేసే సాహసాలు, గ్యాంగ్ వార్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'మయూఖి'. ఏఎల్ నితిన్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వాసుకీ, మయూఖి, రోని నటించారు. టీఐఎం గ్లోబల్ ఫిల్మ్స్ సమర్పణలో నంద కిషోర్, డి.టెరెన్స్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో ఓటీటీలో విడుదల కానుంది. ఈ సినిమా పోస్టర్‌ను 'డీజే టిల్లు' ఫేమ్ దర్శకుడు విమల్ కృష్ణ, రచయిత డార్లింగ్ స్వామి విడుదల చేశారు. నితిన్ కుమార్ మాట్లాడుతూ– "యాక్షన్, అడ్వెంచర్‌గా రూపొందిన చిత్రం 'మయూఖి'. షూటింగ్ అంతా అమెరికాలోనే జరుపుకున్నా, తెలుగువారి అభిరుచికి అనుగుణంగా ఉంటుంది. అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు, అమెరికన్లను ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చి నటింపజేశాం. త్వరలో సినిమా విడుదల చేస్తాం" అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కె.అనిల్, ఏఎల్. నితిన్ కుమార్, సంగీతం: లుబెక్ లీ మార్విన్.

తండ్రి తీర్పు షురూ



• ప్రతాప్, అనురాధ

తల్లితండ్రులు– పిల్లలకు మధ్య పెరుగుతున్న ఎడబాటు, తరిగిపోతున్న ప్రేమ నేపథ్యంలో 'ఓ తండ్రి తీర్పు' సినిమా షురూ అయింది. ప్రతాప్, శ్రీరామ్, అనురాధ, చెల్లి స్వప్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ప్రతాప్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీరామ్ దత్తి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రాజేందర్ రాజు కాంచనపల్లి పర్యవేక్షిస్తున్నారు. చిత్ర సమర్పకులు ఆరిగపూడి విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా ఈ సినిమా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సంగీత దర్శకుడు కోటి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాతలు టి.రామసత్యనారాయణ, రమేష్ చెప్పాల స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందజేశారు. "వాస్తవ సంఘటనలతో ఈ మూవీ ఉంటుంది" అన్నారు శ్రీరామ్ దత్తి. "అవకాశం ఇచ్చిన విజయ్ కుమార్, రమణాచారిలకు థ్యాంక్స్" అన్నారు ప్రతాప్ భీమవరపు. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ చెట్‌పల్లి, సంగీతం: మధు బాపు.

సస్పెన్స్ థ్రిల్లర్



• ఆమీక్షా పవార్

అదిరే అభి(అభినవ కృష్ణ), ఆమీక్షా పవార్, ప్రగ్యా నాయన్, సోనాక్షీ వర్మ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'ఇన్‌సెక్యూర్'. రంజిత్ కోడిప్యాక సమర్పణలో అర్కాన్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సత్యనారాయణ ఏకారి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమాని ఈ నెల 11న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. సత్యనారాయణ ఏకారి మాట్లాడుతూ– "సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. తప్పు చేసి డబ్బు, హోదాను అడ్డుపెట్టుకుని చట్టం నుండి ఎలాగైనా తప్పించుకోవచ్చు అనే చెడు ఆలోచనను దూరం చేసేలా మా సినిమా తీశాం. ఈ చిత్రంలో పోలీస్ పాత్రలో 'సీతారామం' ఫేమ్ మధు నంబియార్ నటించగా, ప్రొడ్యూసర్ రాజేష్ నాయుడు మరో కీలక పాత్ర చేశారు" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: నవనీత్ చారి, సహకారం: సీహెచ్ క్రాంతి కిరణ్.

అల్లంత దూరంలో...



• నిఖిత, రావణ్

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నేపథ్యంలో రూపొందిన చిత్రం 'అలిపిరికి అల్లంత దూరంలో'. నందినీ రెడ్డి వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన ఆనంద్ జె. ఈ చిత్రంతో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. రావణ్ నిట్టూరు, శ్రీ నిఖిత, అలంకృత షా, బొమ్మకంటి రవీందర్ ప్రధాన పాత్రలు పోషించారు. రమేష్ డబ్బుగొట్టు, రెడ్డి రాజేంద్ర పి. నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 18న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు యూనిట్. "రాబరీ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం ఇది. తొలి సినిమాతోనే ఆనంద్ ప్రత్యేక మార్క్ చూపించబోతున్నారు. ఈ మూవీలోని 'మా తిరుపతి..' అంటూ సాగే పాట సెన్సేషనల్ చార్ట్ బస్టర్‌గా నిలిచింది" అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: డీజీకే, సంగీతం: ఫణి కల్యాణ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
375	133
61,121	18,145

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,915	▽	72
డోజోన్స్	32,627	▽	106
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,186	▲	92
డాక్స్	13,339	▲	85
షాంఘై	2,969	▲	76
నికాయ్	27,679	▲	91

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
50,691	▲ 211
బంగారం (99.5 స్వచ్ఛత)	
50,448	▲ 210
వెండి (కిలో)	
59,048	▲1698

ఏటీఎఫ్ రేటు 4% పెంపు

వాణిజ్య ఎల్‌పీజీ ధర రూ. 115 తగ్గింపు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఇంధన మార్కెట్ల ధోరణులకు అనుగుణంగా దేశీయంగా విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు 4.2% పెంచాయి. దీనితో దేశ రాజధాని న్యూఢిల్లీలో ఏటీఎఫ్ ధర కిలో లీటరుకు రూ. 4,842 మేర పెరిగి రూ. 1,20,363కి చేరింది. గత నెలలో దీని ధర 4.5 శాతం తగ్గింది. మరోవైపు, హోటళ్లు మొదలైన వ్యాపార సంస్థలు ఉపయోగించే 19.4 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ (ఎల్‌పీజీ) ధరను రూ. 115.5 మేర తగ్గించాయి. జూన్ నుంచి చూస్తే ఎల్‌పీజీ రేట్లు తగ్గించడం ఇది ఏడోసారి. మొత్తం మీద 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 610 మేర తగ్గింది. ఇళ్లల్లో వాడే వంట గ్యాస్ ధర మాత్రం యధాతథంగా 14.2 కేజీల సిలిండర్‌కు రూ. 1,053గానే కొనసాగుతోంది.

అందరికీ ఒక్కటే ఐటీఆర్ ఫామ్

అభిప్రాయాలకు ఆహ్వానం పలికిన సీబీడీటీ

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారులు అందరికీ అనుకూలమైన ఒకే ఒక్క ఆదాయపన్ను రిటర్నుల పత్రాన్ని (ఐటీఆర్ ఫామ్) తీసుకురావాలంటూ ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. ఈ పత్రంలో వర్చువల్ డిజిటల్ అసెట్స్ రూపంలో వచ్చే ఆదాయాన్ని వెల్లడించేందుకు ప్రత్యేక భాగం ఉంటుంది. ట్రస్టీలు, ఎన్‌జీవోలు మినహా మిగిలిన పన్ను చెల్లింపుదారులు అందరూ నూతన ప్రతిపాదిత ఐటీఆర్‌ను ఫైల్ చేసుకోవచ్చంటూ, దీనిపై అభిప్రాయాలు తెలియజేయాలని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) భాగస్వాములను కోరింది. ఐటీఆర్-7 మినహా మిగిలిన అన్ని ఐటీఆర్‌లను విలీనం చేయాలన్నది ప్రతిపాదన.



చిన్న, మధ్య స్థాయి పన్ను చెల్లింపుదారుల్లో ఎక్కువ మంది ఐటీఆర్-1, ఐటీఆర్-4 దాఖలు చేస్తుంటారు. ఇంటి రూపంలో ఆదాయం, వేతనం రూపంలో రూ.50 లక్షల వరకు ఆదాయం ఉన్న వారు ఐటీఆర్-1 దాఖలు చేయవచ్చు. రూ.50 లక్షల వరకు ఆదాయం కలిగిన వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, సంస్థలు వ్యాపార ఆదాయం కూడా కలిగి ఉంటే ఐటీఆర్-4ను, వేతన లేదా వ్యాపార ఆదాయంతో పాటు మూలధన లాభాల పన్ను పరిధిలోని వారు ఐటీఆర్-2 దాఖలు చేయాలి.

జీఎస్‌టీ.. రెండో భారీ వసూళ్లు

అక్టోబర్‌లో రూ.1.52 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు అక్టోబర్‌లో రూ.1.52 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2021 ఇదే నెలతో పోల్చితే ఈ వసూళ్లు 16.5 శాతం అధికం. ఇక ఈ స్థాయిలో వసూళ్లు జరగడం జీఎస్‌టీ చరిత్రలో రెండవసారి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.1.68 లక్షల కోట్లు నమోదుకాగా, సెప్టెంబర్‌లో ఈ విలువ రూ.1.48 లక్షల కోట్లుగా ఉంది. పండుగల సీజన్‌లో ఎకానమీ ఉత్సాహ భరిత క్రియాశీలతను తాజా గణాంకాలు ప్రతిబింబిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గణాంకాల్లో కొన్ని ముఖ్యాంశాలు..

- అక్టోబర్‌లో మొత్తం రూ.1,51,718 కోట్ల వసూళ్లు జరిగాయి. ఇందులో సెంట్రల్ జీఎస్‌టీ రూ.26,039 కోట్లు. స్టేట్ జీఎస్‌టీ రూ.33,396 కోట్లు. ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.81,778 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.37,297 కోట్లుసహా). సెస్ రూ.10,505 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.10,505 కోట్లుసహా)
- జీఎస్‌టీ వసూళ్లు వరుసగా 8 నెలలుగా రూ.1.40 లక్షల కోట్లు పైబడ్డాయి. ఇందులో రెండు నెలలు రూ.1.50 లక్షల కోట్లు దాటాయి.
- 2022 సెప్టెంబర్ నెలలో 8.3 కోట్ల ఈ-వే బిల్లులు జనరేట్ ఆయ్యాయి. 2022 అక్టోబర్ నెలలో ఈ సంఖ్య 7.7 కోట్లుగా ఉంది.

2022 నుంచి ఇలా...

నెల	జీఎస్‌టీ ఆదాయం (రూ.కోట్లలో)
జనవరి 2022	1,40,986
ఫిబ్రవరి	1,33,026
మార్చి	1,42,095
ఏప్రిల్	1,67,650
మే	1,40,885
జూన్	1,44,616
జూలై	1,48,995
ఆగస్టు	1,43,612
సెప్టెంబర్	1,47,686
అక్టోబర్	1,51,718

పీఎన్‌బీ.. ఎన్‌పీఏల భారం!

63 శాతం తగ్గిపోయిన లాభం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) స్టాండలోన్ నికర లాభం సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో 63% తగ్గి రూ.411 కోట్లకు చేరింది. ఆదాయం రూ.23,001 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.1,105 కోట్లు, ఆదాయం రూ.21,262 కోట్ల చొప్పున ఉన్నాయి. మొండి బకాయిల భారం కొంత తగ్గినప్పటికీ.. వీటి కోసం అధిక కేటాయింపులు చేయాల్సి రావడం లాభాలను ప్రభావితం చేసింది. వడ్డీ ఆదాయం రూ.17,980 కోట్ల నుంచి రూ.20,154 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 30 శాతం పెరిగి రూ.8,271 కోట్లుగా ఉంది. రుణ ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 13.36 శాతం నుంచి 10.48 శాతానికి (రూ.87,034 కోట్లు) తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 5.49 శాతం నుంచి 3.80 శాతానికి పరిమితమయ్యాయి.

టెక్ మహీంద్రా లాభం డౌన్

- క్యూ2లో రూ. 1,285 కోట్లు
- కొత్తగా 5,000 మంది జత



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) రెండో త్రైమాసికంలో ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 4 శాతం క్షీణించి రూ. 1,285 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 1,339 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 21 శాతం జంప్‌చేసి రూ. 13,129 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 10,881 కోట్ల టర్నోవర్ సాధించింది. మార్కెట్ పరిస్థితులు మెరుగుపడుతున్నప్పటికీ సరఫరా సమస్యలు కొనసాగనున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీపీ గుర్నానీ పేర్కొన్నారు. కాగా.. ప్రస్తుత క్యూ2లో 71.6 కోట్ల డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులు కుదుర్చుకుంది. ఈ కాలంలో కొత్తగా 5,000 మందికి ఉపాధి కల్పించినట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1.63 లక్షలకు చేరింది. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 22 శాతం నుంచి 20 శాతానికి తగ్గింది.

ఫలితాల నేపథ్యంలో టెక్ మహీంద్రా షేరు 0.4 శాతం బలపడి రూ. 1,068 వద్ద ముగిసింది.

అజియో అథ్లెయిజర్ బ్రాండ్ 'ఎక్సెలరేట్' ఆవిష్కరణ

ప్రచారకర్తగా హార్దిక్ పాండ్యా



హైదరాబాద్: రిలయన్స్ రిటైల్ కామర్స్ ప్లాట్‌ఫామ్ అజియో మంగళవారం అథ్లెయిజర్ బ్రాండ్ ''ఎక్సెలరేట్''ను ఆవిష్కరించింది. భారత క్రికెట్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బ్రాండ్ ప్రచారకర్తగా నియమితులయ్యారు. క్రీడలు, ఫిట్‌నెస్ ఔత్సాహికులకు అవసరమయ్యే స్పోర్ట్ షూస్, అథ్లెటిక్, లైఫ్‌స్టైల్ పాదరక్షలు, ట్రాక్ ప్యాంట్, టీ-షర్టులతో పాటు ఇతర ఉపకరణాలు ఇందులో లభిస్తాయి. ఈ సరికొత్త ఉత్పత్తులు అజియో బిజినెస్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉన్నాయి. రూ.699 ప్రారంభ ధరతో గొప్ప ఆఫర్లు పొందవచ్చు. ఎక్సెలరేట్ ప్రచారకర్తగా నియమితులు కావడంపై హార్దిక్ పాండ్యా హర్షం వ్యక్తం చేశారు. 'డోంట్ బ్రేక్, ఎక్సెలరేట్' అనే ట్యాగ్‌లైన్‌తో పాండ్యా ప్రచారం కల్పిస్తూ బ్రాండ్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తారని రిలయన్స్ రిటైల్ సీఈవో అఖిలేష్ ప్రసాద్ తెలిపారు.

పండుగ జోష్‌తో టాప్‌గేర్

అక్టోబర్‌లో కార్లకు భారీ గిరాకీ • నిరాశపరిచిన టూవీలర్ విక్రయాలు



ముంబై: పండుగ సీజన్ కలిసిరావడంతో అక్టోబర్‌లో ఆటో అమ్మకాలు పెరిగాయి. ఎస్‌యూవీ, మిడ్ సిగ్మెంట్, ఎంట్రీ లెవల్ కార్లకు భారీగా డిమాండ్ పెరగడంతో పాసింజర్ వాహన విక్రయాలు గణనీయమైన వృద్ధిని సాధించాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా-మహీంద్రా, కియా మోటార్స్, హోండా కార్స్ ఇండియా చెప్పుకోదగిన స్థాయిలో అమ్మకాలు జరిపాయి. అయితే ఇదే నెలలో ద్విచక్ర విక్రయాలు విక్రయాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, హోండా మోటోసైకిల్ అండ్ స్కూటర్ ఇండియా, టీవీఎస్ మోటార్ విక్రయాలు నిరాశపరిచాయి.

- మారుతీ సుజుకీ ఇండియా దేశీయ విక్రయాలు అక్టోబర్‌లో 1,67,520కు చేరాయి. గతేడాది అక్టోబర్ అమ్మకాలు 1,38,335తో పోలిస్తే 21 శాతం పెరిగాయి.
- హ్యుందాయ్ మోటార్ ఇండియా విక్రయాలు 43,556 నుంచి 33% వృద్ధితో 58,006 యూనిట్లకు చేరాయి.
- టాటా మోటార్స్ అమ్మకాలు 15 శాతం వృద్ధిని సాధించి 78,335 యూనిట్లు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే ఆగస్టులో 67,829 యూనిట్లు అమ్ముడయ్యాయి.

కంపెనీ	2022 (అక్టోబర్)	2021	వృద్ధి/క్షీణత(%)
మారుతీ సుజుకీ	1,67,520	1,38,335	(+)21
హ్యుందాయ్	58,006	43,556	(+)33
టాటా మోటార్స్	78,335	67,829	(+)15
ఎంఅండ్‌ఎం	32,298	20,130	(+)60
హోండా కార్స్	9,543	8,108	(+)18
ఎంజీ మోటార్స్	4,367	2,863	(+)53
స్కోడా ఆటో	3,389	3,065	(+)11
టయోటా కిర్లోస్కర్	13,143	12,440	(+)6
కియా మోటార్స్	22,323	16,331	(+)43
నిస్సాన్ మోటార్స్	10,011	6,917	(+)45
బజాజ్ ఆటో	3,95,238	4,39,615	(-)10
హీరో మోటోకార్ప్	4,54,582	5,47,970	(-)17
సుజుకీ మోటార్‌సైకిల్	87,859	69,634	(+)27
టీవీఎస్ మోటార్స్	3,60,288	3,55,033	(+)2
రాయల్ ఎన్‌ఫీల్డ్	82,235	44,133	(+)86
వోల్వో ఐషర్	6,038	5,805	(+)4
అశోక్ లేలాండ్	14,863	11,079	(+)34
ఎస్కార్ట్స్	14,492	13,514	(+)7
మహీంద్రా ట్రాక్టర్స్	51,994	47,017	(+)11

తొమ్మిది నెలల గరిష్టానికి సూచీలు

- నాలుగో రోజూ బుల్ పరుగులు
- 61వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 18,150 పాయింట్ల చేరువలో నిఫ్టీ



ముంబై: దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో నాలుగు రోజు బుల్ పరుగులు తీసింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల ధోరణి సూచీల ర్యాలీకి కలిసొచ్చింది. రూపాయి రికవరీ, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు వెల్లువలా వస్తుండటమూ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఆర్థిక, ఐటీ, ఇంధన షేర్లకు రాణించాయి. ఫలితంగా ఈ ఏడాది జనవరి 17 తర్వాత సెన్సెక్స్ సూచీ 61 వేల స్థాయిపై ముగిసింది. మొత్తం 375 పాయింట్లు పెరిగి 61,121 వద్ద స్థిరపడింది. ఈ సూచీలోని 30 షేర్లలో మూడు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 133 పాయింట్లు బలపడి 18,145 స్థాయిపైన నిలిచింది. బ్యాంక్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం లాభపడింది. స్మాల్ క్యాప్ సూచీ పావుశాతం బలపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,610 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.730 కోట్ల షేర్లను అమ్మారు. ఆసియాలో ఒక్క ఇండోనేషియా మిగిలిన అన్ని దేశాల మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 1.5% ర్యాలీ చేశాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- బీఎస్‌ఈలో బ్లాక్ డీల్ ద్వారా ఒకశాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లు చేతులు మారినట్లు వార్తలు వెలువడంతో యాక్సిస్ బ్యాంక్ షేరు నాలుగుశాతం నష్టపోయి రూ.872 వద్ద స్థిరపడింది.
- క్యూ2 ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉండటంతో మదర్‌సన్ సుమీ వైరింగ్ ఇండియా ఆరుశాతం నష్టపోయి రూ.82.40 వద్ద స్థిరపడింది.
- ఫలితాలు మెప్పించడంతో కెనరా బ్యాంక్ షేరు ఇంట్రాడేలో రెండుశాతానికి పైగా లాభపడి 297 వద్ద మూడేళ్ల గరిష్టాన్ని తాకింది. చివరికి స్వల్ప లాభంతో రూ.291 వద్ద స్థిరపడింది.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

డైలీ కరెంట్ అఫైర్స్
అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే కీలకమైన 'డైలీ కరెంట్ అఫైర్స్' కోసం...

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

డీఆర్‌డీవోలో 1061 పోస్టులు

భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో).. దేశవ్యాప్తంగా ఉన్న డీఆర్‌డీవో పరిశోధనా కేంద్రాల్లో ఎంట్రన్స్ టెస్టుకు సంబంధించి సెంటర్ ఫర్ పర్సనల్ టాలెంట్ మేనేజ్‌మెంట్(సెప్టమ్-10/ఎ-ఎ) అడ్మిన్-అలైడ్ కేడర్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ప్రకటన ద్వారా స్టెనోగ్రాఫర్, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1061

» **పోస్టుల వివరాలు:** జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్(జేటీవో)-33, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-1(ఇంగ్లిష్ టైపింగ్)-215, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-2(ఇంగ్లిష్ టైపింగ్)-123, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ఎ(ఇంగ్లిష్ టైపింగ్)-250, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ఎ(హిందీ టైపింగ్)-12, స్టోర్ అసిస్టెంట్ ఎ(ఇంగ్లిష్ టైపింగ్)-134, స్టోర్ అసిస్టెంట్ ఎ(హిందీ టైపింగ్)-04, సెక్యూరిటీ అసిస్టెంట్ ఎ-41, వెహికల్ ఆపరేటర్ ఎ-145, ఫైర్ ఇంజన్ డ్రైవర్ ఎ-18, ఫైర్‌మ్యాన్-86.

» **అర్హత:** పోస్టులను అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. టైపింగ్ పరిజ్ఞానం, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి.» **వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. జేటీవో, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-1 పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.

» **వేతనం:** నెలకు జేటీవో, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-1 పోస్టులకు రూ.35,400 నుంచి రూ.1,12,400, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-2 పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100, ఇతర పోస్టులకు రూ. 19,900 నుంచి రూ.63,200 వరకు ఉంటుంది.

» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి టైర్-1(సీబీటీ), టైర్-2(నైపుణ్య, శారీరక ధృఢత్వ, సామర్థ్య పరీక్షలు) తదితరాల ఆధారంగా.

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 07.11.2022

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.12.2022

» **వెబ్‌సైట్:** drdo.gov.in

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 1671 పోస్టులు

ఇంటెలిజెన్స్ బ్యూరో దేశవ్యాప్తంగా ఉన్న సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరోల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1671

» **పోస్టుల వివరాలు:** సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్-1521, మల్టీ-టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్)-150. » **అర్హత:** మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణతతోపాటు స్థానిక భాషపై అవగాహన ఉండాలి.

» **వయసు:** 25.11.2022 నాటికి ఎస్‌ఏ/ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 25ఏళ్లు, ఎంటీఎస్ పోస్టులకు 27ఏళ్లు మించకూడదు.» **వేతనం:** నెలకు సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ. 21,700నుంచి రూ.69,100,ఎంటీఎస్ పోస్టులకు రూ.18,000 నుంచి రూ.56,900 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** టైర్-1, టైర్-2, టైర్-3 పరీక్షల తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 05.11.2022

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.11.2022

» **వెబ్‌సైట్:** mha.gov.in

ఏపీ జిల్లా కోర్టుల్లో 1520 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హైకోర్టు జిల్లా కోర్టుల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1520

» **జిల్లాల వారీగా పోస్టులు:** అనంతపురం-92, చిత్తూరు-168, తూర్పు గోదావరి-156, గుంటూరు-147, వైఎస్సార్ కడప-83, కృష్ణా-204, కర్నూలు-91,ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు-104, ప్రకాశం-98, శ్రీకాకుళం-87, విశాఖపట్నం-125, విజయనగరం-57, పశ్చిమ గోదావరి-108.

» **అర్హత:** ఏడో తరగతి పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి.

» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. » **జీతం:** నెలకు రూ.20,000 నుంచి రూ.61,960 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:**కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.11.2022

» **వెబ్‌సైట్:** hc.ap.nic.in

సీఆర్‌పీఎఫ్‌లో 322 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్).. స్పోర్ట్స్ కోటా కింద గ్రూప్ సి విభాగంలో హెడ్ కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) నాన్-గెజిటెడ్-నాన్ మినిస్టీరియల్ పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 322

» **క్రీడా విభాగాలు:** ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాడీబిల్డింగ్, బాక్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, కరాటే, షూటింగ్, స్విమ్మింగ్, వాటర్ పోలో, ట్రయాథ్లాన్, తైక్వాండో, వాలీబాల్, వాటర్ స్పోర్ట్స్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్(ఫ్రీ స్టైల్), రెజ్లింగ్(గ్రీకో రోమన్), ఉషు.

» **వేతనం:** రూ.25,500 నుంచి రూ.81,100

» **అర్హత:** పన్నెండో తరగతితోపాటు సంబంధిత క్రీడాంశాల్లో అర్హత సాధించి ఉండాలి. **వయసు:** 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.

» **ఎంపిక విధానం:** క్రీడా ప్రదర్శన, స్పోర్ట్స్ ట్రయల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. » **దరఖాస్తులకు చివరితేది:** రిక్రూట్‌మెంట్ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.

» **వెబ్‌సైట్:** crpf.gov.in

పోలీస్ కొలువుకు సిద్ధమా

» 6,511 పోలీస్ పోస్టుల భర్తీకి ఏపీ ప్రభుత్వ ఆమోదం
» ఎస్‌ఐ 411 పోస్టులు, 6,100 ఉద్యోగాల భర్తీకి కసరత్తు
» డిగ్రీతో ఎస్‌ఐ, ఇంటర్‌తో కానిస్టేబుల్ పోస్టులకు అవకాశం
» మరికొద్ది రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యోగార్థులకు మరో తీపి కబురు అందించింది. యూనిఫామ్ సర్వీసులో చేరాలనుకునే యువత తమ స్వప్నం సాకారం చేసుకునే సమయం వచ్చింది. పోలీస్ శాఖలో ఏకంగా 6,511 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది! మరికొద్ది రోజుల్లోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. అభ్యర్థులు ఇప్పటి నుంచే తమ కసరత్తును ముమ్మరం చేసుకుంటే..కలల కొలువును సొంతం చేసుకోవచ్చు! ఈ నేపథ్యంలో.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భర్తీ చేయనున్న పోలీస్ పోస్టులు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్ తదితర అంశాలతో ప్రత్యేక కథనం..



ఏపీ పోలీస్ జాబ్స్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం-పోలీస్ శాఖలో మొత్తం 6,511 ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో సబ్ ఇన్‌స్పెక్టర్- సివిల్ పోస్టులు: 315; రిజర్వ్‌డ్ సబ్ ఇన్‌స్పెక్టర్(ఆర్‌ఎస్‌ఐ) పోస్టులు: 96; కానిస్టేబుల్-సివిల్ పోస్టులు: 3,580; కానిస్టేబుల్(ఏపీఎస్పీ) పోస్టులు: 2,520 ఉన్నాయి. ఈ పోస్టులకు ఎంపిక ప్రక్రియను ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చేపట్టనుంది.

అర్హతలు

- ఎస్‌ఐ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- కానిస్టేబుల్ పోస్టులకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి.
- గమనిక:గత నోటిఫికేషన్‌లో ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్ రెండేళ్లు పూర్తి చేసుకుంటే(ఉత్తీర్ణత సాధించినా,సాధించకపోయినా)కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.తాజా నియామకాల విషయంలో ఈ వెసులుబాటుపై నోటిఫికేషన్‌లో స్పష్టత లభించే అవకాశం ఉంది.

నాలుగు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ మొత్తం నాలుగు దశల్లో నిర్వహించనున్నారు. అవి.. **తొలిదశ:** ప్రిలిమినరీ రాత పరీక్ష; **రెండో దశ:** ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్; **మూడో దశ:** ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్; **నాలుగో దశ:** ఫైనల్ రిటెన్ ఎగ్జామినేషన్.

ఎస్‌ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష

ఎస్‌ఐ పోస్టులకు తొలిదశ ప్రిలిమినరీ రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో రెండు వందల మార్కులకు ఉంటుంది. రెండు పేపర్లుగా పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో పేపర్1 అర్థమెటిక్ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్/మెంటల్ ఎబిలిటీ 100 ప్రశ్నలు-100 మార్కులకు; పేపర్2 జనరల్ స్టడీస్ 100ప్రశ్నలు-100మార్కులకు జరుగుతుంది.

రెండో దశ ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్

- రెండో దశలో ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- **పురుషులు:** 167.6 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతీ 86.3 సెంటీ మీటర్లు ఉండాలి. శ్వాస తీసుకున్నప్పుడు కనీసం మూడు సెంటీమీటర్లు పెరగాలి. మహిళలకు శారీరక ప్రమాణాల్లో సడలింపులు ఉంటాయి. వారికి కనీస ఎత్తును 152.5 సెంటీ మీటర్లుగా పేర్కొనే అవకాశం ఉంది.

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

తొలిదశ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి, ఆ తర్వాత ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లోనూ విజయం సాధించిన వారికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ టెస్ట్ వంద మార్కులకు ఉంటుంది. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా నిర్వహించే ఈవెంట్లలోని 1600 మీటర్ల పరుగు పందెంలో తప్పనిసరిగా ఉత్తీర్ణత(నిర్దేశిత సమయంలో పూర్తి చేయడం) సాధించాలి.

ఫైనల్ రాత పరీక్ష

- ప్రిలిమ్స్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ మూడింటిలోనూ విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. చివరగా ఫైనల్ రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష నాలుగు పేపర్లలో ఉంటుంది. పేపర్ 1లో తెలుగు వంద మార్కులకు, పేపర్ 2లో ఇంగ్లిష్ వంద మార్కులకు; పేపర్ 3లో అర్థమెటిక్ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్/మెంటల్ ఎబిలిటీ 200 మార్కులకు, పేపర్ 4లో జనరల్ స్టడీస్ 200 మార్కులకు ఉంటాయి.
- గమనిక: ఎస్‌ఐ పోస్టులకు గతంలో పేపర్-3,4లను 100 మార్కులకే నిర్వహించారు.
- పేపర్-1, పేపర్-2లు ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నల కలయికగా, పేపర్-3, పేపర్-4లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి.
- పేపర్-1, పేపర్-2లను కేవలం అర్హత పేపర్లుగానే పేర్కొంటారు.
- పేపర్-3, పేపర్-4లలో పొందిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక జాబితా రూపొందించి, నియామకాలు ఖరారు చేస్తారు.

కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియ ఇలా

- కానిస్టేబుల్ పోస్టుల ఎంపిక ప్రక్రియ కూడా ఎస్‌ఐ పోస్టుల మాదిరిగానే నాలుగు దశల్లో ఉంటుంది. తొలిదశ ప్రిలిమినరీ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు.
- రెండో దశలో ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ ఉంటుంది. పురుష అభ్యర్థులు 167.6 సెం.మీ ఎత్తు, 86.3 సెం.మీ. ఛాతి కలిగుండాలి. మహిళా అభ్యర్థులు 152.5 సెం.మీ ఎత్తు ఉండాలి.
- ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ విజేతలకు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు.
- ఈ టెస్ట్ కూడా ఎస్‌ఐ పోస్టులకు నిర్వహించే ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, 1600 మీటర్ల పరుగు ఈవెంట్లలో ఉంటుంది. అభ్యర్థులు 1600మీటర్ల పరుగు పందెంలో తప్పనిసరిగా అర్హత సాధించాల్సి ఉంటుంది.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ విజేతలకు చివరగా తుది రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష మూడు గంటల వ్యవధిలో 200 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది. ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టుల అభ్యర్థులకు మాత్రం 200 ప్రశ్నలతో 100 మార్కులకే పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రిలిమినరీ, ఫైనల్ రాత పరీక్షల్లో.. ఇంగ్లిష్, అర్థమెటిక్, జనరల్ సైన్స్, హిస్టరీ, కరెంట్ అఫైర్స్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

విజయం సాధించాలంటే

ఏపీ పోలీస్ శాఖ చేపట్టే నియామకాలకు భారీగా పోటీ నెలకొనే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే రాత పరీక్షలో, ఫిజికల్ టెస్ట్‌లలో రాణించేందుకు కసరత్తు చేయాలి.

అర్థమెటిక్

అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విభాగం.. అర్థమెటిక్ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్. ఎస్‌ఐ ప్రిలిమినరీ పరీక్షలో ఈ విభాగం నుంచే వంద ప్రశ్నలు అడుగుతారు. అర్థమెటిక్‌లోని ముఖ్యాంశాలుగా భావించే సగటులు, కసాగు, గసాభా, సంఖ్యలు, వర్గ మూలాలు, ఘన మూలాలు, నిష్పత్తులు, భాగస్వామ్యం, వయసులు, శాతాలు, లాభ-నష్టాలు, చక్ర వడ్డీ, సరళ వడ్డీ, కాలం-దూరం, కాలం-పని వంటి వాటిపై పట్టు సాధించాలి. అదే విధంగా మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, మ్యాట్రిసెస్, సెట్స్-రిలేషన్స్‌ను ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయాలి.

రీజనింగ్

అభ్యర్థులు మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశం ఉన్న విభాగం.. రీజనింగ్. ఇందులో నంబర్ సిరీస్, మిస్సింగ్ నెంబర్స్, కోడింగ్-డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్స్ వంటి వాటిపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. వెన్ డయాగ్రమ్స్, అసెంప్షన్ అండ్ రీజన్, ఆర్గ్యుమెంట్, సిలాజిజమ్, డేటా సఫిషియన్సీ విభాగాల్లో పట్టుతో వెర్బల్ రీజనింగ్‌లో రాణించే అవకాశం ఉంది. ఆడ్‌మన్ ఔట్, డైస్ అండ్ క్యూబ్స్,వెన్ డయాగ్రమ్స్‌లపై పట్టుతో నాన్ వెర్బల్ రీజనింగ్‌లో వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే నైపుణ్యం లభిస్తుంది. మెంటల్ ఎబిలిటీ విభాగంలో రాణించేందుకు టాబ్యులేషన్, డేటా సమీకరణ, డేటా విశ్లేషణలపై పట్టు సాధించాలి.

జనరల్ స్టడీస్

- హిస్టరీకి భారత, ఏపీ చరిత్రకు సంబంధించి ముఖ్యమైన ఘట్టాలు, చరిత్ర గతిని మార్చిన సంఘటనలు, భారత స్వాతంత్ర్య ఉద్యమంలోని ప్రధాన ఘట్టాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.
- జాగ్రఫీలో భారత, ఏపీ భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, నదులు, సముద్ర తీర ప్రాంతాలు, అడవులు, పంటలు, సాగు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ఎకానమీకి సంబంధించి కోర్ ఎకనామీతోపాటు సమకాలీన అంశాలు, ఆర్థిక రంగంలో అమలవుతున్న కొత్త విధానాలపై స్పష్టత పెంచుకోవాలి.
- పాలిటీకి సంబంధించి రాజ్యాంగం, రాజ్యాంగ రూపకర్తలు, రాజ్యంగంలోని ముఖ్యమైన అధికరణలు వంటి అంశాలతోపాటు తాజా రాజ్యాంగ సవరణలు, వాటి ఉద్దేశం, ప్రభావం వంటివి తెలుసుకోవాలి.
- కరెంట్ అఫైర్స్‌లో జాతీయంగా,అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న తాజా పరిణామాలు.
- ప్రాంతీయ,జాతీయ, అంతర్జాతీయ ప్రా ధాన్యం ఉన్న అంశాలు; భారత, ఏపీ చరిత్ర, ఆర్థికాభివృద్ధి అంశాలు, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, పునర్విభజన సమస్యల గురించి అధ్యయనం చేయాలి.
- ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లక్షిత వర్గాలు, లబ్ధిదారులు, బడ్జెట్ కేటాయింపుల గురించి తెలుసుకోవాలి.

'ఉమ్మడి' అభ్యర్థులు

ఎస్‌ఐ, కానిస్టేబుల్ రెండు పోస్టులకు పోటీ పడే అభ్యర్థులు ఉమ్మడి వ్యూహాలు అనుసరించడం ఉపయుక్తంగా ఉంటుంది. రెండు శాఖల్లోని పోస్టులకు ఉమ్మడి పేపర్‌గా ఉన్న జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ పేపర్‌కు ఈ విధానం మరింత ఉపయుక్తంగా ఉంటుంది.ఉమ్మడి ప్రిపరేషన్ సాగిస్తూనే.. వేర్వేరు సబ్జెక్ట్‌లలో నిర్వహించే మిగతా పేపర్లకు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి. ఆ తర్వాత సిలబస్‌లోని అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేస్తూ..ఒకే సమయంలో రెండు పరీక్షలకు సన్నద్ధత పొందేలా సమయ ప్రణాళిక రూపొందించుకోవాలి.

క్లుప్తంగా

30 వరకు నర్సింగ్ అడ్మిషన్‌ల గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ స్కూల్స్‌లో 2022–23 విద్యా సంవత్సరానికి జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సుల్లో (మూడేళ్లు) అడ్మిషన్‌లకు గడువును ఈ నెల 30 వరకు వైద్య శాఖ పొడిగించింది. ఈ మేరకు ఇన్‌చార్జ్ డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 21 సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఎంపిక ప్రక్రియ 25 వరకు ఉంటుంది. 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

నేటితో ముగియనున్న ఐపీఈ-2022

సాక్షి, విశాఖపట్నం: ఇండో పసిఫిక్ ప్రాంతంలో భద్రత బలోపేతం చేసేందుకు విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో నిర్వహిస్తున్న ఇండో పసిఫిక్-ఎండీవర్ 22 (ఐపీఈ) కార్యక్రమం బుధవారంతో ముగియనుంది. ఐపీఈ-2022లో పాల్గొనేందుకు ఆస్ట్రేలియాకు చెందిన త్రివిధ దళ బృందాలు విశాఖలో పర్యటిస్తున్నాయి. ఈ సందర్భంగా భారత యుద్ధ నౌకలను రాయల్ ఆస్ట్రేలియన్ బృందాలు సందర్శించాయి. భారత్‌తో రక్షణ, స్నేహపూర్వక సంబంధాలు బలోపేతం, వివిధ రంగాల్లో పరస్పర సహకార ఒప్పందాలు తదితర అంశాలపై ఇరు దేశాల రక్షణ ప్రతినిధులు చర్చలు జరిపారు. ఇప్పటి వరకూ ఐపీఈలో 14 దేశాల భాగస్వామ్యం ఉందనీ.. ఈ దేశాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

ఏపీ రైతు బజార్ల సీఈవోగా నందకిషోర్




కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతుబజార్ల చీఫ్ ఎగ్జిక్యూటీవ్ అధికారిగా ఏపీ టెక్నికల్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ ముల్లంగి నందకిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లోని మార్కెటింగ్‌శాఖ కమిషనరేట్ ఆవరణలోని ఆయన చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. నందకిషోర్ డిప్యూటేషన్‌ను 2024 సెప్టెంబర్ 2వ తేదీ వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ సమీర్‌శర్మ తాజాగా ఉత్తర్వులిచ్చారు. ఇప్పటి వరకు రైతుబజార్ల సీఈవోగా బాధ్యతలు నిర్వహించిన బి.శ్రీనివాసరావుకు ఇటీవల ఐఏఎస్ హోదా కల్పించి, సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్టు అదనపు డైరెక్టర్‌గా నియమించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నందకిషోర్ మాట్లాడుతూ రైతుబజార్లను ప్రక్షాళన చేసి రైతులు, వినియోగదారులకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: ఏపీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) విజిలెన్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ)గా విశ్రాంత ఐపీఎస్ అధికారి బుసిరెడ్డి మల్లారెడ్డి పదవీకాలాన్ని ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించింది. గతేడాది అక్టోబర్ 31న ఆయన ఈ పదవిలో నియమితులయ్యారు. ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో రెండేళ్లు పొడిగింపునిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

నటుడు పునీత్‌కు కర్ణాటక రత్న



పునీత్ సతీమణి అశ్వినికి అవార్డును అందజేస్తున్న సీఎం బొమ్మై, రజనీకాంత్, జూనియర్ ఎన్టీఆర్ తదితరులు

బనశంకరి: ప్రముఖ కన్నడ నటుడు పునీత్ రాజ్ కుమార్‌ను మరణానంతరం కర్ణాటక ప్రభుత్వం కర్ణాటక రత్న అవార్డుతో గౌరవించింది. రాష్ట్ర 67వ అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం అసెంబ్లీ భవనం విధానసౌధ ఆవరణలో ప్రదానోత్సవ వేడుక జరిగింది. సీఎం బసవరాజ బొమ్మై, ప్రముఖ నటులు రజనీకాంత్, జూనియర్ ఎన్టీఆర్ హాజరయ్యారు. పునీత్ సతీమణి అశ్వినికి సీఎం బొమ్మై, ఇతర నటులు, ప్రముఖులు కర్ణాటక రత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. అవార్డును అందుకుంటూ అశ్విని భావోద్వేగానికి లోనయ్యారు. పునీత్ 46 ఏళ్ల వయసులో గతేడాది అక్టోబరు 29న గుండెపోటుతో మరణించారు.

గురుకులాల్లో గెస్ట్ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మంత్రి చెల్లుబోయిన వేణుకు పీడీఎఫ్ ఎమ్మెల్సీల వినతి

సాక్షి, అమరావతి: మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలల్లో పనిచేసే క్వాలిఫైడ్ ఫుల్ టైమ్ గెస్ట్ టీచర్లను కాంట్రాక్టు టీచర్లుగా మార్పు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, సాబ్జి, వి.బాలసుబ్రమణ్యం నేతృత్వంలో ఫుల్‌టైమ్ గెస్ట్ టీచర్స్ అసోసియేషన్ నేతలు దాసు, ఆదర్శ ఆధ్వర్యంలో మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

హెల్త్ వర్సిటీ వెబ్‌సైట్‌లో మార్పులు

- అనుబంధ కళాశాలలు, ఎన్ఎంసీకి సమాచారం
- ఒకట్రెండు రోజుల్లో వర్సిటీ భవనాలపైనా పేరు మార్పు
- వైద్య విద్యార్థులకు ఇబ్బందులు ఉండవు

ఇకపై అన్ని రకాల ఉత్తర, ప్రత్యుత్తరాలూ కొత్త పేరుతోనే

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విజయవాడలోని హెల్త్ యూనివర్సిటీ పేరును డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీగా మారుస్తూ సోమవారం ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇక వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లోనూ మార్పుల ప్రక్రియకు మంగళవారం శ్రీకారం చుట్టింది. అన్ని రకాల వెబ్‌సైట్‌లను డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా మారుస్తున్నారు. ఇకపై అన్ని రకాల ఉత్తర ప్రత్యుత్తరాలతో పాటు, ఇతర కార్యకలాపాలు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరుతోనే నిర్వహించనున్నారు. ఇందుకోసం అనుబంధ కళాశాలలకు, నేషనల్ మెడికల్ కమిషన్‌కు సమాచారం ఇవ్వనున్నారు. ఒకట్రెండు రోజుల్లో యూనివర్సిటీ భవనాలపై ఉన్న పేర్లు సైతం మార్పుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



వీసీ డాక్టర్ శ్యాంప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న డాక్టర్ మెహబూబ్ షేక్

గతంలో రెండుసార్లు పేరు మార్పు

విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు మార్చడం ఇప్పుడు కొత్తేమీ కాదని సీనియర్ వైద్యులు అంటున్నారు. తొలుత యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (యూహెచ్ఎస్)గా ఉండేదని, ఆ తర్వాత ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా నామకరణ చేశారని గుర్తుచేశారు. ఆయన మరణానంతరం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చారని పేర్కొన్నారు. అప్పట్లో వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదని.. ఇప్పుడు కూడా ఏమీ ఉండవని వారంటున్నారు.

వైఎస్సార్ సేవలకు గుర్తింపుగానే..

ఇక రాష్ట్రంలో వైద్య రంగానికి దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలకు గుర్తింపుగానే హెల్త్ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టారని యూనివర్సిటీ డెంటల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ మెహబూబ్ షేక్ తెలిపారు. ఆరోగ్యశ్రీ, 108, 104 వంటి సేవలతో పాటు, కొత్తగా మూడు వైద్య కళాశాలలను ఏర్పాటుచేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటుచేస్తున్నారని, వర్సిటీకి వైఎస్సార్ పేరు పెట్టడంతో తప్పులేదని, విద్యార్థులకూ ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన స్పష్టంచేశారు.

రాష్ట్రంలో కేంద్ర ఆయుష్ బృందం పర్యటన

ఆయుష్ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల పనితీరు పరిశీలన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆయుష్ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల పనితీరును కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఎస్.హెచ్ ధీరేంద్ర కుమార్, సెంట్రల్ ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ సభ్యురాలు డాక్టర్ స్వాతి జునేజా బృందం మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించింది. విజయవాడ ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, ఆచంట లక్ష్మీపతి ఆయుర్వేద వైద్యశాల, గుడివాడలోని జీఆర్ ప్రభుత్వ హోమియో కళాశాల అనుబంధ వైద్యశాల, కొలవెన్నులోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్, అమరావతిలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలను సందర్శించి వివరాలు సేకరించింది. వారి వెంట రీజినల్ ఆయుర్వేద రీసెర్చ్ సెంటర్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్ మురళి కృష్ణ, ఆయుష్ డిపార్ట్‌మెంట్ కన్సల్టెంట్ డాక్టర్స్ జీ రంగనాథ్, కె.క్రాంతి తేజ పాల్గొన్నారు.

న్యాయ రాజధానిని ఏర్పాటు చేయాల్సిందే

కర్నూలులో వేలాది మందితో రాయలసీమ ఆత్మగౌరవ ర్యాలీ

కర్నూలు (సెంట్రల్): కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ప్రకటించింది. తక్షణమే కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది విద్యార్థులు, మహిళలు, న్యాయవాదులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నేతలు మంగళవారం రాయలసీమ ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. కర్నూలులోని రాజ్‌విహార్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ జరిగింది. మూడు రాజధానులకు మద్దతుగా తక్షణమే కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు మూడు రాజధానులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న సీఎం వైఎస్ జగన్ ఆశయంతో ఏకీభవిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు వెంటనే కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు అంగీకరించాలని.. లేదంటే వచ్చే ఎన్నికల్లో వారి భరతం పడతామని జేఏసీ నేతలు హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట మానవహారంగా ఏర్పడి న్యాయ రాజధాని ఆకాంక్షను తెలియజేశారు. ర్యాలీ జరుగుతున్న సమయంలో భారీ వర్షం కురిసినా ర్యాలీ నిర్వహించడం విశేషం. జేఏసీ నిర్వహించిన ర్యాలీకి బార్ అసోసియేషన్ నాయకులు ఎంఆర్ కృష్ణ, ఓంకార్, నారాయణ విద్యాసంస్థల డీన్ లింగేశ్వరరెడ్డి, సీవీ రామన్ విద్యాసంస్థల అధినేత చంద్రశేఖర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, ఎంపీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏసుదాసు, రిటైర్డ్ ఉద్యోగులు రోషన్ అలీ, అజయ్‌కుమార్ మద్దతు ప్రకటించారు.



కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేయాలని ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

ఈ నెల చివరి వారంలో లక్ష గొంతుకల పొలికేక

కాగా కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో నవంబర్ చివరి వారంలో లక్ష గొంతుకల పొలికేక సభను నిర్వహిస్తామని విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు ప్రశాంత్, శ్రీరాములు, చంద్రప్ప, సునీల్‌రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, బార్ అసోసియేషన్లను ఆహ్వానిస్తామన్నారు. రాయలసీమకు సీఎం వైఎస్ జగన్ హయాంలో తప్ప న్యాయం జరగదన్నారు. ఇప్పుడు సాధించుకోలేకపోతే మరెప్పుడూ శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం హైకోర్టు రాదన్నారు.

శ్రీబాగ్ ఒడంబడికకు ప్రాణం పోసిన నేత వైఎస్ జగన్

1953లో మద్రాసు నుంచి విడిపోయిన ఆంధ్ర రాష్ట్రానికి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో రాజధానిని, గుంటూరులో హైకోర్టును ఏర్పాటు చేశారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఆర్ కృష్ణ తెలిపారు. అయితే 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక శ్రీబాగ్ ఒడంబడికను విస్మరించి కర్నూలులో ఉన్న రాజధానిని హైదరాబాద్‌కు తరలించారన్నారు. 2014లో ఏపీ, తెలంగాణ విభజన సమయంలో మళ్లీ శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరితే సీఎంగా ఉన్న చంద్రబాబు కనీసం పట్టించుకోలేదన్నారు. అమరావతిపై ప్రేమతో రాజధానితోపాటు హైకోర్టును అక్కడే పెట్టేందుకు చర్యలు తీసుకున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత మళ్లీ శ్రీబాగ్ ఒడంబడికకు ప్రాణం పోశారని.. అందులో భాగంగానే కర్నూలును న్యాయ రాజధానిని చేశారని కొనియాడారు.

మూడు రాజధానులకే మా మద్దతు

- తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం
- రాజధాని వికేంద్రీకరణకు సంపూర్ణ మద్దతు

తిరుపతి తుడా: మూడు రాజధానుల ఏర్పాటు నిర్ణయానికి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ మద్దతు తెలిపింది. ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. మునిసిపల్ కార్యాలయంలో మేయర్ శిరీష అధ్యక్షతన మంగళవారం అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా పాల్గొన్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మూడు రాజధానుల ఆవశ్యకతను వివరించారు. తీర్మానాన్ని నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష బలపరచగా.. డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు సంపూర్ణ మద్దతు తెలిపారు. సభ్యుల్లో ఒక్కరు కూడా రాజధాని వికేంద్రీకరణను వ్యతిరేకించకపోవడంతో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని మేయర్ శిరీష ప్రకటించారు. కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నట్టు ఆమె చెప్పారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు వెనుకబాటుకు గురవుతున్నాయన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు కర్నూలును రాజధాని చేస్తామని చెప్పి నమ్మించారన్నారు. ఆపై తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేస్తూ ఉమ్మడి ఏపీ ఏర్పడినప్పుడు కర్నూలులో ఉన్న రాజధానిని హైదరాబాద్‌కు తన్నుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీ విడిపోతే కర్నూలుకు రావాల్సిన రాజధానిని కుట్రపూరితంగా, దురుద్దేశంతో అమరావతిలో ఏర్పాటు చేశారన్నారు. రాయలసీమకు రావాల్సిన నీటి ప్రాజెక్టులను సైతం అడ్డుకున్న నీచుడు చంద్రబాబని దుయ్యబట్టారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికను తుంగలో తొక్కి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం చంద్రబాబు అమరావతిని రాజధాని చేశారని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రమంతా అభివృద్ధి చెందాలని ఆశిస్తుంటే.. అందుకు విరుద్ధంగా చంద్రబాబు 29 గ్రామాలకే న్యాయం జరగాలని పట్టుబట్టడం సిగ్గుచేటన్నారు. రాజధాని, పాలన వికేంద్రీకరణతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు. అన్ని ప్రాంతాలకు సమానంగా విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మూడు రాజధానులతోనే సాధ్యమవుతాయని చెప్పారు. భవిష్యత్తులో వేర్పాటువాదం రాకూడదన్న ముందు చూపుతోనే సీఎం జగన్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. అయితే చంద్రబాబు అండ్ కో వికేంద్రీకరణను అడ్డుకుంటున్నారని విమర్శించారు. వికేంద్రీకరణకు సీమవాసులంతా మద్దతు ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా ఇటీవల రాయలసీమ ఆత్మగౌరవ మహాప్రదర్శన విజయవంతం చేసిన భూమన కరుణాకరరెడ్డికి మునిసిపల్ కౌన్సిల్ అభినందనలు తెలిపింది.



తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

2, 3 సెమిస్టర్ల పాఠ్యపుస్తకాలు సిద్ధం

- 10వ తేదీలోపు పంపిణీ పూర్తి చేయాలి
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన 2, 3 సెమిస్టర్ల పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. జగనన్న విద్యా కానుక కింద అందిస్తున్న ఈ పుస్తకాల పంపిణీకి సంబంధించిన షెడ్యూల్, మార్గదర్శకాలతో ఆయన మంగళవారం సర్క్యులర్ విడుదల చేశారు. 2022–23 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యా కానుక-3 కింద సెమిస్టర్-2, 3కు సంబంధించిన పాఠ్య పుస్తకాలు అక్టోబర్ 15 నుంచి 31 వరకు పూర్వపు 13 జిల్లాల గోడౌన్‌లకు సరఫరా చేసినట్లు తెలిపారు. జిల్లా బుక్ డిపో మేనేజర్లు మండల పాయింట్లకు వీటిని పంపిణీ చేసేందుకు వీలుగా షెడ్యూల్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థులకు ప్రతి పుస్తకం చేరేలా...

సెమిస్టర్-1 పాఠ్యపుస్తకాల సరఫరాలో కొన్ని లోపాలు తలెత్తాయి. ఇప్పుడు అటువంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లాల అధికారులకు కమిషనర్ సూచించారు. అన్ని జిల్లాల బుక్ డిపోల మేనేజర్లు సెమిస్టర్-2, 3 పాఠ్యపుస్తకాల అన్ని టైటిళ్లను ఒకే షెడ్యూల్‌లో అందించాలి. అన్ని మండలాల విద్యాశాఖాధికారులు సెమిస్టర్-2, 3ల అన్ని పాఠ్యపుస్తకాలను తమ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సరఫరా చేయాలి. ప్రతి టైటిల్ బుక్ ప్రతి విద్యార్థికి చేరేలా చూసుకోవాలి. ప్రధానోపాధ్యాయులు అందరూ తమ స్కూలులో ప్రస్తుత నమోదు ప్రకారం మండల పాయింట్ల నుంచి అన్ని పాఠ్యపుస్తకాల శీర్షికలను తీసుకోవాలి. ఏ పాఠశాలలో అయినా ఆంగ్ల మాధ్యమంలో నమోదు పెరిగి, తెలుగు మాధ్యమంలో తగ్గితే మండల విద్యాధికారి ద్విభాషా పాఠ్యపుస్తకాలను ఆంగ్ల మాధ్యమం విద్యార్థుల కోసం సరఫరా చేయాలి. ఇంకా, మండలాల్లో చేరికలు పెరిగి ఏదైనా కొరత ఏర్పడితే మండల విద్యాధికారి సంబంధిత పత్రాలతో జిల్లా విద్యాధికారికి, జిల్లా బుక్ డిపో మేనేజర్‌కు తెలియజేసి అవసరమైన శీర్షికలను పొందాలి. ఉర్దూ, తమిళం, కన్నడ, ఒడియా మాధ్యమాల పాఠ్యపుస్తకాలు, సంస్కృతం పాఠ్యపుస్తకాలు కూడా ప్రింట్ అయి జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజర్లకు సరఫరా అయ్యాయి. జిల్లా విద్యాధికారి, జిల్లా బుక్ డిపో మేనేజర్ ఈ పుస్తకాలను అవసరమైన పాఠశాలలకు సరఫరా చేయాలి. సెమిస్టర్-2, 3ల పాఠ్య పుస్తకాలు మొత్తం నవంబర్ 10వ తేదీలోపు పంపిణీ చేయాలి. ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాధికారులు, జిల్లా బుక్‌డిపో మేనేజర్లు పాఠ్యపుస్తకాల పంపిణీని పర్యవేక్షించాలి. ఏదైనా మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయుడు నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తిస్తే విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.



రూ.75 లక్షలు లాటరీ తగిలిందని...
రూ.34 లక్షలకు టోకరా

- జనవరి నుంచి అజ్ఞాత వ్యక్తి అకౌంట్‌లో డబ్బులు వేసిన బాధితుడు
- పోలీసులకు ఫిర్యాదు


గూడూరు: 'మీకు రూ.75లక్షలు లాటరీ తగిలింది. చిన్న ప్రక్రియ పూర్తయిన వెంటనే మీ అకౌంట్‌కు డబ్బులు బదిలీ చేస్తాం...' అంటూ అజ్ఞాత వ్యక్తి ఫోన్ ద్వారా నమ్మబలికి గూడూరుకు చెందిన ఓ వ్యక్తి నుంచి విడతల వారీగా రూ.34లక్షలు స్వాహా చేశాడు. పది నెలల నుంచి గుట్టుగా సాగుతున్న ఈ మోసం గురించి బాధితుడు మంగళవారం పోలీసులను ఆశ్రయించడంతో వెలుగులోకి వచ్చింది. గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి ఈ ఏడాది జనవరిలో అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. 'మీకు రూ.75లక్షలు లాటరీ తగిలింది. ఆ మొత్తాన్ని మీ అకౌంట్‌లో జమ చేసేందుకు కొన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేయాల్సి ఉంది' అని ఫోన్ చేసిన వ్యక్తి నమ్మబలికాడు. దీంతో అతను అడిగిన పత్రాలను బాధితుడు ఆన్‌లైన్‌లో పంపించాడు. ఆ తర్వాత 'మీకు మేము అందజేసే డబ్బులకు ఇన్‌కమ్ ట్యాక్స్ రూ.5.75లక్షలు ముందుగా కట్టాలి. అప్పుడే ఆ మొత్తాన్ని మీ అకౌంట్‌కు బదిలీ చేయగలం...' అని చెప్పాడు. దీంతో అంత మొత్తం తన వద్ద లేదని బాధితుడు చెప్పగా, కొస్త సమయం ఇస్తున్నామని, ఎలాగైనా డబ్బులు చెల్లించి గొప్ప అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అజ్ఞాత వ్యక్తి నమ్మబలికాడు. ఎట్టకేలకు బాధితుడు రూ.5.75లక్షలను అజ్ఞాత వ్యక్తి చెప్పిన బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశాడు. మళ్లీ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి ఆదాయపన్ను చెల్లించామని, జీఎస్టీ కోసం కొంత మొత్తం పంపాలని చెప్పగా, అకౌంట్‌లో బాధితుడు డబ్బులు వేశాడు. ఇలా పలుమార్లు డబ్బులు జమ చేశాడు. చివరిగా ఇటీవల అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి 'ఇక ప్రాసెస్ మొత్తం పూర్తయింది. రూ.4.5లక్షలు చెల్లిస్తే రూ.75లక్షలు మీ అకౌంట్‌లో జమ అవుతుంది' అని చెప్పాడు. దీంతో అంత డబ్బు తన వద్ద లేదని బాధితుడు చెప్పగా, రూ.50వేలు పంపాలని, మిగిలినవి తామే జమ చేస్తామని నమ్మబలికాడు. బాధితుడు మళ్లీ రూ.50వేలు అకౌంట్‌లో వేశాడు. ఈ విధంగా వివిధ పేర్లు చెప్పి విడతల వారీగా రూ.34లక్షలు అజ్ఞాత వ్యక్తి తన అకౌంట్లలో జమ చేయించుకున్నాడు. అయినా బాధితుడికి లాటరీ డబ్బులు రాకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గూడూరు వన్‌టౌన్ ఎస్ఐ హజరత్‌బాబు తెలిపారు.



గతంలోనూ మహిళకు టోకరా...

అదే విధంగా గతంలోనూ గూడూరు రూరల్ పరిధిలోని కంభంపాటి లక్ష్మీదేవి అనే మహిళకు లాటరీ వచ్చిందని గుర్తుతెలియని వ్యక్తులు నమ్మబలికి ఆమె నుంచి రూ.5.9లక్షలు స్వాహా చేశారు. ఈ మేరకు జనవరిలో గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది.

విజయవాడ మీదుగా ప్రత్యేక రైళ్లు



రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతామని, ఇప్పటికే నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లను ఈ నెల వరకు పొడిగిస్తున్నామని రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రత్యేక రైళ్లు ఇవే..

- 02764 సికింద్రాబాద్–తిరుపతి ప్రత్యేక రైలు
- 07451 తిరుపతి–శ్రీకాకుళం
- (07452)శ్రీకాకుళం–తిరుపతి
- 07455 సికింద్రాబాద్–తిరుపతి
- 07565 సికింద్రాబాద్–పూరి
- (07566) పూరి–సికింద్రాబాద్
- 05906 నంబరు డిబ్రూగర్–కన్యాకుమారి
- (05905)కన్యాకుమారి– డిబ్రూగర్

పొడిగించిన ప్రత్యేక రైళ్లు

- ప్రతి శని, మంగళ, గురు వారాల్లో నడిచే మచిలీపట్నం–కర్నూలు సిటీ 07067 ప్రత్యేక రైలు ఈ నెల 29వ తేదీ వరకు..
- ప్రతి ఆది, బుధ, శుక్రవారాలలో నడిచే కర్నూలు సిటీ–మచిలీపట్నం 07068 ప్రత్యేక రైలును ఈ నెల 30వ తేదీ వరకు..
- ప్రతి ఆది, సోమ, బుధ, శుక్రవారాల్లో నడిచే మచిలీపట్నం–తిరుపతి 07095 ప్రత్యేక రైలును ఈ నెల 14వ తేదీ వరకు..
- ప్రతి సోమ, మంగళ, గురు, శనివారాల్లో నడిచే తిరుపతి–మచిలీపట్నం 07096 ప్రత్యేక రైలును ఈ నెల మూడు నుంచి 15వ తేదీ వరకు పొడిగించారు.

కొరియర్‌లో డ్రగ్స్.. నిందితుల అరెస్టు

కాకినాడ క్రైం: కొరియర్ ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మంగళవారం మీడియాకు వెల్లడించిన వివరాలు ఇలా... గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన రాహుల్ అనే యువకుడు కాకినాడలోని కొందరు యువకులకు కొన్నాళ్లుగా కొరియర్ సర్వీసుల ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. దీనిపై నిఘా వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చాయి. కాకినాడ వాకలపూడికి చెందిన నాగిరెడ్డి సుభాష్, ఉమ్మిడి ఇమ్మానుయేల్ డీటీడీసీ కొరియర్ బోట్స్‌క్లబ్‌లో మంగళగిరి నుంచి వచ్చిన డ్రగ్స్ అందుకున్నారని పోలీస్ విచారణలో నిర్ధారణైంది. మాత్రల రూపంలో ఉన్నది ఎండీఎంఏ (మిథైలీన్ డైఆక్సీ మిథాంఫెటామైన్)గా గుర్తించారు. వివిధ రంగుల్లో ఉన్న 15 మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. మాత్రలుగాను, పొడిగాను చేసి సేవిస్తున్నట్లు గుర్తించారు. ఐదు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నాగిరెడ్డి సుభాష్, ఉమ్మిడి ఇమ్మానుయేల్‌తో పాటు గంజాయి, ఎండీఎంఏ పొడిని సేవిస్తున్న యువకులు శివదుర్గ, సాయికుమార్, రామ్‌ప్రసాద్, సుధాకర్ ఠాగూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ గ్రాడ్యుయేట్లు. ఇమ్మానుయేల్ చింతపల్లి ఏజెన్సీలో గంజాయిని గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొని నగరంలో యువత, విద్యార్థులకు విక్రయిస్తున్నాడని విచారణలో తేలింది. రాహుల్ గంజాయి, ఎల్ఎస్‌డీ(పేపర్ డ్రగ్) డ్రగ్స్ కేసులో పాత నిందితుడు.



డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

చెన్నై జలమయం



అరుంబాక్కం మెట్రో రైల్వే స్టేషన్ వద్ద వరద నీరు

సాక్షి, చెన్నై: చెన్నై నగరం, శివారు జిల్లాల్లో భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు, పలు మార్గాలు జలమయం అయ్యాయి. ఈశాన్య రుతు పవనాల ప్రభావంతో తమిళనాడులో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి చెన్నై సహా తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో కుంభవృష్టి కురిసింది. అధికారులు అప్రమత్తంగా ఉంటూ నిల్వ ఉన్న నీటిని త్వరితగతిన బయటకు పంపించేందుకు యత్నిస్తున్నారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు కురుస్తాయనే సమాచారంతో ముందు జాగ్రత్త చర్యలు విస్తృతం చేశారు.

సెంట్రల్ జైలుకు 'జయలక్ష్మి' నిందితుల తరలింపు

కాకినాడ లీగల్: రూ.వందల కోట్లు డిపాజిట్ల రూపంలో సేకరించి బోర్డు తిప్పేసిన 'ది జయలక్ష్మి మ్యూచవల్లీ ఎయిడెడ్ మల్టీపర్పస్ కో–ఆపరేటివ్ సొసైటీ'కి సంబంధించిన ఆర్థిక నేరాల కేసులో నిందితులకు కాకినాడ న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ కేసులో సీఐడీ పోలీసులు శనివారం ముగ్గురిని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. నిందితులైన రాయవరపు సీతారామాంజనేయులు, రాయవరపు బదరీ విశాలాక్షి, రాయవరపు జయదేవమణిని కాకినాడ స్పెషల్ సబ్‌జైల్ నుండి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు మంగళవారం పోలీసులు తరలించారు. ఈ కేసులో ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ పబ్లిక్ ప్రాపర్టీ యాక్ట్ ప్రకారం రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టులో విచారణ జరుగుతోంది. ముగ్గురు నిందితులు ఈ నెల 11న రాజమహేంద్రవరం కోర్టుకు హాజరుకావాల్సి ఉంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.